అనుదినం... జనస్వరం
నవతెలంగాణ
గురువారం 11-1-2018 సమగ్ర తెలుగు దినపత్రిక
సంపుటి : 4 సంచిక : 14 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar, Mahaboobnagar, Warangal | www.navatelangana.com | 12 + 16 పేజీలు వెల : 5.00

వైరల్ వణుకు

చలి తీవ్రతతో ఆస్పత్రులకు రోగుల తాకిడి


ఫైల్

గతంలో ఎన్నడూలేని విధంగా ఈ సీజన్‌లో రాష్ట్రాన్ని చలి చంపేస్తున్నది. చల్లగాలులు ప్రజలను గజగజ వణికిస్తున్నాయి. చలి ప్రభావంతో వేలాది మంది రోగగ్రస్తులు అవుతున్నారు. దీంతో రాజధాని మొదలుకొని నగరాలు, పట్టణాలు, గ్రామాల్లోని ఆస్పత్రులు రోగులతో కిటకిటలాడుతున్నాయి. ఆస్తమా, బీపీ, షుగర్, గుండె, న్యూమోనియా, సైనస్, ఊపిరితిత్తులు, చర్మవ్యాధిగ్రస్తులు, గర్భిణులు, బాలింతలు, వృద్ధులు, చిన్న పిల్లలు, చంటి పిల్లలు అంతుచిక్కని జ్వరాలతో వణికిపోతున్నారు.

- మూడు నెలల్లో 1,90,236 మందికి చికిత్స
- జ్వరం, జలుబు, దగ్గు సమస్యలే అధికం
- చిన్నారులను వదలని న్యూమోనియా
- ముందు చూపులేని ఆరోగ్యశాఖ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ప్రభుత్వాస్పత్రులు రోగులతో కిటకిటలాడుతున్నాయి. చిన్నా పెద్ద అనే తేడా లేకుండా అనారోగ్యంతో ఆస్పత్రుల వైపు పరుగులు తీస్తున్నారు. గతేడాది సెప్టెంబర్ వరకు 4,09,709 కేసులు నమోదైతే.. చివరి మూడు నెల్లోనే 1,90,236 కేసులు రికార్డు కావడం పరిస్థితి తీవ్రతను తెలియజేస్తున్నది. ప్రయివేటు ఆస్పత్రుల్లో ఈ సంఖ్య రెట్టింపు స్థాయిలో ఉండే అవకాశం ఉంది. అత్యధికంగా హైదరాబాద్‌లో 12,133 కేసులు నమోదైతే.. మహబూబ్ నగర్‌లో 12018, ఆదిలాబాద్‌లో 10,496, సంగారెడ్డిలో 11,025, నిజామాబాద్‌లో 10056 నమోదైనట్టు ఆరోగ్యశాఖ గణాంకాలు వెల్లడిస్తున్నాయి. హైదరాబాద్ ఫీవర్ ఆస్పత్రికి సాధారణ రోజుల్లో 500–600 రోగులు రావడమే గొప్ప విషయం. ప్రస్తుతం 1200–1400 9

100 శాతం ఎఫ్‌డీఐ

రిటైల్ వ్యాపార రంగంలో అనుమతి

- ఎయిర్ ఇండియాలో 49 శాతం వాటా అమ్మకానికి సిద్ధం
- విదేశీ అమ్మకం కోసం మోడీ సర్కారు దౌడు : కేంద్ర క్యాబినెట్ నిర్ణయం


ఫైల్

న్యూఢిల్లీ: ఆర్థిక సంస్కరణల పేరుతో మోడీ ప్రభుత్వం విదేశీ మార్కెట్ శక్తులకు తలుపులు బార్లా తెరిచేసింది. ప్రధాని మోడీ నేతృత్వంలో బుధవారం జరిగిన కేంద్ర మంత్రివర్గం సమావేశంలో కీలక నిర్ణయాలు తీసుకున్నారు. అనేక రంగంల్లో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల (ఎఫ్‌డీఐ)ల పరిమితిని 49 శాతం నుంచి 100 శాతానికి పెంచుతూ నిర్ణయం తీసుకున్నారు. పలు రంగాల్లో ఎఫ్‌డీఐ నిబంధనల్ని సరళీకృతం, సులభతరం చేశారు. 'ఎయిర్ ఇండియా'లో 49 శాతం వాటాను అమ్మకానికి పెట్టారు. రిటైల్ వ్యాపారం, పౌర విమానయానం, రియల్ ఎస్టేట్, విద్యుత్, ఫార్మాస్యూటికల్స్... తదితర రంగాల్లో ఎఫ్‌డీఐ పెట్టుబడులుకు మార్గం 9

కేంద్ర నిర్ణయం తప్పు: సీపీఐ(ఎం) 9



తెలంగాణకు 50 .. ఏపీకి 60 టీఎంసీలు

- కృష్ణా బోర్డు వర్కింగ్ గ్రూప్ నిర్ణయం

వివరాలు 3లో

మతిస్థిమితం లేని యువతిపై లైంగికదాడి

- ఆలస్యంగా వెలుగులోకి


వివరాలు 3లో

స్కాలర్‌షిప్ దరఖాస్తుల గడువు పొడిగింపు

- ఫిబ్రవరి 10 వరకు దరఖాస్తుల స్వీకరణ :ఎస్సీ సంక్షేమ శాఖ

వివరాలు 9లో

ఇవి రాతి కట్టడాలు కాదు..! చైనాలో మంచు గడ్డలపై చెక్కిన కళాకృతులు



సివిల్స్ ఇంటర్వ్యూలకు 1099 మంది ఎంపిక

- మెయిన్స్ ఫలితాలు విడుదల చేసిన యూపీఎస్సీ
- ఫిబ్రవరి 19 నుంచి ఇంటర్వ్యూలు షురూ

వివరాలు 9లో

13 నుంచి జూనియర్ కాలేజీలకు

సంక్రాంతి సెలవు

- 14,15న ప్రభుత్వ సెలవులే, మిగిలిన ఒక్కరోజే అదనం: ఇంటర్ బోర్డు వెల్లడి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలోని ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రయివేటు, ఇతర జూనియర్ కాలేజీలకు ఈనెల 13 నుంచి సంక్రాంతి సెలవులను తెలంగాణ ప్రభుత్వం ప్రకటించింది. ఈనెల 13 నుంచి 15వ తేదీ వరకు 9

ప్రేమించట్లేదని..

- హత్యచేసిన ఉన్మాది
- హైదరాబాద్ మూసాపేటలో దారుణం



నవతెలంగాణ - సిటీబ్యూరో

వెంటపడుతున్నా...ప్రేమించట్లేదని ఓ ఉన్మాది ఘాతుకానికి పాల్పడ్డాడు. యువతి గదికెళ్లి దారుణంగా హత్యచేశాడు. హైదరాబాద్ పరిధిలోని మూసాపేట్‌లో గల హబీబ్‌నగర్‌లో మంగళవారం రాత్రి ఈ ఘటన జరిగింది. కూకట్‌పల్లి సీఐ ప్రసన్నకుమార్ వివరాల 9

కొక్కొరోకో..



ఇంత పెరిగింది..అంత పెరిగిందని సంతోషించడానికి మనకేం ఒరిగేదేం లేదు లేరా..

వేరుశనగ.. రైతు గోస

- తగ్గిన దిగుబడి.. పెరిగిన పెట్టుబడి
- ఎకరాకు ఐదు క్వింటాళ్ల దిగుబడే
- మార్కెట్ మాయాజాలంతో మోసపోతున్న రైతు


ఫైల్

ఆలస్యంగా కురిసిన వర్షాలు వేరుశనగ రైతులను మొదట్లోనే తీవ్ర దెబ్బతీయగా... మార్కెట్ మాయాజాలంలో చేతికందిన కొద్దిపాటి పంటకూ ఇప్పుడు ధర దక్కని దుస్థితి ఏర్పడింది. క్వింటా విత్తనాలు రూ.10 వేలకు కొని సాగు చేస్తే వచ్చిన దిగుబడితో అప్పులు తప్ప మరేమీ మిగలని పరిస్థితి. సకాలంలో వర్షాలు కురవక విత్తనాలు మొలకెత్తకపోవడం తో దిగుబడిపై తీవ్ర ప్రభావం పడింది. తీరా చేతికందిన కొద్దిపాటి పంటను మార్కెట్‌కు తీసుకపోతే...ప్రకటించిన కనీస మద్దతు ధర దక్కని పరిస్థితి. ప్రభుత్వం ప్రకటించిన ధర కూడా రైతులకు అందక గత వారం రోజుల్లో రెండుసార్లు ఆందోళనలు చేశారు.

వివరాలు 9లో

హిందువులు బీజేపీకి.. ముస్లింలు కాంగ్రెస్‌కు..

- రాజస్థాన్ క్యాబినెట్ మంత్రి వివాదాస్పద వ్యాఖ్యలు

జైపూర్: హిందువులైతే బీజేపీకి, ముస్లింలయితే కాంగ్రెస్‌కు ఓటేయాలని రాజస్థాన్ క్యాబినెట్ మంత్రి జశ్వంత్ యాదవ్ చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదమయ్యాయి. ఇందుకు సంబంధించిన వీడియో ఫుటేజీ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. రాష్ట్రంలోని అల్వార్ జిల్లా దుఫేడా గ్రామంలో జశ్వంత్.. ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీజేపీ హిందువుల పార్టీ.. మా పార్టీకి హిందువులే ఓటు వేయాలి. ముస్లింలు కాంగ్రెస్‌కే ఓటేయాలి అని అన్నారు. జశ్వంత్ తీరును వ్యతిరేకించిన కాంగ్రెస్.. అల్వార్ రిటర్నింగ్ అధికారికి ఫిర్యాదు చేసింది. రాజస్థాన్‌లోని అల్వార్, మండల్‌గఢ్ లోక్‌సభ స్థానాలకు ఈనెల 29న ఉప ఎన్నికలు జరగనున్న సంగతి తెలిసిందే. అల్వార్ స్థానం నుంచి జశ్వంత్.. బీజేపీ తరఫున బరిలో ఉన్నారు.

సెంట్రల్ స్కూల్స్‌లో ప్రార్థన మతాన్ని ప్రోత్సహిస్తుందా?

- రాజ్యాంగ ఉల్లంఘనగా సుప్రీంలో పిటిషన్

న్యూఢిల్లీ : దేశంలోని కేంద్రీయ విద్యాలయాలలోనూ, కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోని పాఠశాలల్లోనూ ఉదయం సమయంలో విద్యార్థులతో హిందీ, సంస్కృత భాషలలో చేయిస్తున్న ప్రార్థన హిందూ మతాన్ని ప్రోత్సహిస్తుందా? అనే అంశాన్ని సుప్రీం కోర్టు పరిశీలిస్తోంది. ఇది తీవ్రంగా పరిగణించాల్సిన రాజ్యాంగ సమస్యగా పేర్కొన్న సుప్రీంకోర్టు కేంద్రానికి, కేంద్రీయ విద్యాలయాలకు నోటీసులు జారీచేసింది. పాఠశాలల్లో ఉదయం సమయంలో చేయిస్తున్న ప్రార్థన రాజ్యాంగ విరుద్ధమని, అది ఒక ప్రత్యేక మతాన్ని ప్రోత్సహిస్తున్నదని పేర్కొంటూ దాఖలైన పిటిషన్‌పై రెండు వారాలలోగా స్పందించాలని, అటు కేంద్ర ప్రభుత్వాన్ని, ఇటు కేంద్రీయ విద్యాలయాలను సుప్రీం కోర్టు ఆదేశించింది.

జర్నలిస్టుపై ఎఫ్ఐఆర్ -సీఐటీయూ ఖండన

న్యూఢిల్లీ : ఆధార్ లీకేజీకు సంబంధించి వ్యవస్థాగత లోపాలను ఎత్తిచూపిన ట్రిబ్యూన్ పత్రిక జర్నలిస్టు రచనాఖైరాపై ప్రభుత్వం ఎఫ్ఐఆర్ నమోదు చేయడం కక్షసాధింపు చర్యగా సీఐటీయూ అభివర్ణించింది. వాస్తవానికి యూఐడీఏఐ వ్యవస్థలోని లోపాలను ఎత్తిచూపినందుకు జర్నలిస్టును ఆమె రిపోర్టు ఇవ్వడానికి బదులు ఎఫ్ఐఆర్ నమోదు చేయడాన్ని సీఐటీయూ తప్పు పట్టింది. ప్రజల వ్యక్తిగత గోప్యత హక్కుపై అనధికారిక చొరబాట్లను నివారించి వ్యక్తిగత డేటాను రక్షించేందుకు యూఐడీఏఐ వ్యవస్థలోని లోపాలపై విజయవంతంగా దర్యాప్తు చేసిన జర్నలిస్టును అభినందించాలని తెలిపింది. జర్నలిస్టుపై కక్షసాధింపు చర్య ప్రభుత్వ అధికార గర్వాన్ని ప్రతిబింబిస్తున్నదని పేర్కొంది.

సిక్కు వ్యతిరేక అల్లర్ల కేసులు

186 కేసుల పున:పరిశీలనకు సిట్

న్యూఢిల్లీ: 1984లో ఇందిరాగాంధీ హత్యానంతరం సిక్కులపై చెలరేగిన అల్లర్లకు సంబంధించి 186 కేసుల పునఃపరిశీలనకు ముగ్గురు సభ్యులతో కూడిన ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని (సిట్)ను ఏర్పాటు చేయాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. హైకోర్టు రిటైర్డ్ న్యాయమూర్తి నేతృత్వంలో పదవీ విరమణ పొందిన ఐపీఎస్ అధికారి, ప్రస్తుతం విధుల్లో ఉన్న ఐపీఎస్ అధికారితో సిట్ ఏర్పాటుచేయాలని పేర్కొంది. మూసివేసిన 186 కేసుల్లో పునర్విచారణకు అర్హమైనవి ఏవైనా ఉన్నాయా అన్న అంశాన్ని ఈ బృందం పరిశీలించాల్సి ఉన్నది. సిక్కు వ్యతిరేక అల్లర్లకు సంబంధించి మొత్తం 293 కేసుల్లో 186 కేసులను ఎలాంటి దర్యాప్తూ లేకుండా మూసివేశారంటూ రిటైర్డ్ న్యాయమూర్తి కెపిఎస్ రాధాకృష్ణన్ నేతృత్వంలో గతంలో వేసిన సూపర్‌వైజరీ కమిటీ కోర్టుకు నివేదిక సమర్పించడంతో సుప్రీంకోర్టు తాజాగా ఈ నిర్ణయం తీసుకుంది.

నైట్ డ్యూటీ మహిళలకు క్యాన్సర్ ముప్పు!

న్యూఢిల్లీ : దీర్ఘకాలం రాత్రి వేళల్లో విధులు నిర్వహించే మహిళలు తమ ఆరోగ్యం విషయంలో అందోళన చెందాల్సిందే! ఎక్కువ కాలం ఒక పద్దతి లేకుండా విధులు చేయవలసి వచ్చే క్యాన్సర్ సోకే ప్రమాదం ఉందని తాజా పరిశోధనలు హెచ్చరిస్తున్నాయి. రాత్రి వేళల్లో విధులు చేసే మహిళల్లో క్యాన్సర్ సోకే అవకాశం దాదాపు 19 శాతం అధికంగా ఉన్నట్టు వారు గుర్తించారు. ఆస్పత్రుల్లో నర్సు ఉద్యోగాలు చేసే వారిలో బ్రెస్ట్ క్యాన్సర్ ప్రమాదం ఉందని తేలింది. చైనాలోని వెస్ట్ చైనా మెడికల్ సెంటర్ ఆఫ్ సిచువాన్ విశ్వవిద్యాలయానికి చెందిన బృందం నాయకుడు క్సూలీ మా ఈ వివరాలు తెలియజేశారు. ఈ బృందంలోని సభ్యులు దాదాపు లక్షకు పైబడిన క్యాన్సర్ రోగుల వివరాలు అధ్యయనం చేశారు. ఉత్తర అమెరికా, యూరోప్, ఆస్ట్రేలియా, ఆసియా దేశాలకు చెందిన 39 లక్షలకు పైగా భాగస్వాముల అనుభవాలను పరిగణలోకి తీసుకున్నారు. ముఖ్యంగా రాత్రి డ్యూటీలు చేసే వారి ఆరోగ్య ప్రభావంపై వారు అధ్యయనం చేశారు. ఇదులలో పోల్చినప్పుడు రాత్రి డ్యూటీ చేసే మహిళల్లో 41 శాతం కేసుల్లో చర్మ క్యాన్సర్, 23 శాతం కేసుల్లో బ్రెస్ట్ క్యాన్సర్, 18 శాతం మందిలో పేగుల క్యాన్సర్ ముప్పు గుర్తించారు. కేవలం నర్సుల గురించి సేకరించిన వివరాల ప్రకారం, 58 శాతం మందికి బ్రెస్ట్ క్యాన్సర్ ముప్పు, 35 శాతం మందికి పేగుల్లో క్యాన్సర్, 28 శాతం మందిలో ఊపిరితిత్తుల క్యాన్సర్ సోకే అవకాశం నిర్ధారణ అయింది.



మోడీకి 'న్యాప్కిన్స్' నిరసన

- శానిటరీ న్యాప్కిన్స్‌ను పంపేందుకు సిద్ధమవుతున్న విద్యార్థులు
- జీఎస్టీ రద్దు చేయాలని, ఉచితంగా అందించాలని డిమాండ్



గ్వాలియర్ : శానిటరీ న్యాప్కిన్స్‌పై ప్రభుత్వం విధించిన 12శాతం జీఎస్టీని తగ్గించాలని కోరుతూ బీజేపీ పాలిత మధ్యప్రదేశ్‌లోని గ్వాలియర్ విద్యార్థు లు వినూత్న నిరసనకు దిగారు. రాతపూర్వక సందే శంతో కూడిన దాదాపు వెయ్యి శానిటరీ న్యాప్కిన్స్ ప్రధాని మోడీకి పంపేందుకు రంగం సిద్ధం చేస్తున్నారు.

వాటిని ఉచితంగా అందించాలని కూడా వారు డిమాండ్ చేస్తున్నారు. జీఎస్టీని రద్దుచేయాల న్న డిమాండ్‌తోపాటు, మహిళా సాధికారత, విద్యార్థి నులు ఎదుర్కొంటున్న వేధింపులపై అవగాహన కల్పించేందుకు ఈప్రచార కార్యక్రమాన్ని ప్రారంభించారు. తమ డిమాండ్లను రాసిన న్యాప్కిన్స్‌ను సేకరిం చే పని ఈ నెల నాలుగున ప్రారంభించారు. మార్చి 3న 'నిరసన న్యాప్కిన్స్'ను ప్రధానికి పంపనున్నారు. కాగా, ఈ నిరసన కార్యక్రమానికి సామాజిక మాధ్య మంలో వివిధ వర్గాల నుంచి విస్తృత మద్దతు లభిస్తు న్నది. ఇది కేవలం గ్వాలియర్‌లో ఉన్న మహిళలకు మాత్రమే అవసరమైనది కాదనీ, దేశ వ్యాప్తంగా ఉన్న మహిళలందరి సమస్య అని గ్వాలియర్ విద్యార్థులు చెబుతున్నారు. వాటిని ఉచితంగా అందించడం, జీఎస్టీని ఎత్తేయడం, రేట్లను తగ్గించే పని ప్రధాని ఒక్కరే చేయగలరని, అందుకే వాటిని ఆయనకు పం పాలని నిర్ణయించుకున్నట్టు వారు తెలిపారు. 'గ్రామీణ మహిళలు వాటికి బదులుగా ఇతరత్రా వాడటం వల్ల అంటువ్యాధుల సమస్యలను ఎదుర్కొంటు న్నారు.

ఉచితంగా అందించి సానిటరీ న్యాప్కిన్స్ వాడకాన్ని పెంచాల్సిన ప్రభుత్వం వాటిని విలాసవస్తు వుల జాబితాలో చేర్చి 12శాతం జీఎస్టీని విధించింది. అందుకే మేము వెయ్యి న్యాప్కిన్స్‌ను సేకరించి మార్చి 3న ప్రధానికి పంపుతాం' హరి మోహన్ చెప్పారు. పరిశుభ్రమైన న్యాప్కిన్స్ ఉచితంగా వారికి అందుబా టులో ఉంటే, వారు ఆరోగ్యంగా ఉంటారని అన్నారు.

ఇస్రో ఛైర్మెన్‌గా కె శివన్



న్యూఢిల్లీ: భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) ఛైర్మెన్‌గా ప్రఖ్యాత శాస్త్రవేత్త కె శివన్ ను కేంద్ర ప్రభుత్వం బుధవారం నియమించింది. ప్రస్తుత ఇస్రో ఛైర్మెన్ ఎ.ఎస్. కిరణ్ కుమార్ పదవీకాలం ఈ నెల12(శుక్రవారం)న ముగియ నుంది. ఆయన స్థానంలో కె. శివన్ పదవీ బాధ్యతలు స్వీకరించనున్నారు. సెక్రెటరీ, డిపార్ట్‌మెంట్ ఆఫ్ స్పేస్(డీఓఎస్), స్పేస్ కమిషన్ ఛైర్మెన్‌గా ప్రభుత్వం జారీ చేసిన ఆర్డర్‌ను క్యాబినెట్ నియామకాల కమిటీ ఆమోదం తెలిపింది. ప్రస్తుతం ఆయన విక్రం సారాభాయ్ అంతరిక్ష కేంద్రం డైరెక్టర్‌గా ఉన్నారు. ఆయన 1982లో ఇస్రోలో చేరి పీఎస్ఎల్‌వీ ప్రాజెక్టులో మిషన్ ప్లానింగ్, మిషన్ ఆకృతి, మిషన్ అనుసంధానం, విశ్లేషణకు అసాధారణంగా కృషి చేశారు. వివిధ పత్రికల్లో ఆయనకు చెందిన అనేక ప్రచురణలు ఉన్నాయి. ఆయన భారత జాతీయ ఇంజనీరింగ్ అకాడమీ, భారత వైమానిక సంస్థ, సిస్టమ్స్ సొసైటీ ఆఫ్ ఇండియా సభ్యుడు.

బిల్కిస్‌బానోకు పరిహారంపై వివరణ ఇవ్వండి

- గుజరాత్ ప్రభుత్వానికి సుప్రీంకోర్టు ఆదేశం

న్యూఢిల్లీ: గుజరాత్‌లో 2002 మార్చిలో జరిగిన అల్లర్ల సమయంలో సామూహిక లైంగికదాడికి గురైన బిల్కిస్‌బానోకు నష్టపరిహారం చెల్లించే విషయంపై ఆ రాష్ట్ర ప్రభుత్వాన్ని సుప్రీంకోర్టు నోటీసులు జారీ చేసింది. ఇందుకు సంబంధించి మార్చి 12లోపు సమాధానం ఇవ్వాల్సిందిగా ప్రధాన న్యాయమూర్తి దీపక్ మిశ్రా నేతృత్వంలోని త్రిసభ్య ధర్మాసనం బుధవారం ఆదేశించింది. నష్టపరిహారం చెల్లింపుకు సంబంధించి ఈ కేసులో బాధితురాలి ప్రాథమిక హక్కుల తీవ్ర ఉల్లంఘనను పరిగణనలోకి తీసుకోవాలని ఆమె తరపు న్యాయవాది శోభా దాఖలు చేసిన పిటిషన్‌లో పేర్కొన్నారు. గర్భవతి అయిన బిల్కిస్‌బానోపై సామూహిక లైంగికదాడికి పాల్పడి, ఆమె కుటుంబసభ్యులనందిరినీ దుండగులు హతమార్చిన విషయం తెలిసిందే. ఈ కేసులో 11మంది దోషులకు యావజ్జీవ కారాగార శిక్ష విధిస్తూ ముంబయి కోర్టు 2017లో తీర్పు నిచ్చింది. ఈ కేసులో దోషులుగా తేలిన పోలీసులపై ఎటువంటి క్రమశిక్షణా చర్యలు చేపట్టారో వివరణ ఇవ్వాల్సిందిగా గతేడాది నవంబరులో గుజరాత్ ప్రభుత్వాన్ని సుప్రీంకోర్టు ఆదేశించింది.

జేఎన్‌యూ నుంచి మరో విద్యార్థి అదృశ్యం

న్యూఢిల్లీ : జేఎన్‌యూ నుంచి మరో విద్యార్థి అదృశ్యమయ్యాడు. మంగళవారం మధ్యాహ్నం నుంచి లైఫ్ సైన్స్ స్కూల్‌కు చెందిన పీహెచ్‌డీ స్కాలర్ ముకుల్ జైన్ కనిపించకుండా పోయాడని పోలీసులకు ఫిర్యాదు అందింది. ముకుల్ జైన్ చివరిసారిగా జేఎన్‌యూ ప్రాంగణం తూర్పు ద్వారం వద్ద మధ్యాహ్నం 12:30 గంటలకు కనిపించాడు. ఏబీవీపీ విద్యార్థులతో గొడవ తర్వాత నజీబ్ అహ్మద్ 2016లో అదృశ్యమైన విషయం తెలిసిందే. అతని ఆచూకీని ఢిల్లీ పోలీసులు ఇప్పటి వరకూ కనుక్కోలేకపోయారు..

కాల్బుర్గీ హత్య కేసు..

కేంద్రం, రాష్ట్రానికి సుప్రీంకోర్టు నోటీసులు

న్యూఢిల్లీ: తన భర్తహత్య కేసు దర్యాప్తునకు స్పెషల్ ఇన్వెస్టిగేషన్ టీమ్ (సిట్)ను ఏర్పాటు చేయాలని కోరుతూ ప్రముఖ హేతువాది ఎంఎం కాల్బుర్గీ భార్య ఉమాదేవి దాఖలు చేసిన పిటిషన్ నేపథ్యంలో కేంద్రం, కర్నాటక ప్రభుత్వాలకు, ఎన్ఐఏకు సుప్రీంకోర్టు నోటీసులు జారీచేసింది. ఆరువారాల్లో సమాధానం ఇవ్వాల్సిందిగా ఆదేశించింది. రాష్ట్ర పోలీసుల దర్యాప్తుపట్ల తనకు సంతృప్తిగా లేదనీ, ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని ఏర్పాటుచేసేలా ఆదేశాలు జారీచేయాలని ఉమాదేవి తన పిటిషన్‌లో పేర్కొన్నారు. దర్యాప్తును సుప్రీంకోర్టు, లేదా హైకోర్టు మాజీ న్యాయమూర్తుల పర్యవేక్షణలో దర్యాప్తు కొనసాగేలా ఆదేశించాలని కోరారు. కర్నాటక పోలీసుల దర్యాప్తులో ఎలాంటి పురోగతీ కనిపించడం లేదని ఆమె ఆరోపించారు. దర్వాడ్‌లోని తన నివాసం బయట 2015 ఆగస్టులో కల్బుర్గీని దుండగులు అతి సమీపం నుంచి కాల్పులు జరిపి హత్య చేసిన విషయం తెలిసిందే. హిందూత్వ భావజాలంపై విమర్శనాస్త్రాలు సంధించిన ప్రముఖ హేతువాదులు గోవింద్ పన్సారె, నరేంద్ర దభోల్కర్ హత్య కేసుల్లో కూడా పోలీసులకు ఇప్పటివరకూ ఎలాంటి పురోగతీ సాధించలేకపోయారనీ ఉమాదేవి తరపు న్యాయవాది కోర్టుకు తెలిపారు. ప్రతిపక్షాన్ని, విలువలను చంపేస్తున్న ప్రమాదకరమైన ధోరణి దేశానికి చాలా చెడ్డపేరు తెస్తున్నదని గోవింద్ పన్సారె, నరేంద్ర దభోల్కర్ హత్య కేసుల దర్యాప్తును కోర్టు పర్యవేక్షణలో జరపాలని కోరుతూ దాఖలైన పిటిషన్ విచారణ సందర్భంగా 2017 డిసెంబరులో బాంబే హైకోర్టు వ్యాఖ్యానిం చింది. అదే తరహాలో హత్యకు గురైన ప్రముఖ సామాజిక కార్యకర్త, జర్నలిస్టు గౌరీ లంకేశ్ కేసులోనూ ఇప్పటివరకూ ఎవరినీ అరెస్టు చేయకపోవడం గమనార్హం.

స్థిరంగా చైనా వృద్ధిరేటు

- ప్రపంచ బ్యాంక్ వెల్లడి

బీజింగ్ : చైనా వృద్ధిరేటు గతేడాది స్థిరంగా కొనసాగిందని ప్రపంచ బ్యాంక్ అభిప్రాయపడింది. వృద్ధిరేటు తగ్గుముఖం పట్టకుండా చైనా నియంత్రించుకుందని పేర్కొన్నది. ప్రపంచ బ్యాంక్ విడుదల చేసిన గ్లోబల్ ఎకనామిక్ ప్రాస్పెక్ట్స్‌లోని (జీఈపీ) వివరాల ప్రకారం...చైనా గతేడాది 6.8శాతం వృద్ధిరేటు సాధించగా, భారత్ 6.7శాతం సాధించింది. చైనా వృద్ధిరేటు భారత్ కంటే 0.1శాతం అధికంగా ఉంది. హౌజింగ్ మార్కెటింగ్ సెక్టర్‌లో వచ్చిన ఆటుపోటులను చైనా నిలదొక్కుకుని నిలిచింది. వృద్ధిరేటు తగ్గిపోకుండా అవసరమైన చర్యలు చేపట్టింది. చైనా స్థూలజాతీయోత్పత్తి (జీడీపీ) ఈ దశాబ్దంలో 6.0 నుంచి 6.5 మధ్యలో ఉంటుందని జీఈపీ మేనేజర్ ఫ్రానిస్కా లీస్‌లోట్టే ఓన్‌సోర్జ్ తెలిపారు.


ట్రంప్ సర్కార్‌కు చుక్కెదురు

- డాకా డ్రీమర్ స్కీమ్‌ని కొనసాగించాలని కోర్టు ఆదేశాలు



వాషింగ్టన్ : ట్రంప్ సర్కార్‌కు యూఎస్ కోర్టులో చుక్కెదురైంది. డాకా (డిఫర్డ్ యాక్షన్ ఫర్ చైల్డ్‌హుడ్ అరైవల్స్) డ్రీమర్ స్కీమ్‌ని ఎత్తివేయాలని యూఎస్ ప్రభుత్వం కుట్ర పన్నింది. దీంతో, 8లక్షల మంది ఇబ్బందులు పడుతున్నారు. డాకా డ్రీమర్ స్కీమ్‌ని ప్రభుత్వం కొనసాగించేలా ఆదేశాలు జారీచేయాలని అభ్యర్థిస్తూ పలువురు బాధితులు న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. ఈకేసును విచారించిన యూఎస్ కోర్టు డాకా డ్రీమర్ స్కీమ్ ఎత్తివేతపై స్టే ఉత్తర్వులు జారీ చేసింది. తదుపరి ఉత్తర్వులు జారీ చేసేంత వరకు ఇమ్మిగ్రెంట్స్‌ను ఎలాంటి ఇబ్బందులకు గురిచేయొద్దని శాన్‌ఫ్రాన్సిస్కో న్యాయమూర్తి విలియమ్ అల్‌సప్ ట్రంప్ సర్కార్‌ను ఆదేశించారు. కాగా, సరైన ధ్రువీకరణ పత్రాలు లేకుండా అమెరికాకు వచ్చినవారి పిల్లల రక్షణ కోసం 2012లో నాటి అమెరికా అధ్యక్షుడు బరాక్ ఒబామా డాకా డ్రీమర్ స్కీమ్‌ని ప్రవేశపెట్టారు. ఈస్కీమ్ ప్రకారం...30ఏండ్ల లోబడ్డ వారంతా తమ వ్యక్తిగత సమాచారాన్ని యూఎస్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ హోమ్ సెక్యూరిటీకి అందజేయాలి. ప్రతీ రెండేండ్లకు ఒకసారి వ్యక్తిగత సమాచారాన్ని అధికారులు సేకరించి పరిశీలిస్తారు. ఒబామా ప్రవేశపెట్టిన ఈ స్కీమ్‌ని రద్దు చేయనున్నట్టు గతేడాది సెప్టెంబర్‌లో ట్రంప్ ప్రకటించారు. ఈ ఏడాది మార్చి5 నుంచి డాకా డ్రీమర్ స్కీమ్‌లో పేర్లు నమోదు చేసుకున్నవారి దరఖాస్తులను రెన్యువల్ చేయబోమని, కొత్త దరఖాస్తులను స్వీకరించమని అధికారులు ప్రకటించారు. ఈనేపథ్యంలో పలువురు బాధితులు న్యాయస్థానాన్ని ఆశ్రయించారు.

బ్రిటన్ ప్రధాని క్యాబినెట్‌లో ఇన్ఫోసిస్ నారాయణమూర్తి అల్లుడికి చోటు


రిషి సునక్


లండన్ : బ్రిటన్ ప్రధాని థెరిసా మే ఇద్దరు భారతీయ సంతతి ఎంపీలకు తన క్యాబినెట్‌లో స్థానం కల్పించారు. ఆ ఇద్దరిలో ఇన్ఫోసిస్ వ్యవస్థాపకుడు నారాయణమూర్తి అల్లుడు రిషి సునక్ కూడా ఉన్నారు. థెరిసా మేకు చెందిన కన్జర్వేటివ్ ప్రభుత్వం తాజాగా తన మంత్రి మండలిని విస్తరించింది. కొత్తగా మంత్రి బాధ్యతలు దక్కిన భారతీయ సంతతి వారిలో రిషి సునక్‌తో పాటు సుయెల్ల ఫెర్నాండేజ్ ఉన్నారు. ఎంపీ ఫెర్నాండేజ్ పూర్వీకులు గోవాకు చెందినవారు. అయితే భారతీయ సంతతి ఎంపీలు ఇద్దరూ బ్రిగ్జిట్‌కు అనుకూలంగా ఓటేశారు. ఇన్ఫోసిస్ వ్యవస్థాపకుడు నారాయణమూర్తి అల్లుడు సునక్ బ్రిటన్ ప్రభుత్వంలో హౌజింగ్ శాఖ మంత్రిగా చేయనున్నారు. నార్త్ యార్క్‌షైర్‌లోని రిచ్‌మండ్ నుంచి 2015లో తొలిసారి ఎన్నికయ్యారు. ఆ తర్వాత 2017 మళ్లీ ఎన్నికయ్యారు. 37 ఏండ్ల రిషి సునక్.. ఆక్స్‌ఫర్డ్, స్టాన్‌ఫర్డ్ విశ్వవిద్యాలయాల్లో చదువుకున్నారు. బెంగుళూరుకు చెందిన ఓ సిలికాన్ వ్యాలీ కంపెనీలో సునక్ పెట్టుబడులు ఉన్నాయి.

కాలిఫోర్నియాలో వరదలు

బురదలో చిక్కుకుని 13మంది మృతి, 20 మందికి గాయాలు

- కొనసాగుతున్న సహాయక చర్యలు

కాలిఫోర్నియా: అమెరికాలోని కాలిఫోర్నియాలో వరదలు బీభత్సం సృష్టిస్తున్నాయి. భారీ వర్షాలు, వరదల కారణంగా కొండచరియలు విరిగిపడి 13మంది మృతి చెందారు. మరో 20మంది గాయపడ్డారు. బురదల్లో చిక్కుకుని మరికొందరు గల్లంతై ఉంటారని అధికారులు అనుమానిస్తున్నారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో సహాయక చర్యలు చేపట్టారు. జాతీయ వాతావరణ కేంద్రం తెలిపిన వివరాల ప్రకారం...కాలిఫోర్నియాలో మంగళవారం నుంచి ఎడతెరపి లేకుండా వర్షాలు కురుస్తున్నాయి. వరద ఉధృతికి కొండచరియలు విరిగిపడ్డాయి. రోడ్లన్నీ బురదమయం అయ్యాయి. వెంచురా కౌంటీలో 5.5అంగుళాల వర్షపాతం నమోదైంది. ఇటీవల వేల ఎకరాల్లో కార్చిచ్చు చెలరేగిన నేపథ్యంలో వరదను కట్టడి చేయలేకపోతున్నారు. వరద ఉధృతి ఎక్కువైంది. శాంతా బర్బారా సమీపంలోని మౌంటు సిటీలో నీటి ప్రవాహానికి కొండలపై నుంచి భారీగా బురద, బండరాళ్లు కొట్టుకువచ్చి జనావాసాలపై పడ్డాయి. ఈ కారణంగా పదుల సంఖ్యలో ఇండ్లు ధ్వంసమయ్యాయి. పలువురు మృతిచెందగా, మరికొంత మంది గల్లంతయ్యారు. వేలాది ఇండ్లల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయడంతో ప్రజలు ఇబ్బందులుపడుతున్నారు. అప్రమత్తమైన అధికారులు యుద్ధప్రాతిపదికన సహాయక చర్యలు చేపడుతున్నారు. శిథిలాల కింద చిక్కుకున్న వారి కోసం తీవ్రంగా గాలిస్తున్నారు. అనేక రహదరులపై బురద నిలిచిపోవడం సహాయక చర్యలకు ఆటంకంగా మారింది. కాగా, ఓ వైపు గడ్డ కట్టిస్తున్న చలి, మరో వైపు వర్షాలు అమెరికాను అతలాకుతలం చేస్తున్నాయి. లోతట్టు ప్రాంతాల ప్రజలు సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లాలని అధికారులు హెచ్చరికలు జారీ చేశారు.



కరీబియన్ దీవుల్లో భారీ భూకంపం

- సునామీ హెచ్చరికలు జారీ

వాషింగ్టన్: మధ్య అమెరికాలోని కరీబియన్ దీవుల్లో భారీ భూకంపం సంభవించింది. భూకంప తీవ్రత రిక్టర్ స్కేలుపై 7.8గా నమోదైంది. బుధవారం తెల్లవారుజామున గం.5-30నిమిషాల సమయంలో జమైకా పశ్చిమప్రాంతంలో భూకంపం వచ్చినట్టు యూఎస్ జియోలాజికల్ సర్వే అధికారులు వెల్లడించారు. భూకంప కేంద్రం 10 కిలోమీటర్ల లోతులో కేంద్రీకరించిందన్నారు. దీని ప్రభావం వల్ల ప్యూటోరికో, యూఎస్ వర్జిన్ ఐలాండ్స్ తదితర ప్రదేశాల్లో సునామీ సంభవించే అవకాశాలున్నట్టు పసిఫిక్ సునామీ హెచ్చరికల కేంద్రం తాజాగా పేర్కొంది. భూకంప కేంద్రం నుంచి తీరప్రాంతంలోని వెయ్యి కిలోమీటర్ల మేర సునామీ వచ్చే అవకాశాలున్నట్టు యూఎస్ జియోలజికల్ సర్వే అధికారులు హెచ్చరించారు. ఈ పరిధిలో కరీబియన్ దీవులతో పాటు, సెంట్రల్ అమెరికా, అమెరికా సహా మెక్సికోలోని కొన్ని ప్రాంతాలు ఉన్నాయి. అయితే, భూకంపం కారణంగా జరిగిన ప్రాణ, ఆస్తినష్టానికి సంబంధించిన వివరాలు తెలియరాలేదు. సునామీ హెచ్చరికల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హోండ్యూరన్ అధ్యక్షుడు జువాన్ ఓర్లాండో హెర్నాండెజ్ ట్వీట్ చేశారు.

ఓప్రాపై గెలుపు నాదే...

- అమెరికా అధ్యక్షుడు ట్రంప్

వాషింగ్టన్: అమెరికాలో 2020లో జరుగనున్న అధ్యక్ష ఎన్నికల్లో ప్రముఖ అమెరికన్ టెలివిజన్ హోస్ట్ ఓప్రా విన్‌ఫ్రే పోటీ చేయలేదని, ఆమె ఒకవేళ పోటీచేసినా చిత్తుగా ఓడిస్తానని అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అన్నారు. ఇటీవల జరిగిన గోల్డెన్ గ్లోబ్ అవార్డ్స్ కార్యక్రమంలో ఓప్రా ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. 2020లో అధ్యక్ష ఎన్నికల్లో తాను పోటీ చేయనున్నట్టు వెల్లడించారు. ఈ విషయంపై తాజాగా ట్రంప్ స్పందించారు. 'నేను ఓప్రాను ఓడించగలను. నాకు ఆమె బాగా తెలుసు. ఓప్రా అంటే నాకు గౌరవం. ఆమె 2020 అధ్యక్ష ఎన్నికల్లో పోటీ చేయదని నా అభిప్రాయం. అయినా ఓప్రా లాంటి వ్యక్తితో అధ్యక్ష ఎన్నికల్లో పోటీ పడటం చాలా ఫన్నీగా ఉంటుంది. ఓప్రా నిర్వహించే కార్యక్రమాల్లో నేను కూడా పాల్గొన్నాను.' అని అన్నారు.

పాక్‌కు ఇచ్చిన నిధులను తిరిగి రాబడతాం : ట్రంప్

ఇస్లామాబాద్ : ఉగ్రసంస్థల నిర్మూలన కోసం పాకిస్తాన్‌కు తామిచ్చిన నిధులను ఆ దేశం పక్కదారి పట్టించిందని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ అన్నారు. ఉగ్రసంస్థల కార్యకలాపాలను కట్టడిచేయడంలో పాక్ విఫలమైందన్నారు. ఈ నేపథ్యంలో ఆదేశానికి ఇచ్చిన నిధులను తిరిగి రాబడతామన్నారు. పాకిస్తాన్‌కు ఆర్థిక సాయాన్ని నిలిపివేసినట్టు అమెరికా ఇటీవల ప్రకటించిన సంగతి తెలిసిందే. సైనిక సాయంతో కలిపి దాదాపు 2 బిలియన్ డాలర్ల ఆర్థిక సాయాన్ని అమెరికా పాక్‌కు ఇవ్వకుండా నిలిపివేసింది. ఈ నేపథ్యంలో పాక్‌ను మరింత ఒత్తిడిలోకి నెట్టేయాలని అమెరికా భావిస్తున్నది. ఇందులో భాగంగానే.. ఇప్పటి వరకు ఇచ్చిన నిధులను తిరిగి రాబట్టాలని నిర్ణయించుకున్నట్టు సమాచారం. 2002 నుంచి అమెరికా పాక్‌కు ఆర్థికంగా అండగా నిలుస్తూ వస్తోంది. ఇప్పటివరకు 33 బిలియన్ డాలర్లకు పైగా సాయం రూపంలో ఇచ్చింది. అయితే, కొంతకాలంగా ఇరు దేశాల మధ్య సంబంధాలు బెడిసికొట్టాయి. పాక్ ఉగ్రవాదులకు స్వర్గధామంగా మారిందని ట్రంప్ వ్యాఖ్యలు చేయడంతో రెండు దేశాల మధ్య చిచ్చు రాజుకుంది. ఉగ్రవాదుల విషయంలో పాక్ తన వైఖరి మార్చుకోవాలని అమెరికా పదేపదే హెచ్చరించింది. అయినప్పటికీ పాక్ నుంచి స్పందన రాకపోవడంతో 2018కి గానూ తాము అందించే ఆర్థిక సాయాన్ని నిలిపివేసింది.

పాక్ జర్నలిస్ట్ అపహరణకు విఫలయత్నం

- సాయుధుల చెర నుంచి తప్పించుకున్న తాహా సిద్దిఖీ
- ఇస్లామాబాద్ ఎయిర్‌పోర్ట్‌కు సమీపంలో ఘటన

ఇస్లామాబాద్ : పాకిస్తాన్ ప్రముఖ జర్నలిస్ట్ తాహా సిద్దిఖీని కొందరు గుర్తుతెలియని దుండగులు కిడ్నాప్ చేసేందుకు విఫలయత్నం చేశారు. ఇస్లామాబాద్ ఎయిర్‌పోర్ట్‌కు సమీపంలో బుధవారం ఈ ఘటన జరిగింది. అయితే, సాయుధుల చెర నుంచి సిద్దిఖీ ఎట్టకేలకు తప్పించుకుని పారిపోయారు. పాక్ సహా అనేక విదేశీ మీడియా సంస్థల్లో ఈ వార్త దావానలంలా వ్యాపించింది. సిద్దిఖీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దుండగుల కోసం గాలిస్తున్నట్టు పోలీసులు తెలిపారు. స్థానిక అధికారులు, బాధితుడి కథనం మేరకు....ఇస్లామాబాద్ ఎయిర్‌పోర్ట్‌కు బయలుదేరిన సిద్దిఖీని 12మంది దుండగులు అపహరించారు. తుపాకులు గురిపెట్టి బెదిరించి కారులో ఎత్తుకెళ్లారు. మార్గం మధ్యలో దుండగులు చెర నుంచి తప్పించుకుని పారిపోయినట్టు సిద్దిఖీ తెలిపారు.

అమెరికా యువతిని పెండ్లి చేసుకుని

పౌరసత్వాన్ని కోల్పోయిన ప్రవాస భారతీయుడు

వాషింగ్టన్: అమెరికా యువతిని పెండ్లి చేసుకుని చట్టపరంగా పౌరసత్వం పొందిన ఓ ప్రవాస భారతీయుడు యూఎస్ పౌరసత్వాన్ని కోల్పోయాడు. స్థానిక కోర్టు తీర్పు ఆదేశాల మేరకు ఎన్నారైని ఇండియాకు తిరిగి పంపించనున్నట్టు అమెరికా పేర్కొన్నది. వివరాల్లోకి వెళ్తే... బల్జీందర్ సింగ్ (43) అనే వ్యక్తి ప్రస్తుతం న్యూజెర్సీలో నివాసం ఉంటున్నాడు. అమెరికా యువతిని పెండ్లి చేసుకున్న అతను 2006లో ఇక్కడి పౌరసత్వాన్ని పొందాడు. 1991లో అతను అమెరికాకు వచ్చాడు. అయితే, సరైన గుర్తింపు పత్రాలను, ట్రావెట్ డాక్యుమెంట్లను ఆ సమయంలో ఇమ్మిగ్రేషన్ అధికారులకు సమర్పించలేదు. అంతేగాకుండా, అతని పేరును దేవీందర్‌సింగ్ అని తప్పుగా పేర్కొన్నాడు.

ఈ నేపథ్యంలో అతన్ని ఇండియాకు తిరిగి పంపించేయాలంటూ ఫెడరల్ కోర్టు ఆదేశాలను జారీ చేసింది. ఈ నేపథ్యంలో అతను అక్కడి యువతిని పెండ్లి చేసుకున్నాడు. ఒక నెల తర్వాత తనకు అమెరికాలో ఆశ్రయం కల్పించాలంటూ న్యాయస్థానాన్ని ఆశ్రయించాడు. అంతేగాకుండా, తన పేరును ఈసారి బల్జిందర్ సింగ్‌గా పేర్కొన్నాడు.ఈ క్రమం లో గతవారం న్యూజెర్సీలోని ఫెడరల్ జడ్జి కీలక తీర్పును వెలువరించారు. బల్జీందర్ సింగ్ తన నేచురలైజేషన్‌ను ఉపసంహరించుకోవచ్చంటూ న్యాయమూర్తి తీర్పు ఇచ్చారు. బల్జీందర్ సింగ్‌ను తిరిగి భారత్‌కు పంపించాలని ఆదేశించారు.

చెక్కు రూపంలోనే పెట్టుబడి ఇవ్వండి

- 31.58 శాతం మంది రైతులు
- రైతుల అభిప్రాయాలు సేకరించిన వ్యవసాయ శాఖ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఈ ఏడాది ఖరీఫ్ నుంచి సాగు పెట్టుబడిగా ఇవ్వబోయే ఎకరానికి రూ. 4వేలు చెక్కు రూపంలోనే ఇవ్వాలని 31.58శాతం మంది రైతులు కోరినట్టు వ్యవసాయ శాఖ ముఖ్య కార్యదర్శి సి. పార్థసారధి తెలిపారు. 30 జిల్లాల్లో 551 మండలాల్లోని 624 గ్రామాల్లో వ్యవసాయ శాఖ అధికారులు బుధవారం సర్వే నిర్వహించినట్టు పేర్కొన్నారు. ఎకరానికి ఇచ్చే రూ.4 వేలను ఏ రూపంలో అందజేస్తే బాగుంటుందని 62,677 మంది రైతులతో అధికారులు నేరుగా మాట్లాడినట్టు తెలిపారు. ప్రస్తుతం రైతులకున్న ఖాతాల్లోనే పెట్టుబడి మొత్తాన్ని జమ చేసినా ఫర్వాలేదని 27.55 శాతం మంది రైతులు తమ అభిప్రాయాలు చెప్పినట్టు తెలిపారు. ప్రభుత్వం ఇచ్చే పెట్టుబడి నగదు రూపంలో నేరుగా అందించాలని 26.59 శాతం మంది రైతులు కోరినట్టు వివరించారు. పోస్టాఫీసుల ద్వారా పెట్టుబడి అందించాలని కేవలం 6.81 శాతం మంది రైతులు చెప్పినట్టు తెలిపారు. ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ద్వారా 1.03శాతం మంది ఇవ్వాలని సూచించినట్టు తెలిపారు. మొత్తంగా పరిశీలిస్తే దాదాపు 60 శాతం మంది రైతులు సాగుకు పెట్టుబడి సహకారాన్ని చెక్కుల రూపంలోగానీ నేరుగా బ్యాంకు ఖాతాల్లోగానీ జమ చేస్తే బాగుంటుందనే అభిప్రాయాలను వెల్లడించినట్టు తెలిపారు.

మూడుసార్లు దుమ్మాకొడితే వేటే!

అనుమతిలేని లేఅవుట్ల ప్లాట్లకు నో రిజిస్ట్రేషన్

- సర్పంచ్‌లకు, వార్డు మెంబర్లకు సిట్టింగ్ ఫీజు
- కో-ఆప్షన్ సభ్యుడిగా ఎన్ఆర్ఐలకూ చాన్స్ : కొత్త పంచాయతీరాజ్ చట్టంపై మంత్రుల సబ్‌కమిటీ
- ప్రత్యేకంగా హాజరైన మహమూద్ అలీ



ఎంసీఆర్‌హెచ్ఆర్డీలో సమావేశమైన మంత్రులు పోచారం, జూపల్లి, ఈటల, జగదీశ్‌రెడ్డి

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

అనుమతి లేని లేఅవుట్లలోని ప్లాట్లను రిజిస్ట్రేషన్ చేయకుండా చర్యలు తీసుకునే అంశాలపై పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అధ్యక్షతన ఏర్పాటైన మంత్రివర్గ ఉపసంఘం చర్చించింది. బుధవారం హైదరాబాద్‌లోని ఎంసీఆర్‌హెచ్ఆర్డీలో మూడో రోజూ సమావేశమైన మంత్రుల సబ్ కమిటీ దాదాపు ఎనిమిది గంటల పాటు అనేక అంశాలపై మంతనాలు నిర్వహించింది. సబ్ కమిటీ సభ్యులైన మంత్రులు తుమ్మల నాగేశ్వర్‌రావు, పోచారం శ్రీనివాస్‌రెడ్డి, ఈటల రాజేందర్ తో పాటు జగదీశ్వర్‌రెడ్డి కూడా చర్చలో పాల్గొన్నారు. అనుమతి లేని లేఅవుట్లలో ప్లాట్ల రిజిస్ట్రేషన్‌ను ఆపి వేస్తే ఎలా ఉంటుందన్న అంశంపై సంబంధిత శాఖ మంత్రి, డిప్యూటీ సీఎం మహమూద్ అలీతోనూ సబ్ కమిటీ ప్రత్యేకంగా మాట్లాడింది. ఎలాంటి అనుమతి లేకుండా లేఅవుట్లు చేస్తూ విచ్చలవిడిగా ప్లాట్లను రిజిస్ట్రేషన్లు చేస్తున్నారని. దీనిమూలంగా సామాన్యులు ఇబ్బందులు పడాల్సి వస్తున్నదని సబ్ కమిటీ సమావేశంలో చర్చకు వచ్చింది. లేఅవుట్‌కు అనుమతి ఉంటేనే ప్లాట్ల రిజిస్ట్రేషన్ చేసేలా చర్యలు తీసుకుంటే మంచిదనే అభిప్రాయం వ్యక్తం అయింది. ప్రస్తుతం జిల్లా పరిషత్, మండల పరిషత్‌ల్లో ఉన్నట్టుగానే పంచాయతీ పాలకవర్గ సమావేశాలకు హాజరయ్యే సభ్యులకు కూడా సిట్టింగ్ ఫీజు ఇవ్వాలనే అభిప్రాయం కూడా వ్యక్తం అయింది. ప్రత్యేక పరిస్థితుల్లో మినహా వరుసగా మూడుసార్లు పాలకవర్గ సమావేశాలకు దుమ్మా కొడితే అనర్హత వేటు కూడా వేసే విషయంపై చర్చించారు. పంచాయతీల్లో కో-ఆప్షన్ సభ్యులను నియమించే అంశాన్ని పరిశీలిస్తున్న సబ్‌కమిటీ, అందులో ఎన్ఆర్ఐలతోపాటు గ్రామంలో లేని వారికి కూడా అవకాశం ఇస్తే ఎలా ఉంటుందన్న దానిపైనా నిర్ణయానికి వచ్చారు. అలాగే పంచాయతీలోని జనాభాను బట్టి ఇద్దరు, ముగ్గురిని కూడా నామినేట్ చేసుకునే అవకాశాలపై కమిటీ సభ్యులు చర్చించారు. గ్రామానికి చెందిన ఎన్ఆర్ఐలు, గ్రామ మహిళ సమాఖ్య అధ్యక్షురాలు, నిపుణులకు అవకాశం కల్పించడం వల్ల గ్రామ అభివృద్ధికి వారి సహకారం ఉపయోగపడుతుందనే అభిప్రాయానికి వచ్చారు. 200 చదరపు గజాల లోపు విస్తీర్ణంలో జీ ప్లస్ 2 ఎత్తులో నిర్మించే భవనాల అనుమతులను గ్రామపంచాయతీలో ఇస్తుండగా, అంతకన్నా ఎక్కువ విస్తీర్ణంలో అయితే మండలాల్లోనూ ఎంపీడీఓ, తహశీల్దార్, ఈఓ పీఆర్డీ, పంచాయతీరాజ్ ఏఈలు నేతృత్వంలో కమిటీ ఏర్పాటు చేసి దాని అనుమతించే అంశంపైనా చర్చించారు. భవన నిర్మాణానికి హెచ్ఎండీఏ అనుమతిచ్చిన వారం రోజుల్లోనే పంచాయతీ క్లియరెన్స్ సైతం ఇవ్వాలని, లేని పక్షంలో అది అనుమతిచ్చినట్టుగానే భావించాల్సి ఉండేలా చట్టంలో పొందుపర్చే అంశం కూడా సబ్ కమిటీలో ప్రస్తావనకు వచ్చింది. అలాగే పరిశ్రమల ఏర్పాటుకు సంబంధించి పంచాయతీల నుంచి ఎలాంటి అనుమతి తీసుకోవాల్సిన అవసరం లేకుండా చట్టంలో మార్పులు చేయాలని మంత్రుల బృందం చర్చించింది. అటు సర్పంచులకు విస్తృత అధికారాలు కల్పించే దిశగా కొత్త చట్టంలో మార్పులు చేయాలని భావిస్తున్న సబ్ కమిటీ, అదే సమయంలో ప్రజలకోసం ప్రత్యేకంగా హక్కుల జాబితాను కూడా చట్టంలో పొందుపర్చే ప్రతిపాదనను లపరిశీలించింది. ప్రధానంగా డంప్‌యార్డులు, వైకుంఠధామాలు, పారిశుధ్యం లాంటివి ప్రజల హక్కులుగా చట్టంలో పెట్టే అంశాన్ని చర్చించారు. గురువారం కూడా సబ్‌కమిటీ మరోసారి సమావేశం కానుంది.

తెలంగాణకు 50 ..
ఏపీకి 60 టీఎంసీలు

- కృష్ణా బోర్డు వర్కింగ్ గ్రూప్ నిర్ణయం

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి

తెలంగాణకు 50, ఏపీకి 60 టీఎంసీల నీటి వినియోగానికి అనుమతిస్తూ కృష్ణా బోర్డు నిర్ణయించింది. జలసౌధలో బుధవారం జరిగిన బోర్డు వర్కింగ్ గ్రూప్ సమావేశంలో ఈ మేరకు అధికారులు నిర్ణయం తీసుకున్నారు. బోర్డు సభ్య కార్యదర్శి పరమేశం, తెలంగాణ నీటిపారుదల శాఖ ఇంజినీర్ ఇన్ చీఫ్ (ఈఎన్‌సీ) మురళీధర్‌రావు, ఆంధ్రప్రదేశ్ జలవనరుల శాఖ ఇంజినీర్ ఇన్ చీఫ్ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు. ఇప్పటి వరకు వినియోగించుకున్న నీటితో పాటు భవిష్యత్ వినియోగంపైనా ఈ సమావేశంలో చర్చించారు. అందుబాటులో ఉన్న 139 టీఎంసీల నీటిని వచ్చే ఆగస్టు నెల వరకు జాగ్రత్తగా ఉపయోగించుకోవాలని బోర్డు రెండు రాష్ట్రాలకు సూచించింది. వాటిలో నుంచి 20 టీఎంసీల నీటిని పక్కకు పెట్టి 110 టీఎంసీల నీటిని మాత్రమే రెండు రాష్ట్రాలు వినియోగించుకునేలా సమావేశంలో నిర్ణయించారు. శ్రీశైలం ప్రాజెక్టులో 868.8 అడుగులుగా ప్రస్తుత నీటి మట్టం ఉండగా 136.93 టీఎంసీల నీటి నిల్వ ఉన్నదని, ఈ ప్రాజెక్టులో డెడ్ స్టోరేజీ స్థాయి (ఎండీఎల్) కంటే ఎగువన ఉన్న 83.079 టీఎంసీల నీటిని వినియోగించుకునే వీలున్నదని సమావేశం అభిప్రాయ పడింది. నాగార్జునసాగర్‌లో ప్రస్తుత నీటి నిల్వ 182.34 టీఎంసీలు కాగా క్యారీ ఓవర్, డెడ్ స్టోరేజీ పోనూ 50.67 టీఎంసీలు వినియోగించుకునే అవకాశం ఉన్నదని సమావేశంలో నిర్ణయించారు. రెండు ప్రాజెక్టుల్లో అందుబాటులో ఉన్న 133.75 టీఎంసీల్లో తెలంగాణ 60.33, ఏపీ 73.42 టీఎంసీలు వినియోగించుకునే అవకాశం ఉన్నదని బోర్డు సభ్యులు నిర్ణయించారు. అయితే ఇప్పుడు తెలంగాణకు 50, ఏపీకి 60 టీఎంసీలు కేటాయించాలని బోర్డు వర్కింగ్ గ్రూప్ తీర్మానించింది. ప్రాజెక్టుల వారీగా నీటి కేటాయింపులు, వినియోగం తదితర అంశాలను తదుపరి సమావేశంలో చర్చించాలని నిర్ణయించారు. కృష్ణా బేసిన్‌లో లభ్యమయ్యే నీటిలో ఇప్పటి వరకూ ఏపీ 252.79 టీఎంసీలు, తెలంగాణ 101.72 టీఎంసీలు వినియోగించుకున్నట్టు బోర్డు అధికారులు వెల్లడించారు. కృష్ణా నదిలో ప్రవాహాలు ఆగస్టు నెల వరకూ రావటం లేదని, వరుసగా 2016-17, 2017-18 సంవత్సరాల్లో ఇదే జరిగిందని వారు వివరించారు. ఈ పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని రెండు రాష్ట్రాలూ జాగ్రత్తగా తాగు, సాగునీటి ప్రణాళికలు రూపొందించుకోవాలని బోర్డు కార్యదర్శి పరమేశం సూచించారు. టెలిమెట్రీ, చిన్న నీటివనరుల వినియోగం సహా ఇతర అంశాలపై ఏర్పాటు చేసిన కమిటీలు ఇచ్చే నివేదికల ఆధారంగా తదుపరి చర్యలు తీసుకోవాలని కూడా ఈ భేటీలో నిర్ణయించారు.

మతిస్థిమితం లేని యువతిపై లైంగికదాడి


ఆలస్యంగా వెలుగులోకి

నవతెలంగాణ-దౌల్తాబాద్

ఇంట్లో ఎవరూ లేని సమయంలో చొరబడి మతిస్థిమితం లేని యువతిపై ఓ వ్యక్తి లైంగిక దాడి చేశాడు. ఈ ఘటన బుధవారం సిద్దిపేట జిల్లాలో బుధవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. దౌల్తాబాద్ ఎస్ఐ మన్నెస్వామి తెలిపిన వివరాల ప్రకారం.. లింగరాజ్‌పల్లి గ్రామానికి చెందిన పెరుమన్ల పెరుమయ్య(51) ఐదు నెలల కిందట అదే గ్రామానికి చెందిన మతిస్థిమితం లేని యువతి(19)పై లైంగికదాడి చేశాడు. ఇటీవల ఆమెకు తరుచుగా కడుపు నొప్పి రావడంతో తల్లిదండ్రులు స్థానిక ఆస్పత్రికి తీసుకెళ్లారు. ఆమె ఐదు నెలల గర్భిణి అని వైద్యులు వెల్లడించారు. తల్లిదండ్రులు కూతురిని నిలదీయగా, గతంలో జరిగిన విషయాన్ని చెప్పింది. దీంతో బాధితురాలి తండ్రి దౌల్తాబాద్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తులో ఉంది.

సంపాదకీయం

బడ్జెట్ వల



రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్ కసరత్తు మొదలు పెట్టింది. అది ప్రజల ఆశలను తీరుస్తుందా? పాలకుల ఆకాంక్షలను నెరవేరుస్తుందా! పాలకుల ప్రాధాన్యతలకు ప్రజల కోరికలకు సహజంగానే సాపత్యం కుదరదు. కాబట్టి ప్లాన్ వన్ ప్లాన్ టూ తయారు చేస్తున్నట్టు తెలుస్తున్నది. ప్లాన్ వన్‌తో ఓటర్లను సంతృప్తి పరచాలి. బ్యాలెన్స్ చేసి బ్యాలెట్ పెట్టె దాకా తీసుకువెళ్లాలి. అది కుదరకపోతే, అసంతృప్తి హద్దులు దాటితే, ప్లాన్ టూ ప్రవేశపెడతారు. దానిపేరే విజన్ 2024. కలల బడ్జెట్, భారీ బడ్జెట్, బడుగుల బడ్జెట్, ఉపాధి బడ్జెట్ అని ఊదరగొట్టడం షురూ అయ్యింది. గతంలోకి తొంగిచూస్తే అసలు సంగతి అర్థమవుతుంది. బడ్జెట్ బండారం బయటపడుతుంది. గత నాలుగేండ్ల బడ్జెట్ అంచనాలు ఆకాశంవైపు చూస్తే అంకెలు నేలచూపు చూశాయి. పాలకులు సవరణలు చేసుకొని సరిపెట్టుకోవాల్సి వచ్చింది. కేంద్రం నుండి వస్తాయి అనుకున్న నిధులు రాలేదు. స్వంత వనరులు పెరుగుదలలో స్పష్టత రావాలి. సంజాయిషీలతో సరిపెట్టుకున్న పాలకులు ఈ బడ్జెట్‌లో ఏం చెబుతారు అనేది ప్రశ్నార్థకమే.

2024 వరకు రూ.4 లక్షల కోట్ల బడ్జెట్ చేరుకుంటుందని అంటున్నారు. విజన్ 2020 వెనుక ప్రపంచ బ్యాంకు ఉంది. మరి దీనివెనుక వున్న అదృశ్య శక్తి ఆలస్యంగానైనా బయటికి వస్తుంది. బడ్జెట్ మీద విస్తృత చర్చ జరపాలి. ప్రత్యామ్నాయ బడ్జెట్ కోసం ప్రజలు ఉపక్రమించాలి.

ఈ ఆర్థిక సంవత్సరంలో రూ.1,49,646 కోట్లు బడ్జెట్ ప్రవేశపెట్టారు. స్వంత ఆదాయం ద్వారా రూ.69,220.37 కోట్లు వస్తాయని అంచనా వేసుకున్నారు. కానీ ఈ ఎనిమిది నెలల కాలంలో ఆశించినంత ఆదాయం రాలేదు. నెలకు సగటున ఐదువేల కోట్లకు పైచిలుకు ఆదాయం రావాల్సి ఉండగా, 3 వేల కోట్లు మాత్రమే వసూలు అవుతున్నది. అనేక పథకాలకు దండిగా కోతలు విధిస్తున్నారు. అత్యంత వెనుకబడిన తరగతులకు వెయ్యి కోట్లు కేటాయించారు. ఇంత వరకు ఒక్కపైసా ఖర్చు చేయలేదు. ఎస్సీ, ఎస్టీలకు సబ్‌ప్లాన్ బడ్జెట్ ఖర్చు కాకుంటే క్యారీ ఫార్వార్డ్ చేస్తామన్నారు. ఆచరణలో నిధులు పక్కదారులు పడుతున్నాయి. ఆరోగ్యశ్రీకి డబ్బులు చెల్లించలేదని వైద్యం నిలిపివేయడం పాలకులకు అత్యంత అవమానకరం. బకాయిలు పేరుకుపోతున్నాయి. ధనిక రాష్ట్రంలో ధనానికి కొదవలేదు.. నిధులు దిక్కులేదు.. అన్నట్టుగా తయారైంది. ద్రవ్యలోటు ప్రతి ఏడాది పెంచుకుంటూ పోయారు. భూములు అమ్మాలనుకున్నారు. అంతగా ఆదరణ రాలేదు. ఎక్సైజ్ ఆదాయం పెంచుకునేందుకు పల్లెల్లో తండాల్లో గుడుంబా వ్యాపారం బంద్ పెట్టించారు. మారినవారికి ప్రత్యామ్నాయ ఉపాధి చూపిస్తామన్నారు. అది కూడా చూపలేదు. రాష్ట్ర రాబడి పెరగక అనుకున్న ఆదాయం రాక సవాళ్ల మధ్య సర్కారు పాలన సాగుతున్నది.

రాష్ట్రం విడిపోయే నాటికి మన అప్పులు సుమారు 60వేల కోట్లు. ఇప్పుడు వందకు వందశాతం అప్పుల్లో అభివృద్ధి సాధించాం. పాలకులు అప్పులు లేకుండా అభివృద్ధి సాధించడం అసంభవమంటున్నారు. బడ్జెట్‌లో మిషన్ భగీరథకు రూ మూడు వేల కోట్లు మాత్రమే కేటాయించారు. తెలంగాణ స్టేట్‌వాటర్ గ్రిడ్ కార్పొరేషన్‌గా పేరు మార్చారు. ఇప్పటికే ప్రయివేటు బ్యాంకుల ద్వారా రూ.35 వేల కోట్లకు పైగా అప్పులు తీసుకు వచ్చారు. డిసెంబర్ నాటికి ఇంటింటికి మంచినీరు ఇస్తామన్నారు. ఇవ్వలేదు. రాష్ట్ర వ్యాపితంగా మంచినీటి కోసం మున్సిపాలిటీలలో, గ్రామ పంచాయతీలలో చేసిన అప్పులను ప్రభుత్వమే చెల్లిస్తుందని ఒప్పందం చేసుకున్నారు. కాళేశ్వరం ప్రాజెక్టును కార్పొరేషన్‌గా మార్చి రుణం తీసుకున్నారు. డబుల్ బెడ్రూమ్ ఇండ్ల నిర్మాణానికి హడ్కో ద్వారా రూ.12,600 కోట్లు అప్పుకు ఒప్పందం చేసుకున్నారు. 2 లక్షల ఇండ్లు పూర్తి చేస్తామన్నారు. అరకొరగా పనులు జరుగుతున్నాయి. ప్రభుత్వం - ఐరన్ వ్యాపారులు చేసుకున్న ఒప్పందం గిట్టుబాటు లేదని వ్యాపారులు చేతులెత్తేశారు. కేంద్రం 14వ ఆర్థిక సంఘం నిధులు విడుదల చేసింది. నిబంధనల ప్రకారం 14 రోజులలో స్థానిక సంస్థలకు పంపిణీ చేయాలి. వాటిని కూడా రాష్ట్ర ప్రభుత్వం వాడుకుంటున్నది. భవిష్యత్‌లో అప్పులకు వడ్డీలు వాయిదాలు... కట్టడానికే అధిక మొత్తం వెచ్చించాల్సి వస్తుంది.

ఈ ఏడాది ఎన్నికలు జరుగుతాయి అంటున్నారు. అదే నిజమైతే ఇదే చివరి బడ్జెట్. ఎన్నికల బడ్జెట్ అవుతుంది. కొత్త కొత్త పథకాలు, ప్రయోజనాలు, అవసరాలు పాలకుల ముందుకు వస్తాయి. రైతు సాగుకు ఎకరానికి రూ.4వేలు సహాయానికి నిధులు ఇవ్వాల్సి ఉంటుంది. జూన్‌తో ఉద్యోగుల వేతన ఒప్పంద కాలం ముగుస్తుంది. పెరిగే వేతనాలకు బడ్జెట్ స్థానం కల్పించాల్సి ఉంటుంది. గతంలో తయారుచేసినట్టు ఈ బడ్జెట్‌ను తయారు చేయడం అంత సులభం కాదు. అందరినీ ఆదరించాలి. ఎన్నికల దాకా నడిపించాలంటే బడ్జెట్‌వల కలగలిపి అల్లాలి. బడ్జెట్‌పై భ్రమలు తొలగకుండా చర్చ జరగకుండా ప్లాన్ టూ పాలకులు తెరమీదకు తెచ్చే అవకాశం లేకపోలేదు. 2014 రాష్ట్రం ఏర్పడిన దగ్గర నుండి 2024 వరకు విజన్ 2024 పేరుతో దశమ వార్షిక దర్శినికతలను తయారుచేస్తున్నట్టు తెలుస్తున్నది. పత్రం రూపొందించడానికి కేసీఆర్ అధికారులకు ఆదేశాలు ఇచ్చినట్టు సమాచారం. పత్రం తయారుచేసే పనిలో పాలనా యంత్రాంగం పరిశ్రమిస్తున్నది. 2024 వరకు రూ.4 లక్షల కోట్ల బడ్జెట్ చేరుకుంటుందని అంటున్నారు. విజన్ 2020 వెనుక ప్రపంచ బ్యాంకు ఉంది. మరి దీనివెనుక వున్న అదృశ్య శక్తి ఆలస్యంగానైనా బయటికి వస్తుంది. బడ్జెట్ మీద విస్తృత చర్చ జరపాలి. ప్రత్యామ్నాయ బడ్జెట్ కోసం ప్రజలు ఉపక్రమించాలి.

ఎఫ్ఆర్‌డీఐ.. ప్రమాదాలు.. పరిణామాలు..



జి. తిరుపతయ్య

ఈ మధ్య కాలంలో బ్యాంకు లావాదేవీలతో సంబంధం ఉన్న ప్రతి ఒక్కరినీ వణికించింది కేంద్ర ప్రభుత్వ ప్రతిపాదిత ఎఫ్ఆర్‌డీఐ బిల్లు. ప్రజలు భయాందోళనలకు గురౌతున్నారు. ఎఫ్ఆర్‌డీఐ.. అంటే ఫైనాన్షియల్ రెసొల్యూషన్ అండ్ డిపాజిట్ ఇన్సూరెన్స్. ఈ బిల్లు ద్వారా ఒక సర్వ సత్తాక ప్రతిపత్తి కలిగి, ఆర్థిక శాఖ ఆదేశానుసారం నడిచే "రెసొల్యూషన్ కార్పొరేషన్" అనబడే సంస్థను ఏర్పాటు చేస్తారు. దీనికోసం బిల్లు తయారు చేసి 14 జూన్ 2017న కేంద్ర క్యాబినెట్ ఆమోదించి 17.08.2017న పార్లమెంట్ ఉప సంఘానికి స్టడీ నిమిత్తం పంపింది. 1961లో ఏర్పాటు చేసిన "డిపాజిటర్ ఇన్సూరెన్స్ క్రెడిట్ గ్యారంటీ కార్పొరేషన్" (డీఈసీజీసీ) స్థానంలో ఈ బిల్లు వస్తుందట. ఈ డీఈసీజీసీ గత యాభై ఏండ్లలో చట్టబద్ధ రెగ్యులేటరీ బాడీలతో అనుసంధానం చేసుకుంటూ చక్కటి సేవలే అందిస్తూ ఇప్పటివరకు 50.3 బిలియన్ల రూపాయలను మాత్రమే ఇన్సూరెన్స్‌గా చెల్లించగా ఇంకా తన వద్ద 701.5 బిలియన్ల నిల్వలు ఉన్నాయి. ఏదైనా బ్యాంకు దివాలా తీసినా బోర్డు తిప్పేసినా డీఈసీజీసీ ద్వారా బ్యాంకు ఖాతా దారులకు ఒక లక్ష వరకు మాత్రమే ఇన్సూరెన్స్ కల్పించబడుతుంది. ఇతర దేశాలతో పోల్చితే మన దేశంలో సాలీనా మూత పడుతున్న బాంకులు ఇన్సూరెన్స్ కంపెనీల సంఖ్య చాలాతక్కువ, ఒకవేళ ఏదైనా మూత పడినప్పుడు బలిష్టంగా ఉన్న ప్రభుత్వరంగ కంపెనీలు వాటిని విలీనం చేసుకుని ఖాతాదారులకు నష్టం రాకుండా చూస్తున్నాయి. గ్లోబల్ ట్రస్టు బ్యాంకు, ప్రుడెన్షియల్ బ్యాంకు, కృషీ బాంకు, చార్మినార్ బ్యాంకులు దెబ్బ తిన్నప్పుడు కొన్ని ఆదుకోబడినాయి, కొన్ని నష్టాన్ని మిగిల్చాయి. మధ్య తరగతి ఖాతాదారుల సొమ్ముకు భద్రత కల్పించడానికి డీఈసీజీసీని సవరించి ఒక లక్షను పది లక్షలకు పెంచాలనే డిమాండు వస్తున్న సందర్భంలో ఈ రెసొల్యూషన్ కార్పొరేషన్ వచ్చి ఖాతాదారుల డిపాజిట్లకు ఇన్సూరెన్సే లేకుండా చేయనున్నదనే సరికి భయాలు మరింత పెరిగాయి. ఎఫ్ఆర్‌డీఐ బిల్లులో ప్రధానంగా చర్చకొస్తున్న అంశం బ్యాంకులకు నష్టాలు వచ్చినప్పుడు ఖాతాదారుల సేవింగ్స్, డిపాజిట్లు వారి అనుమతి లేకుండానే, కుదించబడుతాయని లేదా టర్మ్ పెంచబడతాయన్నది. ఏ దేశమైనా ఎమర్జెన్సీ సమయంలో తప్ప ఇలాంటి నిర్ణయాలు చేయదు. అలాంటిది ఒక కంపెనీ చేసిన పొరపాట్లకు ప్రజలను బాధ్యుల్ని చేయడం సరికాదు.

సెంట్రల్ విజిలెన్స్ కమిషన్, సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ పరిధిలోకి కూడా రాకుండా బిల్లు రూపొందింది. బ్యాంకులు ఇన్సూరెన్స్ కంపెనీలు ఆర్‌సీ బోర్డు దయాదాక్షిణ్యాలపై ఆధారపడాల్సి వస్తుంది. ప్రభుత్వాలు మారినప్పడల్లా ఆర్థిక రంగంలో పెద్ద కుదుపులేర్పడే అవకాశానికి, రాజకీయాల్లాగ నిరంతర అనిశ్చితికి ఇది దారి తీస్తుంది. ఆర్థిక రంగం ఏ దేశానికైనా రక్తాన్ని సరఫరా చేసే నాడీ వ్యవస్థలాంటిది. కాబట్టి ఈ రంగం ఎప్పటికీ ప్రభుత్వాధీనంలో నడవటమే సర్వశ్రేయస్కరం.

ప్రతిపాదిత బిల్లు ప్రమాదాలు ప్రచారంలోకి వచ్చిన వెంటనే భయాందోళనకు గురైన ప్రజలు కోట్లకొలదీ డిపాజిట్లను బ్యాంకుల నుండి ఉపసంహరించు కుంటున్నారు. ఈ బిల్లు ప్రమాదకరమే కానీ ఇప్పటికిప్పుడే ఖాతాదారుల సొమ్మంతా మాయమయ్యేంత దీన స్థితిలో భారతదేశ బ్యాంకుల్లేవు. అవి పటిష్టంగానే ఉన్నాయి. దేశంలో ఉన్న 21 ప్రభుత్వరంగ బాంకుల్లో ఉన్న డిపాజిట్లు దాదాపు కోటీ పది లక్షల కోట్లు(100.10 ట్రిల్లియన్లు), ఇందులో రాని బాకీలు ఎనిమిది లక్షల కోట్లు. కాబట్టి అంతగా బెంబేలెత్తకుండా, డబ్బులు విత్‌డ్రా చేయకుండా ఉండాలి. లేదంటే డిపాజిట్లన్నీ వాపస్ తీసుకోవటం వల్ల ప్రజలే బ్యాంకులను ప్రమాదంలోకి నెట్టిన వాళ్ళు అవుతారు.

బిల్లు రూపురేఖలు

ఈ రెసొల్యూషన్ కార్పొరేషన్(ఆర్‌సీ) భారత్‌లోని బీమా, బాంకింగ్ రంగాల పని తీరును ఎప్పటికప్పుడు స్టడీ చేస్తూ తీసుకోవాల్సిన దిద్దుబాటు చర్యలను ప్రతిపాదిస్తుంది. ఈ ఆర్‌సీ పదకొండు మంది డైరెక్టర్లతో ఏర్పడుతుంది. ఫైనాన్స్ మినిస్ట్రీ, ఆర్‌బీఐ, సెబీ, ఐఆర్‌డీఏఐ, పీఎఫ్ఆర్‌డీఏ నుండి ఒక్కొక్కరుగా, ముగ్గురు పూర్తికాలపు సభ్యులు, ఇద్దరు ఇండిపెండెంట్లు ప్రభుత్వ నామినీలుగా ఒక చైర్మన్‌తో ఈ టీమ్ ఏర్పడుతుంది. దీని ముఖ్య ఉద్దేశ్యంగా చెప్పిందేమంటే "ఏ కంపెనీకైనా, నష్టాలు సంభవిస్తే ఆ నష్టాలను ప్రభుత్వం ఎట్టి పరిస్థితుల్లోనూ భరించడానికి అవకాశముండదు. అందుచేత సదరు కంపెనీ జాగ్రత్తగా పని చేస్తుంది" అని. ప్రభుత్వ గ్యారంటీ లేకపోవడానికి కంపెనీ పనిలో మెరుగుదలకు సంబంధమేంటో అర్థం లేని వివరణ. నిజానికి స్వాతంత్ర్యానంతరం ప్రభుత్వ గ్యారంటీ కలిగిన బ్యాంకులు, బీమా సంస్థలు ఏనాడూ ప్రభుత్వంపై ఆధారపడకుండా, నష్టాలు లేకుండా, అత్యంత ప్రీతిపాత్రంగా పని చేస్తున్నాయి. ప్రభుత్వ గ్యారంటీ లేని ప్రయివేటు కంపెనీలు ప్రజలకు కుచ్చుటోపీ పెడుతున్నాయి. ఈ రోజు బ్యాంకులకు, బీమా కంపెనీలకు, ఇతర వ్యాపార లావాదేవీలకు ఆర్‌బీఐ, సెబీ, ఐఆర్‌డీఏఐ, పీఎఫ్ఆర్‌డీఏ రూపంలో విడివిడిగా రెగ్యులేటరీ బాడీలు ఉన్నాయి. ఈ రెగ్యులేటరీ బాడీలు ఎన్నడూ ఫెయిలైన సందర్భాలు లేవు. కానీ ఆయా రంగాలను అభివృద్ధి పరచడానికి వాటి పని తీరు ఇంకా మెరుగు పడాల్సి ఉన్నది. ఇలాంటి ఇండిపెండెంట్ రెగ్యులేటర్స్ చేయలేని పనిని ఒక్కొక్క రెగ్యులేటర్ నుండి ఒక్క సభ్యున్ని మాత్రమే తీసుకుని ఏర్పరిచిన చిన్న సమూహం అన్ని కంపెనీలపై స్టడీ చేయడం, దిశా నిర్దేశం చేయడం సులభతరమెలా అవుతుంది? ఇప్పుడు ఏర్పడబోయే రెసొల్యూషన్ కార్పొరేషన్ కేంద్ర ఆర్థిక శాఖకు అనుబంధంగా పని చేస్తుందని కూడా బిల్లులో వివరించారు. ఇండిపెండెంటుగా, ఏ ఒత్తిళ్ళకూ తలొగ్గకుండా, ఖాతా, పాలసీదారుల శ్రేయస్సు పరమావధిగా పని చేయాలనే ఉద్దేశంతోనే ఈ ఇండిపెండెంటు బాడీలను ఏర్పాటు చేశారు. అలాంటి ఉద్దేశానికి విరుద్ధంగా వాటి నెత్తిమీద మరో సంస్థ ఏర్పాటు చేయడం అర్థరహితమే. అంతేకాదు, ఇన్ని రకాల వ్యవహారాలను నియంత్రించేందుకే ఈ రెసొల్యూషన్ కార్పొరేషన్ అంటూనే దానిని ఆర్థికశాఖకు అనుబంధంగా పెట్టుకోవడం అనుమానాస్పదం. ఇన్నాళ్ళూ బ్యాంకులకు బ్యాంకు ఆర్‌బీఐ, నేడు ఆర్‌బీఐకే బాసు రెసొల్యూషన్ కార్పొరేషన్! ఎస్‌బీఐ యాక్ట్ ప్రకారం దానిని ప్రయివేటు పరం చేయొద్దని ఉంది. కానీ ఎఫ్ఆర్‌డీఐ ప్రకారం దానిని సవరించి ఎస్ఐఎఫ్ఐ (సిస్టమెటికల్లీ ఇంపార్టెంట్ ఫైనాన్షియల్ ఇన్‌స్టిట్యూషన్)గా నామకరణం చేస్తారట. ఈ కోవలోకే హెచ్‌డీఎఫ్‌సీ, ఐసీఐసీఐలను కూడా చేర్చారు. భారత బ్యాంకింగ్ వ్యవస్థను ఇలా మార్చడం వల్ల 1969లో తీసుకున్న సామాజిక బాధ్యతా కోణం కనుమరుగౌతుంది. 12వ పంచవర్ష ప్రణాళికకు రూ.14,23,055 కోట్లు సమకూర్చిన అతి పెద్ద ఆర్థిక సంస్థ ఎల్ఐసీకి కూడా ఇలాంటి పెత్తనం అవసరమా! అని నిపుణుల ప్రశ్న.



తప్పొకరిది.. శిక్ష మరొకరికి

బ్యాంకులైనా ఇన్సూరెన్స్ కంపెనీలైనా నష్టాలు చవిచూడటానికి ప్రధాన కారణం ఇచ్చిన అప్పుల్ని వసూలు చేసుకోలేకపోవడం. నేడు బ్యాంకులకు 8 లక్షల కోట్లు రానిబాకీలుగా లేదా నిరర్థక ఆస్తులుగా ఉన్నాయి. ఇందులో 88.5శాతం అప్పులు ఐదు కోట్లు లేదా అపై మొత్తాలుగా ఉన్నాయి. అంటే వ్యాపార నిమిత్తం బడా వ్యక్తులే తీసుకున్నారన్న మాట, కేవలం 12మంది వ్యక్తులు తీసుకున్న రుణాలు రెండున్నర లక్షల కోట్లు. బ్యాంకుల్లో డబ్బును దాచుకుంటున్నది మాత్రం సాధారణ మధ్య తరగతి ప్రజలు. ఈ బిల్లులోని క్లాజు 52 ప్రకారం బెయిల్ ఇన్ అనే కొత్త ఒరవడికి శ్రీకారం చుట్టారు. 2008 ప్రపంచ ఆర్థిక సంక్షోభం తరువాత బెయిల్ అవుట్ అనే విషయం మనకు తెలుసు. బెయిల్ ఇన్ అంటే నష్టమొచ్చిన కంపెనీలోని మిగతా ఖాతాదారులే ఆ నష్టాన్ని భరించాలి. సైప్రస్ దేశంలో ఈ బెయిల్ ఇన్ విధానం వల్ల ప్రజలు తమ డిపాజిట్లలో 50శాతం కోల్పోయారని సమాచారం. కొందరు వ్యక్తులు బాంకులకు నష్టాలు కలిగిస్తే మిగతా వారి డబ్బును సర్దుబాటు చేస్తారని ప్రస్తుత ప్రతిపాదన. భవిష్యత్తులో ఇది కాస్తా మారి ఖాతాదారుల డబ్బు సరిపోనప్పుడు వారి ఆస్తులను కూడా జప్తు చేస్తామంటారేమో! ఈ బిల్లు చట్ట రూపం దాల్చితే బ్యాంకుల్లో డబ్బు జమ చేసే నాధుడే ఉండడు. పురాతన కాలంలో మాదిరి "మా బ్యాంకులో డబ్బులు పెట్టండీ, దేహీ" అంటూ తిరగాల్సిందే. ఎగవేతదారులను అరికట్టడానికి చట్టాలు చేయమంటే చట్టపరంగా దాచుకున్న అమాయకుల డబ్బును కాజేయడానికి చట్టాన్ని తయారు చేస్తామంటున్న వారిని ఏమనాలి? వీరు ఎవరివైపునున్నారు? ఈ ప్రతిపాదనలకు వ్యతిరేకంగా ఆన్‌లైన్‌లో జరుగుతున్న సంతకాల సేకరణకు ఒక్కరోజులోనే నలభై వేలు దాటి ఆ తరువాత కోట్లల్లో మద్దతు లభిస్తున్నది. బ్యాంకు యూనియన్లు కూడా నిరసన గళాన్ని జోరుగా వినిపిస్తున్నాయి. సోషల్ మీడియాల్లో మోడీపై వ్యతిరేకత నమోదౌతున్న దృష్ట్యా అటు ఆర్థిక శాఖా మంత్రి అరుణ్ జైట్లీ ఇటు ప్రధాని మోడీ రంగంలోకి దిగి "అబ్బెబ్బే అలాంటిదేమీ లేదే, ప్రజలకు నష్టమయ్యే క్లాజులను తొలగిస్తామంటూ" సర్దుకునే ప్రయత్నం చేస్తున్నారు.

రెసొల్యూషన్ కార్పొరేష(అర్‌సీ)కు అసాధారణ అధికారాలు ఉంటాయి. 1. ఏదైనా ఒక బ్యాంకు లేదా ఇన్సూరెన్సు కంపెనీకి ప్రమాదం పొంచివున్నదని(ఇమ్మినెంట్ త్రెట్) భావిస్తే ఆ కంపెనీ అనుమతి లేకుండానే దానిని వేరే కంపెనీలో విలీనమవ్వాల్సిందిగా ఆదేశాలిస్తుంది. ఈ నిబంధన ఎల్ఐసీకి, ఎస్‌బీఐకీ కూడా వర్తిస్తుంది. ఒక ప్రభుత్వ కంపెనీని ప్రయివేటు కంపెనీలోనూ లేదా ప్రయివేటు కంపెనీని ప్రభుత్వ కంపెనీ లోనూ విలీనం చేసే అధికారం ఆర్‌సీకి ఉన్నది. 2. నష్టాల బారిన పడ్డ కంపెనీల మధ్య లిక్విడేటర్‌గా ఉండి పెత్తనాన్ని చెలాయిస్తుంది. 3. బ్యాంకు, ఇన్సూరెన్సు కంపెనీలకు చైర్మన్‌ను, డైరెక్టర్లను నియమిస్తుంది. 4. వీరి పనిని సమీక్షించి జీతభత్యాలను నిర్ణయిస్తుంది. పదవినుంచి తొలగించే స్థాయి వరకు క్రమశిక్షణా చర్యలూ తీసుకుంటుంది. 5. ఆర్‌సీ నిర్ణయాన్ని సుప్రీం కోర్టు సహా ఏ కోర్టులోనూ సవాలు చేయడానికి వీలు లేదు. 6. ఇన్సూరెన్సు కంపెనీల బోర్డ్ ఆఫ్ డైరెక్టర్ల నిర్ణయాలను తోసిపుచ్చవచ్చు(సుపెర్‌సీడింగ్) కేంద్ర ప్రభుత్వ ఆర్థిక శాఖకు మాత్రం భాగస్వామిగా పనిచేయాలనే నిబంధనతో తయారౌతున్న ఈ బిల్లు పరిపాలనా స్వయం ప్రతిపత్తిని రాజకీయ విధానాలకు దాసోహం చేస్తుంది. సెంట్రల్ విజిలెన్స్ కమిషన్, సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ పరిధిలోకి కూడా రాకుండా బిల్లు రూపొందింది. బ్యాంకులు ఇన్సూరెన్స్ కంపెనీలు ఆర్‌సీ బోర్డు దయాదాక్షిణ్యాలపై ఆధారపడాల్సి వస్తుంది. ప్రభుత్వాలు మారినప్పుడల్లా ఆర్థిక రంగంలో పెద్ద కుదుపులేర్పడే అవకాశానికి, రాజకీయాల్లాగ నిరంతర అనిశ్చితికి ఇది దారి తీస్తుంది. ఆర్థిక రంగం ఏ దేశానికైనా రక్తాన్ని సరఫరా చేసే నాడీ వ్యవస్థలాంటిది. కాబట్టి ఈ రంగం ఎప్పటికీ ప్రభుత్వాధీనంలో నడవటమే సర్వశ్రేయస్కరం.

సెల్: 9951300016

మెయిల్ @ నవతెలంగాణ

కొత్తబడ్జెట్‌లో ఆదాయ పన్ను స్లాబ్స్ పెంచాలి

అనాదిగా ఆర్థిక మంత్రులు, వ్యక్తిగత ఆదాయ పన్ను శ్లాబులను క్రింది విధంగా లెక్క చేస్తున్నారు.

సీనియర్ సిటిజెన్ (60 ఏండ్ల నుండి 80 ఏండ్ల లోపు ఉన్న వారు)

చాలా సీనియర్ సిటిజన్స్ (80 ఏండ్లకు పై బడినవారు)

60ఏండ్ల తరువాత నేరుగా 80ఏండ్లు దాటినవారికే పన్ను రాయితీలలోను స్లాబ్స్‌లోను మార్పులు కల్పిస్తున్నారు. ఈ పద్ధతికి స్వస్తి పలకాలి. ఎందుకంటే రానున్న గంటలో ఏ ఆపద జబ్బుతో ప్రాణం మీదకు వస్తుందన్న నిత్యం భయంతో జీవించే 65ఏండ్ల పైబడిన ఆదాయపు పన్ను చెల్లించే వారిపై ఆర్థిక మంత్రి, ప్రధాన మంత్రి ఆలోచించక పోవటం శోచనీయం. వారి బాధ్యతలు కుటుంబ వ్యక్తులకే గాని పాలకులకు ఉండదా? ఉండకూడదా? ఇది పదవిలో ఉన్నవారి మైకమా, తరతరాలుగా పదవితో సిద్ధించే సహజ సిద్ధమైన పాలకుల అలసత్వమా? టాక్స్ చెల్లించేవారు అందరూ ప్రభుత్వ ఉద్యోగులైతే కొంతలో కొంత ప్రభుత్వ సహాయం అందుతుంది. ఇక ప్రయివేట్ ఉద్యోగులకైతే అనుక్షణం మందులతో రోగాలతో ఆసుపత్రి చుట్టూ నిత్యం సందర్శించి వందలు, వేలు, లక్షలు చెల్లించే వారిపై ప్రభుత్వం కనికరించదా, ప్రపంచ ఆరోగ్య సంస్థల ప్రకారం ప్రపంచంలోనే 2015 సంవత్సరం ర్యాంకింగ్ ప్రకారం భారత దేశం 125 స్థానంలో ఉంది.

ఆ లెక్కల ప్రకారం భారతదేశంలో స్త్రీ 69.9 ఏండ్లు, పురుషుల సగటు జీవన ప్రమాణం 66.9 ఏండ్లు. నేటి సమాజంలో ఎంత మంది 80 ఏండ్లు బతికి ఉంటారు. ఇంకా అందులో రూ.5 లక్షలు టాక్స్ ఆదాయం ఉన్నవారు ఇంకెంత మంది ఉంటారు. అందుకే వ్యక్తిగత టాక్స్‌లో స్లాబులు ఎక్కువగా పెడితేనే ప్రజలకు ఉపయోగం ఉంటుంది. అందుకే 60ఏండ్లు తరువాత మీరు ప్రతీ ఐదేండ్లకు ఒక స్లాబ్ పెడితే బాగుంటుంది. అప్పుడు ప్రతి టాక్స్ పెయిర్‌కీ టాక్స్‌లో రాయితీ పొందగలుగుతారు. ఎలాగా ఉచిత ప్రభుత్వ వైద్య సహాయం అందచేయటంలేదు. అందుకే ఈ దిగువ పేర్కొన్న విధంగా ఆదాయ పన్ను స్లాబ్స్ పెడితే ఆనందిస్తారు.

65 ఏండ్లు పైన 70 లోపు

70 ఏండ్లు పైన 75 లోపు

75 ఏండ్లు పైన 80 లోపు

80 ఏండ్లు పైన వారికి అస్సలు టాక్స్ ఉండకూడదు.

(వ్యాపారులను మినహాయించండి)

మీ ప్రభుత్వం పెట్టే ఖర్చులో కేవలం 0.0001 శాతం కన్నా తక్కువ పొదుపు చేస్తే అందరూ చాలా సీనియర్ సిటిజన్స్ కట్టే ఆదాయ పన్ను కన్నా మీ ఖజానాకు ఎక్కువే మిగులుతుంది అనటంలో సందేహం లేదు.

ప్రధాని మోడీ మీరు పాత ఆదాయ పన్ను స్లాబ్స్ పాటిస్తే మీ హయాంలో ప్రజలు చెప్పుకోతగిన కొత్త పద్ధతులు ఏమీ ఉండవు. ఇక ఆర్థిక మంత్రి గారూ, మీరు గత ఆర్థిక మంత్రుల బాటలో పయనిస్తే మీ పనితనం పరమ శూన్యం. అలా కాక కాలానుగుణంగా నూతన బాటలో ఆదాయ పన్ను రాయితీ స్లాబ్స్ నిర్ణయించితే, దేశప్రధానిగా మీ హయాంలో ఎవరు తప్పు చేసినా ఆ చెడ్డ పేరు వచ్చేది ముందుగా మీకే సుమా? ఇక నూతనత్వం గురించి ప్రజలకు విడమరచి చెప్పాల్సిన అవసరం మీకు లేదా, అందుకే మీ పంథా మార్చండి. ఈ రాబోయే బడ్జెట్‌లో ఆదాయ పన్ను రాయితీ 65ఏండ్ల పైబడిన వారికి ఎక్కువగా ఖర్చులయ్యే మందులకు ఆసుపత్రి ఖర్చులకు భారత ప్రధానిగా మీ బాధ్యత లేదా? మీకు ప్రజా సేవ నిజంగా చేయాలని ఉంటే 80 ఏండ్ల పైన ఉన్న పౌరులు క్రమం తప్పకుండా ఆదాయ పన్ను కడుతున్న వారికి ప్రతీ మూడేండ్లకు ఎంతో కొంత ఆదాయ పన్ను రాయితీ కల్పించండి, ఇది వారికి ఆర్థిక బలం చేకూర్చిన వారవుతారు. మీ కేంద్ర ప్రభుత్వం అనవసరంగా ఖర్చు పెట్టే వాటికి తక్షణం కళ్లెం వేయండి. ఇప్పటి వరకు మీరు చేసిన తప్పును గ్రహించి సత్వరం ఆదాయ పన్ను రాయితీ కల్పించి సీనియర్ సిటిజన్స్ దీవెనలను పొందండి. వారి ఆశీస్సులతో చక్కగా పరిపాలించండి?

అందుకే వెంటనే మీ రాబోయే కొత్త బడ్జెట్‌లో ఆదాయపన్నుకు సత్వరమే ఒక నవరూప సవరణ సంతరించేటట్టు చేసి, దేశ ప్రజల మన్ననలను పొందండి.

- చామర్తి వెంకట రామకృష్ణ, హైదరాబాద్

చరిత్ర గతినే మార్చిన అక్టోబర్ మహా విప్లవం!

నాదెండ్ల శ్రీనివాస్

(నిన్నటి తరువాయి)

లెనిన్ ఎత్తుగడలను మెన్షివిక్‌లు తిరస్కరించారు. రైతాంగ విప్లవ పోరాట శక్తిని తక్కువ అంచనావేశారు. దేశం పూర్తిగా పారిశ్రామికవంతమై కార్మికవర్గం జనాభాలో అధిక శాతం అయినపుడు మాత్రమే సోషలిస్టు విప్లవం వస్తుందని వారు వాదించారు. వారి వాదనలను లెనిన్ తిరస్కరించి రెండు ఎత్తుగడలు అనే గ్రంథం రాస్తూ సోషలిస్టు విప్లవాన్ని గురించిన మార్క్సిస్టు అవగాహనను మరింత పెంచాడు. 1905 అక్టోబర్ నాటికి రష్యాలో జనరల్ రాజకీయ సమ్మె ఉధృతమైంది. జన జీవనం స్థంభించింది. దాంతో విదేశాల నుండి పీటర్స్‌బర్గ్ చేరుకుని విప్లవానికి లెనిన్ నేరుగా నాయకత్వం వహించాడు. అక్టోబర్-డిసెంబర్ మధ్య దేశంలోని పెద్ద పట్టణాల్లో కార్మిక సోవియట్లు, సైనిక సోవియట్లు, రైతాంగ సోవియట్లు ఏర్పడి అధికారాన్ని చేతుల్లోకి తీసుకున్నాయి. డిసెంబర్‌లో మాస్కో కార్మికులు 9 రోజులపాటు సాయుధ తిరుగుబాటు చేయడంతో విప్లవం తారాస్థాయికి చేరుకుంది. మాస్కోలో జరిగిన తిరుగుబాటు ఇతర నగరాలకు కూడా వ్యాపించింది. అయితే విడివిడిగా జరిగిన ఈ తిరుగుబాట్లను జార్ ప్రభుత్వం ఎక్కడికక్కడ అణచివేసింది. 1907 నాటికి విప్లవ వెల్లువ పూర్తిగా అణచివేయబడింది. అయితే 1905 విప్లవం ఓడిపోలేదనీ, రానున్న విప్లవానికి రిహార్సల్స్‌గా ఉపయోగపడిందనీ లెనిన్ గుణపాఠాలు తీశాడు. తిరుగుబాటులో విప్లవ లక్షణాన్ని ప్రశంసిస్తూనే నిర్మాణ లోపాలను ఆయన నిర్మొహమాటంగా వెల్లడించాడు. 1905 విప్లవ ఓటమి తర్వాత మొదటి ప్రపంచ యుద్ధం ప్రారంభమయ్యేవరకు లెనిన్ రెండవ ఇంటర్నేషనల్ పార్టీలో మితవాద, రివిజనిస్టు పోకడలకు వ్యతిరేకంగా ఉధృతమైన పోరాటం నడపాల్సి వచ్చింది. యూరప్‌లోని అనేక సోషల్ డెమోక్రటిక్ పార్టీలు బూర్జువా ప్రభావానికి లోనై జాతీయవాదం బాటపట్టాయి. ఫాదర్‌లాండ్ రక్షణ పేరుతో యుద్ధాలకు సహకరించే వైఖరి చేపట్టాయి. మితవాద ధోరణులకు వ్యతిరేకంగా పోరాడే ఆ రోజుల్లోనే 1909లో లెనిన్ మెటీరియలిజం అండ్ ఎంపీరియో క్రిటిసిజమ్ అనే గ్రంథాన్ని రాశాడు. మానవుల ఆలోచనలు బాహ్య ప్రపంచం వాస్తవికతను ప్రతిబింబిస్తాయని ఆయన ఇందులో పేర్కొన్నాడు.

1914లో మొదలయిన మొదటి ప్రపంచ యుద్ధాన్ని లెనిన్, బోల్షివిక్‌లు సామ్రాజ్యవాద యుద్ధంగా నిర్వచించారు. కానీ అనేక ఐరోపా సోషల్ డెమోక్రటిక్ పార్టీలు ఈ సూత్రీకరణను అంగీకరించలేదు. ఈ యుద్ధాన్ని అవి జాతీయవాద యుద్ధాలుగా అభివర్ణించి తమ దేశాలలోని బూర్జువా పాలక వర్గాలను వెనకేసుకొచ్చాయి. యుద్ధంలో కార్మికవర్గం ఇతర దేశాలకు చెందిన తమ తోటి కార్మికవర్గాల మీదకు తుపాకులు ఎక్కుపెట్టేందుకు సహకరించాయి. జర్మన్ నాయకుడు కార్ల్ కాట్స్కీ వంటి వారు తమ దివాళాకోరు విధానాలకు, సైద్ధాంతిక సమర్థనలకు దిగారు. రివిజనిస్టుల యుద్ధ సమర్థనలను ఖండిస్తూ ఇది సామ్రాజ్యవాద యుద్ధం అని నిరూపించేందుకు లెనిన్ నిర్దిష్ట పరిశీలనకు మచ్చుతునక అయిన సామ్రాజ్యవాదం - పెట్టుబడిదారీ విధానం అత్యున్నత దశ గ్రంథం రాశారు. ఇది నేటికీ పెట్టుబడిదారీ వ్యవస్థను అర్థం చేసుకోవడానికి కమ్యూనిస్టులకు కరదీపికగా ఉపయోగపడుతుంది.



లెనిన్ నాయకత్వంలో రివిజనిజంపై జరిపిన పోరాటంలో బోల్షివిక్ పార్టీ కొత్త విప్లవ జవసత్వాలు సమకూర్చుకుంది. సామ్రాజ్యవాద యుద్ధాన్ని అంతర్యుద్ధంగా మార్చండి అన్న లెనిన్ నినాదాన్ని రష్యాలో బోల్షివిక్ పార్టీ అమలు చేసింది. ఇదే సమయంలో సైనిక రంగంలో రష్యన్ కార్మికుల స్థితి మరింత హీనంగా మారింది. వారికి సరైన తిండిలేదు. దుస్తుల్లేవ్. బూట్లు లేవు. తుపాకుల్లేవ్. దానికి తోడు రష్యాలో తీవ్రమైన ఆర్థిక సంక్షోభం ఏర్పడింది. ఆహార కొరత వచ్చింది. ఇలాంటి స్థితిలో బోల్షివిక్‌లు లెనిన్ ఇచ్చిన పిలుపును అమలు చేశారు. మొదటిది రష్యన్ పార్లమెంట్ డ్యూమాలో, బోల్షివిక్ ప్రతినిధులు యుద్ధ ప్రయత్నాలకు వ్యతిరేకంగా ఓటు వేశారు. రెండోది ప్రజల్లో యుద్ధానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున ప్రచారం చేశారు. మూడోది సైన్యంలో కూడా ప్రవేశించి వారిలో యుద్ధానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున ప్రచారం చేశారు. సైన్యంలో పార్టీ శాఖలు నిర్మించారు. 1917 జనవరి 9న రష్యాలోని అనేక నగరాల్లో సమ్మెలు ప్రారంభమై రోజు రోజుకూ ఉధృతమయ్యాయి. ఫిబ్రవరి 23వ తేదీ (రష్యా పాత క్యాలెండర్ ప్రకారం ఫిబ్రవరి 23, నేటి మార్చి 08, అంతర్జాతీయ మహిళా దినోత్సవం)

ఆ రోజు రష్యాలో కార్మికవర్గం నాయకత్వంలో బూర్జువా ప్రజాతంత్ర విప్లవం ప్రారంభమైంది. ఆరోజు పెట్రో గ్రాడ్‌లోని ఫ్యాక్టరీలలో పనిచేసే 10 వేల మంది మహిళా కార్మికులు (వీరిలో అనేక మంది సైనికుల భార్యలు) యుద్ధం వద్దు, తిండి కావాలి అనే నినాదంతో సమ్మెచేసి ప్రదర్శన జరిపారు. ఒకలక్షా 30 వేల మంది కార్మికులు వీరితో సమ్మెలో పాల్గొన్నారు. మరునాటికి సమ్మెచేసే కార్మికుల సంఖ్య 2 లక్షలకు చేరుకుంది. పెట్రోగ్రాడ్‌లోని కార్మికుల్లో దాదాపు సగంమంది సమ్మెలోకి వచ్చేశారు. జార్ గద్దె దిగాలీ..! అన్న రాజకీయ నినాదాన్ని అందుకున్నారు. జార్ మంత్రుల్నీ, సైనికాధికారుల్నీ అరెస్ట్ చేశారు. జైళ్ళలోని విప్లవకారుల్ని విడుదల చేశారు. ఇతర నగరాల్లో కూడా తిరుగుబాటుదార్లు జారిస్టు అధికారుల్ని తొలగించి అధికారం చేపట్టారు. ఈ విధంగా ఫిబ్రవరి విప్లవం జయప్రదమైంది. ఈ విప్లవానికి కార్మికవర్గం నాయకత్వం వహించినప్పటికీ, స్టేట్ డ్యూమాలోని బూర్జువా వర్గం నాయకత్వంలో తాత్కాలిక ప్రభుత్వం ఏర్పడింది. ఈ ప్రభుత్వంలో మెన్షివిక్‌లు, సోషలిస్టులు చేరారు. మరోవైపు దేశంలోని కార్మికుల సోవియట్లు, సైనికుల సోవియట్లతో కూడిన మరో అధికార సంస్థ ఏర్పడింది. అంటే విప్లవానంతరం దేశంలో రెండు అధికార కేంద్రాలు, రెండు అధికార నియంతృత్వాలు ఏర్పడ్డాయి. ఒకటి బూర్జువా అధికార కేంద్రం, బూర్జువా నియంతృత్వం. రెండోది కార్మిక, సైనిక (సైనికులంటే యూనిఫారమ్‌లో ఉన్న రైతులే) అధికార కేంద్రం, కార్మిక, కర్షక నియంతృత్వం. బలాబలాల్లో వచ్చిన ఈ మార్పును ప్రవాసంలో వున్న లెనిన్ గ్రహించాడు. తాత్కాలిక ప్రభుత్వం యుద్ధాన్ని విడనాడకపోగా క్రమశిక్షణను పునరుద్ధరించే పేరుతో ప్రజల ప్రజాస్వామిక హక్కులపై దాడి ప్రారంభించింది.

(ముగింపు రేపటి సంచికలో)

సెల్: 9676407140

న్యాయసూత్రాలు రూపొందించడానికి చట్టాలు చేసేందుకు మహిళలను ఎన్నుకున్నప్పుడే సమానత్వం సాధ్యమవుతుంది.

- సుసేన్.బి. ఆంథోని





ద్రోణవల్లి హారిక (12జనవరి1991)

మహిళా గ్రాండ్ మాస్టర్

భారత చెస్ క్రీడాకారిణి ద్రోణవల్లి హారిక అరుదైన గౌరవాన్ని దక్కించుకున్నారు. హంగేరీలో జరిగిన జలకరోస్ ఇంటర్నేషనల్ చెస్ టోర్నమెంట్‌లో బెస్ట్ ఉమెన్ ప్లేయర్ అవార్డును ఆమె కైవసం చేసుకున్నారు.

కజకిస్తాన్‌లో జరిగిన యూరేసియన్ బ్లిట్జ్ చెస్ టోర్నమెంట్ లో ద్రోణవల్లి హారిక బెస్ట్ ఉమెన్ ప్లేయర్‌గా నిలిచారు. చెస్ టోర్నమెంట్‌లో టాప్ 10 ర్యాంకింగ్‌ను అందుకున్నారు. మహిళా గ్రాండ్ మాస్టర్, అంతర్జాతీయ గ్రాండ్ మాస్టర్ బిరుదులు పొందారు.

గుంటూరు జిల్లాలో జన్మించిన హారిక చిన్నతనం నుంచే చదరంగం ఆటలో తనదైన ప్రతిభను ప్రదర్శించారు. ఏడేండ్ల వయసులోనే ఎత్తులుపై ఎత్తులు వేస్తూ.. ప్రత్యర్థిని చిత్తులు చేస్తూ.. అమ్మనాన్న, మాస్టర్‌లను ఆకట్టుకున్నారు. ఆమెలోని ప్రతిభను గుర్తించి టోర్నమెంట్స్‌కు పంపించారు. ఆసియా ఖండపు పదేండ్ల లోపు వయసు (U-10), పన్నెండేండ్లలోపు వయసు (U-12) పోటీలలో పాల్గొని మొదటి స్థానంలో నిలిచారు. 2003లో ముంబాయిలో జరిగిన కామన్ వెల్త్ చదరంగపు క్రీడలలో ప్రత్యర్థులను చిత్తు చేసి బమహిళా విభాగంలో రెండవ స్థానం దక్కించుకున్నారు. పోటీల్లో విశేష ప్రతిభ కనబరిచే ఆమె చిన్నవయసులోనే మూడు ప్రపంచ యువ చదరంగ బిరుదులు సొంతం చేసుకున్నారు.

WOMEN of the day

హెరాక్లియో, గ్రీసులో అండర్-14 - 2003, బటూమి, జార్జియా, అండర్-18 - 2006


గజియాన్ టెప్, టర్కీ, ప్రపంచ యువ చదరంగ పోటీ- 2008లో జరిగిన పోటీల్లో పాల్గొని టైటిల్ సొంతం చేసుకున్నారు. ఆమె జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ఎన్నో అవార్డులు అందుకున్నారు.

2007లో భారత ప్రభుత్వము అర్జున పురస్కారంతో హారికను సత్కరించింది. 2019లో జాతీయ మహిళా చాంపియన్ షిప్ అందుకున్నారు. వరుసగా 16 ఏండ్లు జాతీయ మహిళా టోర్నమెంట్లలో పాల్గొని 16 మెడల్స్ గెలిచారు. 2016,2017ల్లో చెస్ ప్లేయర్ ఆఫ్ ది ఇయర్ - 2016, 2017 ది టైమ్స్ ఆఫ్ ఇండియా (వార్షిక అవార్డులు) అందుకున్నారు. గత ఏడాది వెర్వ్ మ్యాగజైన్ 2017 టాప్ 40 మంది ప్రముఖ మహిళా క్రీడాకారుల జాబితాలో హారిక ప్రకటించారు.

మళ్ళీ మళ్ళీ తినాలనిపించే..

కార్న్‌భేల్స్...

సాయంత్రం కాగానే వేడి వేడిగా ఉండే కట్లెట్, పానిపూరీ, కార్న్‌భేల్, పకోడీ తినాలనిపిస్తుంది! అయితే ఇన్‌స్టాంట్‌గా బయట దొరికేవి కాకుండా ఇంట్లోనే పోషకవిలువలున్న స్వీట్‌కార్న్‌తో కట్లెట్, భేల్స్‌ను స్వయంగా తయారు చేసుకోవచ్చు. మొక్కజొన్నతో చేసిన రుచులు పిల్లల ఆరోగ్యానికి, ఎదుగుదలకు శ్రేయస్కరం. మరెందుకు ఆలస్యం మళ్ళీ మళ్ళీ తినాలనిపించే స్వీట్ కార్న్‌భేల్స్‌ను ఓ సారి టేస్టు చేయండి... !





కట్లెట్...

కావాల్సిన పదార్థాలు: స్వీట్ కార్న్-ఉడికించినవి ఒక కప్పు, ఆలుగడ్డలు-ఉడికించిన ముక్కలు-ఒక కప్పు, బ్రెడ్-రెండు, జీలకర్ర-ఒక చెంచా, బట్టర్-ఒక చెంచా, ఉప్పు-తగినంత.

తయారీ విధానం: ముందుగా ఉడికించిన స్వీట్ కార్న్‌ను మెత్తగా గ్రైండ్ చేసుకోవాలి. ఇలా గ్రైండ్ చేసుకున్న మొక్కజొన్న మిశ్రమంలోనే ఉడికించిన ఆలుగడ్డ ముక్కలు, బ్రెడ్ ముక్కలు, కొద్దిగా నీళ్లు పోసుకొని మరోసారి గ్రైండ్ చేసుకోవాలి. ఇలా గ్రైండ్ చేసుకున్న మిశ్రమాన్ని ఒక బౌల్ లోకి తీసుకొని దాంట్లో ఒక బ్రెడ్ స్లయిస్‌ను, జీలకర్ర, తగినంత ఉప్పు వేసుకొని బాగా కలుపుకోవాలి. ఆ తర్వాత స్టవ్ మీద పాన్ పెట్టి బట్టర్ వేసుకొని కార్న్ కట్లెట్స్ చిన్నగా వేసుకుంటే సరిపోతుంది.

కార్న్‌భేల్...

కావాల్సిన పదార్థాలు: స్వీట్ కార్న్-ఒక కప్పు, కార్న్‌ఫ్లేక్స్ (మక్క అటుకులు) -ఒక కప్పు, బొనుగులు (మురమురాలు)-ఒక కప్పు, టమాటా ముక్కలు-ఒక కప్పు, దానిమ్మ గింజలు-ఒక కప్పు, సన్నగా తరిగిన ఉల్లిగడ్డ ముక్కలు-ఒక కప్పు, ఆలుగడ్డ-ఉడికించినది ఒకటి, కొత్తిమీర-తరిగినది కొద్దిగా, పచ్చిమిర్చి-సన్నగా తరిగిన ఐదు, కారం-ఒక చెంచా, ఉప్పు-తగినంత, జీలకర్ర పొడి-చిటికెడు, చాట్ మసాలా-ఒక చెంచా, నిమ్మరసం-ఒక చెంచా, స్వీట్ చట్నీ-కొద్దిగా, గ్రీన్ చట్నీ.

తయారీ విధానం: ముందుగా స్టవ్ మీద పాన్ పెట్టి కార్న్‌ఫ్లేక్స్, బొనుగులు దోరగా వేయించుకోవాలి. ఆ తర్వాత ఒక పెద్ద బౌల్ తీసుకొని దాంట్లో టమాటా ముక్కలు, దానిమ్మ గింజలు, ఉల్లిగడ్డ ముక్కలు, పచ్చిమిర్చి, కొత్తిమీర, ఆలుగడ్డ ముక్కలు, కారం, ఉప్పు వేసి బాగా కలుపుకొని పక్కన పెట్టుకోవాలి. చివరగా మరో బౌల్ తీసుకొని దాంట్లో ముందుగా వేయించిన బొనుగులు, కార్న్‌ఫ్లేక్స్, జీలకర్ర, చాట్ మసాలా, స్వీట్ బూందీ, ముందుగా తయారు చేసుకున్న మిశ్రమం, స్వీట్ చట్నీ, గ్రీన్ చట్నీ, నిమ్మరసం ఒక చెంచా వేసి బాగా కలిపితే చాలు కార్న్ భేల్ రెడీ!

పాప్‌కార్న్ ఫ్రాన్స్...

కావాల్సిన పదార్థాలు: శుభ్రం చేసిన జంబో ప్రాన్స్(రొయ్యలు)- ఒక కప్పు, నూనె-వేయించుకోవడానికి సరిపడా, పాప్‌కార్న్‌పౌడర్-సగం కప్పు, నిమ్మరసం-ఒక చెంచా, ఉప్పు-తగినంత, కారం-ఒక చెంచా, మిరియాల పొడి-ఒక చెంచా, మైదా పిండి-ఒక కప్పు, కార్న్‌ఫ్లోర్-రెండు చెంచాలు, గుడ్డు-ఒకటి.

తయారీ విధానం: ముందుగా స్టవ్ మీద కుక్కర్ పెట్టి దాంట్లో నూనె, ఉప్పు, ఎండు మొక్కజొన్న వేసి ఐదు నిమిషాలు పెట్టాలి. ఇలా ఉడికించిన పాప్‌కార్న్‌ను మెత్తగా గ్రైండ్ చేసుకొని పక్కన పెట్టుకోవాలి. ఆ తర్వాత శుభ్రం చేసిన రొయ్యల్లో కాస్త నిమ్మరసం, కారం, ఉప్పు కలుపుకొని పక్కన పెట్టుకోవాలి. ఆ తర్వాత మరో పాత్రలో కొద్దిగా కార్న్ ఫ్లోర్, మైదా పిండి, ఉప్పు, మిరియాల పొడి, ఒక గుడ్డు వేసి బాగా కలుపుకోవాలి. పాప్‌కార్న్ పౌడర్‌ను ఒక ప్లేట్‌లో వేసుకొని, ఇలా చేసుకున్న తర్వాత స్టవ్ మీద పాన్ పెట్టి నూనె పోసుకోవాలి. నూనె కాస్త వేడి చేసుకోవాలి. ఆ తర్వాత కార్న్‌ఫ్లోర్ మిశ్రమంలో రొయ్యలను ముంచి ఆ తర్వాత పాప్‌కార్న్ పౌడర్‌లో ముంచి నూనెలో బ్రౌ కలర్ వచ్చే వరకు వేయించుకుంటే సరిపోతుంది.


మసాలా కార్న్...

కావాల్సిన పదార్థాలు: ఉడికించిన స్వీట్‌కార్న్-ఒక కప్పు, తరిగిన పచ్చిమిరపకాయలు-రెండు, చాట్ మసాలా-ఒక చెంచా, ఉప్పు-తగినంత, వాము-సగం చెంచా, జీలకర్ర పొడి-ఒక చెంచా, సోంపు పొడి-సగం చెంచా, నిమ్మరసం-ఒక చెంచా, కొత్తిమీర-కొద్దిగా, నూనె-రెండు చెంచాలు.

తయారీ విధానం: ముందుగా స్టవ్ మీద పాన్ పెట్టి నూనె పోసుకోవాలి. నూనె కాస్త వేడి కాగానే దాంట్లో ఉడికించిన స్వీట్ కార్న్, జీలకర్ర పొడి, పచ్చిమిర్చి, ఉప్పు, సోంపు పొడి, కొత్తిమీర, నిమ్మరసం, చాట్ మసాలా, కొత్తిమీర వేసుకుంటే చాలు మసాలా స్వీట్ కార్న్ రెడీ!

ఇట్లు చేద్దాం

దువ్వెనను నీళ్ళలో నానబెట్టి ఒక పాత బ్రష్ తీసుకొని దాని మీద టూత్ పేస్ట్, షాంపూ, సబ్బు, ఇలా ఏదైనా తీసుకుని దాంతో బాగా శుభ్రం చేయాలి. తర్వాత కడిగేసి ఆరబెట్టుకుంటే సరి.



ఉంగరాల జుట్టుకు...




ఉంగరాల జుట్టున్న అమ్మాయిలు నిత్యం ఎదుర్కొనే సమస్యలు చాలానే ఉన్నాయి. ఈ జుట్టును మెయింటైన్ చేయడం చాలా కష్టమని ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. మీ రింగుల జుట్టు చిక్కుబడకుండా ఉండేందుకు ఈ సౌందర్య చిట్కాలను పాటించి చూడండి.

- ఒక వెడల్పాటి పళ్ళున్న దువ్వెన వాడండి. ఇది రింగులు తిరిగే మీ ఉంగరాల జుట్టు మీద బాగా పనిచేస్తుంది. జుట్టును చిక్కుబడకుండా, ఊడకుండా దువ్వడానికి ఇవి బాగా పనికొస్తాయి. బైటకు వెళ్లేముందు ఇలాంటి దువ్వెనతో మీ రింగుల జుట్టు దువ్వుకుని వాటిని అలా ఉంచడానికి ఒక స్ప్రే కొట్టి చూడండి.
- రింగుల జుట్టు కోసమే ప్రత్యేకంగా తయారైన షాంపూలు ఈ మధ్య మార్కెట్లో దొరుకుతున్నాయి. మీ ఉంగరాల జుట్టు చక్కగా ఉండేందుకు వీటిని వాడడం మంచిది.
- ఉంగరాల జుట్టు తొందరగా వూడిపోవడం, చిక్కులు పడడానికి అవకాశం ఉంటుంది. మీ జుట్టు తుడుచుకోడానికి టవల్ కి బదులుగా కాటన్ టీషర్ట్ వాడండి. ఈ చిట్కా పాటించిన కొద్ది రోజులలోనే మీ రింగుల జుట్టులో వచ్చిన మార్పు గమనించండి.
- మీ హెయిర్ డ్రయ్యర్ కి డిఫ్యూజర్‌ని తగిలించి వామ్ లేదా కోల్డ్ సెట్టింగ్‌లో ఉంచి వాడండి. ఎందుకంటే హాట్ సెట్టింగ్‌లో ఉంచి వాడితే జుట్టు కుదుళ్ళకు బాగా నష్టం కలిగి, అవి చిట్లిపోయే అవకాశం ఉంటుంది.
- వేడి నూనెతో జుట్టుకి మర్దనా చేయడం మీ ఉంగరాల జుట్టుకు జీవం పోస్తుంది. ఇంటి దగ్గర చేసుకునే ఈ చిట్కాను వారానికి ఒకసారి పాటించి మీ కుదుళ్ళ ఆరోగ్యాన్ని, వాటి రూపురేఖలను బాగా మెరుగుపరుచుకోవచ్చు. అంతేకాకుండా మీ రింగుల జుట్టును దువ్వుకోడానికి అనుకూలంగా చేస్తూ, ఎండిపోయి, చిట్లిపోకుండా నివారిస్తుంది.
- రాత్రిపూట జుట్టు చిక్కుబడకుండా చేయడానికి పడుకునే ముందు లీవ్-ఇన్-కండిషనర్ వాడడం మంచి ఉపాయం. దీన్ని కనీసం వారానికి రెండుసార్లు చేయడం వల్ల మీ రింగులు రోజంతా అందంగా కనపడతాయి.
- తడిగా ఉన్నపుడే జుట్టు దువ్వుకోండి. ఆరిన తరువాత చిక్కులు తీస్తే జుట్టు వూడిపోడానికి, కుదుళ్ళు బలహీన పడడానికి అవకాశం ఉంటుంది.

పాదాలు పదిలం

కొందరికి తరచూ పాదాలు పగులుతుంటాయి. పాదాల చర్మానికి సరిపడినంత తేమ లేకపోవడం వల్ల కూడా పొడిబారి పగులుతుంటాయి. అందుకే తరచూ పాదాలకు నాణ్యమైన మాయిశ్చరైజర్ రాసుకుంటూ ఉండాలి. ఇది పొడిబారకుండా రక్షించి పగలకుండా చేస్తుంది.



- అరటబ్బు గోరువెచ్చని నీటిలో కొద్దిగా తేనె వేసి అందులో కాసేపు పాదాల్ని ఉంచాలి. తేనె సహజ మాయిశ్చరైజర్‌లా పనిచేసి తేమనందిస్తుంది. దీనివల్ల పాదాల్లో పేరుకొన్న మ తకణాలు కూడా పోతాయి.
- పాదాలు శుభ్రం చేసుకుని తుడుచుకున్నాక వేళ్లమధ్యలో తడి లేకుండా జాగ్రత్తపడాలి. లేదంటే ఫంగల్ ఇన్‌ఫెక్షన్లు వచ్చే ప్రమాదం ఉంటుంది. అది కూడా పొడిబారే సమస్యను పెంచుతుంది.
- రెండు టేబుల్‌స్పూన్ల కొబ్బరినూనెలో చెంచా పసుపు వేసి బాగా కలపాలి. దీన్ని పాదాలకు రాసుకుని బాగా మర్దన చేయాలి. పగుళ్ల సమస్య పోవడమే కాదు, నొప్పి, వాపు ఉన్నా కూడా తగ్గుతాయి. దానికితోడు చర్మం కూడా తాజాగా, మృదువుగా ఉంటుంది.
- కొన్నిసార్లు చెప్పుల్లేకుండా నడవడం మంచిదే కానీ.. రోజంతా కాదు. అలా ఒట్టికాళ్లతో నడవడం వల్ల పాదాల్లో మురికీ, బ్యాక్టీరియా చేరుతుంది. అది కూడా పొడిబారి, పగుళ్లకు కారణం అవుతుంది. అందుకే చెప్పులేసుకుని నడవాలి. రాత్రుళ్లు సాక్సులు వేసుకోవడం మంచిది. ఇక, బయటకు వెళ్లేందుకు వేసుకునే చెప్పులు కూడా ఏవి పడితే అవి కాకుండా.. పాదాలకు సౌకర్యంగా ఉన్నవాటికే ప్రాధాన్యం ఇవ్వాలి. పాదాలకు గాలి తగిలేలా చూసుకోవాలి. ఇలా చేస్తే పొడిబారే సమస్య చాలామటుకూ తగ్గుతుంది. పగుళ్ల సమస్యా అదుపులోకి వస్తుంది.

ముత్యాల ముగ్గులు






డి. దివ్యాంక్
బాగ్ లింగంపల్లి
హైదరాబాద్

11 చుక్కలు
11 వరసలు
సరిచుక్క




22 చుక్కలు
2 వచ్చేదాక
సరిచుక్క



ఎ. గోవిందమ్మ
సిరిసిల్ల



ఆదిలక్ష్మి
బాగ్ లింగంపల్లి
హైదరాబాద్



18 చుక్కలు
10 వరుసలు
10 వచ్చేవరకు



బి. ఇంద్రారాణి
విద్యానగర్ కాలనీ
నల్లగొండ

అల్లర్లు, దాడులు అభ్యంతరాలకు పరిష్కారమా..!



కంచర్ల శ్రీనివాస్

ఏదో అదశ్య శక్తి జనాన్ని గుప్పిట పట్టాలని చూస్తోంది. అది హరించ బడుతున్న మీడియా స్వేచ్ఛ రూపంలో కనిపిస్తోంది. అధికార సెన్సార్ సంస్థలున్నప్పటికీ అనధికార సెన్సార్లు ఏవో కత్తెర పుచ్చుకొని తమకు నచ్చనివి ఏకపక్షంగా కత్తిరించే యత్నం చేస్తున్నాయి. ఈ వైఖరి దేశవ్యాప్తంగా పరిశీలించినా మన రాష్ట్రంలో చూసినా అదే విధంగా ఉంది. ముఖ్యంగా గత ఎన్నికల అనంతరం నూతన ప్రభుత్వాలు ఏర్పడిన తరువాత మీడియాపై ఆంక్షలు అనధికారికంగా కొనసాగుతున్నాయ్. మనమంతా ఇంత హఠాత్తుగా మీడియా స్వరాల్ని పరామర్శించాల్సిన అవసరం ఎందుకు వచ్చిందో అందరికీ తెలుసు. రచయిత కంచె ఐలయ్యకు సంబంధించిన పుస్తక వివాదం ఇంకా వెంటాడుతూనే ఉంది. రాష్ట్రంలో ఈ వివాదం కొనసాగుతుండగానే దేశవ్యాప్తంగా ఇప్పుడు మరో పెద్ద ఆంక్ష కత్తి స్వేచ్ఛను తెగ నరకాలని వేళాడుతోంది. పద్మావతి సినిమా కథానాయకి దీపికను, దర్శకుడు సంజయ్ లీలా భన్సాల్‌ను బెదిరింపులకు గురిచేస్తూ కొన్ని ఛాందస శక్తులు నెలరోజులకు పైగా చేసిన వీరంగం మనకు తెలిసిందే. దీపిక ముక్కు చెవులూ కోస్తామని ప్రకటించి తమ రాక్షస కాంక్ష వెల్లడించిన రాజ్ పుత్ కర్ణ సేన తమ చేతలకు పరాకాష్టగా ఆమె తలకు వెల నిర్ణయించింది. వారిద్దరి తలలు నరికి తెస్తే పది కోట్లు ఇస్తామని నజరాన ప్రకటించింది. అప్పటి వివాద పుస్తకం రంగీలా రసూల్ అయినా ఇప్పటి కంచె ఐలయ్య పుస్తకం అయినా తాజా చర్చనీయాంశమైన పద్మావతి సినిమా అయినా వ్యక్తులు కులాలు సంప్రదాయాలు చరిత్రలను కించపరిచే ధోరణులను మనలో ఎవరూ సమర్థించరు. కానీ చర్చకు అవకాశం లేకుండా సమగ్ర పరిశీలన జరగకుండా పెచ్చుమీరుతున్న ఏకపక్ష నియంతత్వ ధోరణిపైనే మన ఖండన.

పద్మావతి సినిమా విషయానికొస్తే ఇటీవల విడుదలైన ట్రైలర్‌లో పద్మావతి నాట్యం చేస్తోందని మహారాణి అయిన ఆమె వ్యాంప్ క్యారెక్టర్‌లా అందరిముందు నర్తించటమేంటన్నది వారి ప్రధాన అభ్యంతరం. దీనితోపాటు అల్లాద్దీన్ ఖిల్జీ పాత్రధారి షాహిద్ కపూర్‌తో రాణి పద్మావతి పాత్రధారి దీపిక పదుకొణే చనువుగా ఉన్న దశ్యాలూ అభ్యంతరమయ్యాయి. రాణి పద్మావతి ఖిల్జీని శతవుగానే పరిగణించి ప్రాణ త్యాగం చేసింది తప్ప చరిత్రలో ఎక్కడా పద్మావతి ఖిల్జీ ప్రేమలో పడినట్టు లేదు అనేది మరో అభ్యంతరం. ఈ కారణంగానే దీపిక నాట్య కత్తె అని బజారుది అని రాజ్ పుత్ కర్ణ సేన అవమానకర వ్యాఖ్యలు చేస్తోంది.

పద్మావతి సినిమా విషయానికొస్తే ఇటీవల విడుదలైన ట్రైలర్‌లో పద్మావతి నాట్యం చేస్తోందని మహారాణి అయిన ఆమె వ్యాంప్ క్యారెక్టర్‌లా అందరిముందు నర్తించటమేంటన్నది వారి ప్రధాన అభ్యంతరం. దీనితోపాటు అల్లాద్దీన్ ఖిల్జీ పాత్రధారి షాహిద్ కపూర్‌తో రాణి పద్మావతి పాత్రధారి దీపిక పదుకొణే చనువుగా ఉన్న దశ్యాలూ అభ్యంతరమయ్యాయి. రాణి పద్మావతి ఖిల్జీని శతవుగానే పరిగణించి ప్రాణ త్యాగం చేసింది తప్ప చరిత్రలో ఎక్కడా పద్మావతి ఖిల్జీ ప్రేమలో పడినట్టు లేదు అనేది మరో అభ్యంతరం. ఈ కారణంగానే దీపిక నాట్య కత్తె అని బజారుది అని రాజ్ పుత్ కర్ణ సేన అవమానకర వ్యాఖ్యలు చేస్తోంది. ప్రపంచ సినిమా కథలన్నిటికీ రామాయణమే ఆధారం అంటారు. మరి ఆ కోణంలో ఇప్పటి వరకు ఎవరూ అడ్డు చెప్పిన దాఖలా లేదు. ఇతర సినిమాల్లోనూ పెచ్చు మీరిన హింసా దశ్యాలు మోతాదుకు మించిన శంగారం, రక్త పాతం వంటి అంశాలపై ఇంతగా ఎవరూ ఎందుకు స్పందించటం లేదు అన్నది సాధారణ ప్రేక్షకుడు, పాఠకుడి ప్రశ్న. ఉద్దేశ్యపూర్వకంగా మనోభావాలను దెబ్బ తీయని విధంగా కొన్ని వాస్తవ సంఘటనలు చరిత్రకు కల్పిత సన్నివేశాల కథ అల్లుకోవటం సాధారణంగా జరుగుతున్నదే. కానీ కొన్ని సినిమాలు రచనలు వార్తా కథనాలపైనే ఇంత ఫోకస్ అక్కసు ఎందుకన్న ప్రశ్నలు సైతం ఎదురవుతున్నాయి. మనోభావాలకు భంగం కలిగించే విధంగా ఉన్నా సహించమని ఎవరూ చెప్పరు కానీ మతం కులం వర్గాల పేరుతో వ్యక్తమవుతున్న అసహనం గురించే అభ్యంతరం. సినిమా లేదా రచన తమకు అభ్యంతర కరంగా ఉందని భావిస్తే సెక్షన్ 295 (ఏ) ప్రకారం అప్పీల్ చేయవచ్చు. సజన పరమైన అంశాల్లో మనోభావాల సంరక్షణకోసమే ఈ సెక్షన్ పొందుపరచబడింది.

పద్మావతి సినిమా చిత్రీకరణ దశలోనే వివాదం మొదలైంది. ఈ ఏడాది జనవరి నెలలో సినిమా సెట్టింగ్‌ను తగలబెట్టారు అభ్యంతరకారులు. అప్పుడే సినిమా స్క్రిప్ట్ గురించి ఎందుకు ప్రశ్నించలేదు. నిష్ణాతుల సినీ మేధావులు చరిత్రకారుల కమిటీ ఆధ్వర్యంలో ఎందుకు చర్చకోరలేదు. అలా డిమాండ్ చేసి ఉంటే షూటింగ్ దశలోనే తమ అభ్యంతరాలకు పరిష్కారం దొరికి ఉండేది కదా అన్నది వ్యక్తమవుతోన్న సందేహం. గత 2008 నుండి పరిశీలిస్తే ఇప్పటి వరకు 63 సినిమాలు ఈ తరహా అభ్యంతరానికి గురయ్యాయి. ముఖ్యంగా గత 2015 నుండే ఈ ధోరణి మరింత అధికం కావటం గమనార్హం. ఆ ఏడాదిలో 136 సినిమాలు విడుదలైతే 12 సినిమాలకు వివాద సెగ తగిలింది. అంతకు ముందు ఏడాదిలో విడుదలకు ముందే సినిమాలు వివాదాల సుడిలో చిక్కుకున్నాయి. అభ్యంతరకర సినిమాలు రచనల పట్ల సంబంధిత వర్గం మినహా మిగతా ప్రజలెవరూ పట్టించుకోకపోవటం ఆలోచించాల్సిన అంశం. కులపరంగా, మతపరంగా, చరిత్రపరంగా వక్రీకరణ జరిగిందని అవమానం చోటు చేసుకుందని వివాదాలు తలెత్తిన సినిమాలు రచనలను మిగతా ప్రజలు గొప్పగా ఆదరించిన దాఖలాలు ఉన్నాయి. లిప్‌స్టిక్ అండర్ మై బుర్ఖా అనే చిన్న సినిమా 8 కోట్లతో నిర్మితమై వివాదాల ప్రచారంతో 18 కోట్ల వసూళ్లను రాబట్టింది. పంజాబ్ ఎన్నికల ముందు విడుదలై తీవ్ర దుమారం రేపిన ఉడ్తా పంజాబ్ సినిమా సైతం నిర్మాతలకు 20 కోట్ల లాభం తెచ్చింది. 1927లో విడుదలైన రంగీలా రసూల్‌లో మహ్మద్ ప్రవక్త జీవితాన్ని తప్పుగా చిత్రీకరించారని ముస్లింలలో ఒక వర్గం లాహోర్‌లో తీవ్ర అభ్యంతరం తెలిపింది. తస్లీమా నస్రీన్ బంగ్లాదేశ్ అల్లర్ల నేపథ్యంలో రాసిన లజ్జ వెలువడిన సమయంలో పుస్తకం నిషేధానికి గురైంది. తాజాగా ఐలయ్య పుస్తకంపై వెల్లువెత్తుతున్న అభ్యంతరం విదితమే అయినా పుస్తకాలకు ఎంత గిరాకీ ఏర్పడిందో తెలిసిందే. అభ్యంతరాల పేరుతో నిషేధాలు విధించటం ఫత్వాలు జారీ చేయటం నజరానాలు ప్రకటిస్తూ భౌతిక దాడులకు దిగటం భయ భ్రాంతులకు గురిచేయటం కాక చర్చాయుతంగా పరిష్కరించుకోవటం చట్టాన్ని ఉపయోగించుకొని రక్షణ పొందటం వంటి విషయాలపై దష్టి సారించాల్సిన అవసరం ఉంది. అడ్డు కత్తెర వేసే అనధికార సెన్సార్లు అల్లర్లు దాడులు చరిత్ర ప్రతిష్టను దిగజార్చుతాయే తప్ప ఖ్యాతిని పెంచవన్న సంగతి గుర్తెరగాలి.

సెల్ : 9346611455

ఆర్థిక రంగాన్ని దెబ్బ తీసిన నోట్ల రద్దు



శ్రీనివాస్ సార్ల

ఇటీవల జీడీపీ గణాంకాలను వెల్లడించిన నేపథ్యంలో అసలు జీడీపీ అంటే ఏమిటీ? దానిని ఎలా లెక్కిస్తారు? నిన్న ప్రకటించిన జీడీపీ గణాంకాల్లో డొల్లతనం ఏంటీ? ఇప్పుడు తెలుసుకుందాం. ఒక దేశంలో ఒక సంవత్సర కాలంలో తయారైన అంతిమ వస్తు సేవల విలువ మొత్తాన్ని డబ్బు రూపంలో విలువ కడితే దానిని జీడీపీ అంటారు. దేశం ఆర్థిక వ్యవస్థ మూడు రంగాల మీద ఆధారపడి ఉంది.

1) ప్రాథమిక రంగం ఇందులో అనుబంధ రంగాలు

వ్యవసాయం, మత్స్య పెంపకం, అడవులు

2) ద్వితీయ రంగం ఇందులో అనుబంధ రంగాలు

తయారీ రంగం, నిర్మాణ రంగం, గనులు తవ్వకాలు, పరిశ్రమలు

3) సేవా రంగం

విద్యుత్ శక్తి, నీటి సరఫరా, బ్యాంకింగ్, ఇంధనం, ఇన్సూరెన్స్, ఐటీ, బీమా లాంటి మొత్తం 17 ఉప రంగాలు ఉంటాయి. ఈ మొత్తం రంగాలలో జరిగిన ఉత్పత్తిని లెక్కించడమే జీడీపీ. ఇందులో ప్రాథమిక రంగం నుండి మొత్తం జీడీపీలో 17.32శాతం ద్వితీయ రంగం నుండి 29.2శాతం సేవా రంగం నుండి అత్యధికంగా 53.66శాతం ఆదాయం లభిస్తుంది. ఇక ఉపాధిపరంగా

కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన జీడీపీ గణాంకాలు పరిశీలించే ముందు 2014 నుండి జీడీపీలో ఎటువంటి మార్పులు చోటుచేసుకున్నాయో ఒకసారి పరిశీలిద్దాం. జీడీపీ వద్ధి రేటు 2014-15 మొదటి రెండు మూడు నాలుగు త్రైమాసిక ఫలితాలు ముగిసే నాటికీ వరసగా జీడీపీ వద్ధి రేటు 6.4శాతం, 8.4శాతం, 6.6శాతం, 7.5శాతంగా నమోదు కాగా 2015-16లో మొదటి రెండు మూడు నాలుగు త్రైమాసిక ఫలితాల నాటికి వరుసగా జీడీపీ 7.5శాతం, 7.6శాతం, 7.2శాతం, 7.9శాతంతో అత్యధిక వద్ధి రేటును కలిగి ఉంది. అలాగే 2016-17లో భారత జీడీపీ మొదటి నుండి నాలుగు త్రైమాసిక ఫలితాలు ముగిసే నాటికి వరసగా 7.9శాతం, 7.5శాతం, 7శాతం, 6.1శాతంగా నమోదైంది.

ప్రాథమిక రంగం అత్యధికంగా 48శాతం పారిశ్రామిక రంగం సేవల రంగం వరసగా 24శాతం 28శాతం లేబర్ ఫోర్స్‌ని కలిగి ఉన్నాయంటే ఇప్పటికీ వ్యవసాయ రంగమే అత్యధిక ఉపాధి ఇస్తోంది. అయితే కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన జీడీపీ గణాంకాలు పరిశీలించే ముందు 2014 నుండి జీడీపీలో ఎటువంటి మార్పులు చోటుచేసుకున్నాయో ఒకసారి పరిశీలిద్దాం. జీడీపీ వద్ధి రేటు 2014-15 మొదటి రెండు మూడు నాలుగు త్రైమాసిక ఫలితాలు ముగిసే నాటికీ వరసగా జీడీపీ వద్ధి రేటు 6.4శాతం, 8.4శాతం, 6.6శాతం, 7.5శాతంగా నమోదు కాగా 2015-16లో మొదటి రెండు మూడు నాలుగు త్రైమాసిక ఫలితాల నాటికి వరుసగా జీడీపీ 7.5శాతం, 7.6శాతం, 7.2శాతం, 7.9శాతంతో అత్యధిక వద్ధి రేటును కలిగి ఉంది. అలాగే 2016-17లో భారత జీడీపీ మొదటి నుండి నాలుగు త్రైమాసిక ఫలితాలు ముగిసే నాటికి వరసగా 7.9శాతం, 7.5శాతం, 7శాతం, 6.1శాతంగా నమోదైంది. 2016లో నోట్ల రద్దు నేపథ్యంలో నాలుగో త్రైమాసిక ఫలితం నాటికి 6.1% వద్ధితో ఆర్థిక వ్యవస్థ మంద గమనాన్ని గమనించవచ్చు. ఇక 2016 చివరి భాగంలో తీసుకున్నా నోట్ల రద్దు నిర్ణయం నేపథ్యంలో 2017- 18 జీడీపీ గణాంకాలు పరిశీలిస్తే మొదటి త్రైమాసిక ఫలితం నాటికి భారత ఆర్థిక వ్యవస్థ మూడేండ్ల కనిష్టానికి దిగజారి 5.7శాతం వద్ధిని నమోదు చేసి భారత ఆర్థిక వ్యవస్థ పతనానికి బాటలు వేసింది. రెండో త్రైమాసిక ఫలితాలు చూస్తే 6.3% స్వల్ప వద్ధిని నమోదు చేసింది. గత సంవత్సరం ఇదే కాలంలో 7.5శాతం వద్ధి ఉందని గమనించాలి. ఈ 6.3శాతం వద్ధి కూడా గనులు తయారీ రంగంలో వద్ధి వల్లే సాధ్యమైంది. భారత ఆర్థిక వ్యవస్థకు వెన్నెముక అత్యధిక ఉపాధి కలిపించే వ్యవసాయ రంగంలో కేవలం అతి తక్కువ 1.7శాతం వద్ధిని నమోదు చేసింది. నోట్ల రద్దు ప్రభావం వల్ల రుతుపవనాలు అనుకూలంగా ఉన్న ఈ రంగంలో వద్ధి కనిపించలేదు. అదే విధంగా 2017 అక్టోబర్ నాటికి దేశంలో 8 కీలకమైన ఉక్కు, సిమెంట్, ఇంధనం లాంటి రంగాలలో వద్ధి 4.7శాతం పడిపోయింది. ఆర్థిక వ్యవస్థకు ఈ 8 రంగాలు చోదకాలు కానీ వీటి వద్ధి రేటు మాత్రం క్షీణించిపోవడం గమనార్హం. దేశంలో అసంఘటిత రంగంలో అత్యధిక ఉపాధి కలిపిస్తున్న నిర్మాణ రంగంలో సాధించిన వద్ధి 2.6శాతం మాత్రమే. నోట్ల రద్దు ప్రభావానికి అత్యధికంగా గురైంది ఈ రంగమే. ఇక ద్రవ్య లోటు విషయానికొస్తే అక్టోబర్ చివరి నాటికి బడ్జెట్ అంచనాలతో ద్రవ్యలోటు 96.1శాతం చేరి వణుకు పుట్టిస్తుంది. ద్రవ్య లోటు అనగా ప్రభుత్వానికి వచ్చే ఆదాయం కన్నా ప్రభుత్వం చేసే వ్యయం ఎక్కువగా ఉండటాన్ని ద్రవ్య లోటు అంటాం. ప్రభుత్వ వ్యయాలు పెరిగి ఆదాయాలు తగ్గడం ఇందుకు ముఖ్యమైన కారణం. నోట్ల రద్దు జీఎస్‌టీ ఆన్‌లైన్ ట్రాన్స్‌ఫర్ వల్ల టాక్స్ చెల్లించే వారి శాతం పెరిగి ప్రభుత్వానికి బాగా ఆదాయం వస్తుందని చేసిన ప్రకటనలను పెరిగిన ద్రవ్యలోటు పటాపంచలు చేసింది. అంతా బూటకం అని తేల్చింది. ఆదాయ వ్యయాల మధ్య తేడా ఏప్రిల్ - అక్టోబర్ నాటికి 5.25 లక్షల కోట్లుగా భారీ వ్యత్యాసం నమోదైంది. ఈ ఆర్థిక సంవత్సరంలో ప్రభుత్వం 15.15 లక్షల కోట్ల ఆదాయం వస్తుందని అంచనా వేస్తే ఇప్పటి వరకు 7.29 లక్షల కోట్లు అంటే బడ్జెట్ అంచనా వేసిన దాంట్లో 48.1శాతంగా నమోదైంది. ఇక ప్రభుత్వ వ్యయం విషయానికొస్తే అక్టోబర్ చివరి నాటికి 12.92 లక్షల కోట్లు ఖర్చు చేసింది. ఇది భారీ ద్రవ్యలోటుకు దారి తీసింది. ఇన్ని లొసుగులతో ఉన్న ఆర్థిక వ్యవస్థను పట్టించుకోకుండా కేవలం 5.7శాతం నుండి 6.3శాతం స్వల్ప వద్ధి నమోదు చేసిన జీడీపీని ఆసరా చేసుకుని ఆర్థిక వ్యవస్థకు ఢోకా లేదని కేంద్ర ప్రభుత్వం నంగనాచి వేషాలు వేస్తోంది. దానికి భజన సంఘాలు వంత పాడటం దురదష్టకరం. అసంఘటిత రంగంలో ఉపాధి ఇంకా మెరుగు పడలేదు. వ్యవసాయ రంగం గాడిలో లేదు. ద్రవ్య లోటు ఎంత మాత్రం అదుపులో లేదు.

సెల్ : 7793941842



కొత్త సంవత్సర వేడుకలమీద అంతకోపం దేనికో?

సిహెచ్. రమణకుమార్‌రెడ్డి

డిసెంబర్ నెల మొదలైంది మొదలు భారతదేశంలో వివిధ ప్రాంతాల్లో మొదలయ్యే అలజడి జనవరి 1న నూతన సంవత్సర వేడులకలను నిషేధించాలి. అదేమంటే అది మన సంస్కతీ కాదు విదేశీ సంస్కతిక చిహ్నం, బ్రిటిష్ పాలకులు బలవంతంగా అంటగట్టిన ఆచారమంటూ గొంతు చించుకుంటారు. ఒకవైపు నిరసనలు మరోవైపు వేడుకలు మనకు అలవాటుగా మారిపోయింది. 400 సంవత్సరాల కిందట ఇంగ్లీష్ క్యాలెండర్ మనకు పరాయిదే కావచ్చు, మన పుర్వీకులకు అది కషాయమే కావచ్చు కానీ నేడది మన అణువణువుల్లో నిండిపోయింది, డీఎన్ఏలో కలిసిపోయింది, ఎంతగా అంటే నాడు మన పూర్వీకులకు ఇంగ్లీష్ ఎంతటి కషాయమో నేడు బలవంతంగా రుద్దితే మన పిల్లలకు నేటి భారతీయ క్యాలెండర్ సంవత్సరం కూడా అంతే కషాయంలా ఉంటుంది. ఏవో కొన్నిదేశాలు మినహాయిస్తే ప్రపంచమంతా ఇంగ్లీష్ క్యాలెండర్‌ను పాటించడమో, గుర్తించడమో చేస్తున్నాయి మరెందుకు మనలో కొందరు ఇంకా దాని ఉనికిని గౌరవించడానికి తటపటాయిస్తున్నాం.

మనదికాని టమాట మనజీవితంలో భాగమైంది, మనది కాని మిరపకాయ మన కూరల్లో ప్రధానమైంది. ఎక్కడో పుట్టిన ఆలుగడ్డ పేదవాడి ఆకలిమంటను చల్లారుస్తున్నది, రాక్ మ్యూజిక్‌లు, టైట్ జీన్స్, డిస్కో డ్యాన్స్‌లు, ఫాషన్ పెరేడ్‌లు మనజీవితంతో పెనవేసుకుపోయాయి. పంచెకట్టును వదిలేసి ప్యాంటూ షర్టు వేసుకుంటున్నాం, మంగళ హారతులను వదిలేసి వెస్ట్రన్ మ్యూజిక్ వింటూ కొవ్వత్తులు ఆర్పేస్తూ కేక్‌ను కట్ చేస్తున్నాం. తెలుగులో అడుక్కునే బిచ్చగానికి పావలా ఇయ్యడానికి తటపటాయిస్తాం. ఇంగ్లీష్‌లో అడుక్కునే బెగ్గర్‌కి ఎంతైనా ఇస్తాం. అంతెందుకు మాతభాషను వదిలి మమ్మీ డాడీ అని పిలిచినా ఉప్పొంగిపోతున్నాం. పుట్టింది మొదలు చనిపోయేదాకా, అపాయింట్‌మెంటు మొదలు రిటైర్మెంట్ దాకా మనం ఉపయోగించేది ఇంగ్లీష్ సంవత్సరాన్ని, వాడేది ఇంగ్లీష్ అంకెలను. వ్యాపారమైనా, వ్యవహారమైనా చివరికి వ్యవసాయమైనా అంతా ఇంగ్లీష్ సంవత్సరంతోనే మరెందుకు మనకింత పట్టుదల.

ఇంగ్లీష్ నూతన సంవత్సర వేడుకలను వ్యతిరేకించే వారిలో 90శాతం మందికి తెలుగు నెలలు, తెలుగు సంవత్సరాలు తెలియనే తెలియవు, తెలుగు అంకెలు రాని తెలుగువారు 90శాతం ఉన్నారన్నది వాస్తవం, దేశంలో అంతటా ఇదే పరిస్థితి. మాతభాషల్లో అంకెలు రాయలేని వారు, వారి వారి ప్రాంతాల నూతన సంవత్సరాల వివరాలు మరచిపోయినవారు ఎందరో. భారతదేశం మొత్తానికి పనికివచ్చే, అన్నిప్రాంతాల ప్రజలు మెచ్చే మనదైన క్యాలెండర్ లేదన్నది వాస్తవం. మరెందుకు మనకు ఇంగ్లీష్ సవత్సరాది మీద అంత కోపం. మన సంస్కతిని గౌరవించడమంటే మనదైన పరాయి సంస్కతులను వ్యతిరేకించడమేనా? అంతర్జాలంతో అనుసంధానమైన మనం వసుదైక కుటుంబంలో భాగస్వాములం కాదా? మరాఠాల గుడిపడవను తెలుగు ప్రజలు, మన ఉగాది పర్వదినాన్ని మిగతా భారతదేశం గౌరవించగలిగినప్పుడు, బెంగాల్ ప్రజల "పహేలే బైశాకీ" అస్సామీల బోహాగ్ బిహు, తమిళ పూతండు, పంజాబ్ బైశాకీ మనకు కుటుంబ వేడుకలు కాగలిగినప్పుడు, తల్లికడుపులో పడింది మొదలు కాటికి వెళ్లేవరకు భారతీయుల జీవితాల్లో అడుగడుగునా అంతర్భాగమై కదులుతూ భిన్న సంస్క తులను ఏకం చేస్తూ, మొత్తం దేశాన్ని కాశ్మీర్ నుండి కన్యాకుమారి వరకు కలుపుతున్న ఇంగ్లీష్ సంవత్సరాన్ని వేడుకగా మొదలుపెట్టడానికి అభ్యంతరం దేనికి?

ఐపీఎల్‌లో విదేశీ చీర్‌లీడర్స్ ని ఆహ్వానిస్తాం, సినిమాల్లోకి పోర్న్ స్టార్ సన్నీలియోన్ ని అభిమానిస్తాం, భారతీయ యోగాను అంతర్జాతీయ సమాజం గుర్తించినదని గర్వంగా చెప్పుకుంటాం, భారతీయ పదాలను ఆక్స్‌ఫర్డ్ డిక్షనరీలోకి తీసుకొంటే ఉప్పొంగిపోతాం, దీపావళి వేడుకల్లో వైట్ హౌస్ వెలిగిపోయిందని ఉబ్బితబ్బిబు అవుతున్నాం మరెందుకు మనం ప్రపంచమంతా గౌరవించే ఇంగ్లీష్ సంవత్సర వేడుకలను ఆస్వాదించలేక పోతున్నాం ! నాటి వెస్ట్రన్ టాయిలెట్ నేడు ఇండియన్ టాయిలెట్ కాగలిగినప్పుడు, నాటి వెస్ట్రన్ సూటు-బూటు నేటి భారతీయ దర్పానికి ప్రతీకలుగా మారగలిగినప్పుడు నాటి వెస్ట్రన్ క్యాలెండర్ ఇయర్ నేడు ఇండియన్ క్యాలెండర్ ఇయర్ ఎందుకు కాకూడదు?

వేల సంవత్సరాలుగా ఈ దేశంలోకి ఎవరొచ్చినా ఏది తెచ్చినా చివరికి వారంతా వారితోపాటు తెచ్చుకున్న విషయాలతో సహా భారతీయరూపాన్ని సంతరిచుకున్నారన్నది చారిత్రిక వాస్తవం, ఇంగ్లీష్ నూతన సంవత్సరవేడుకలు కూడా అందుకు మినహాయింపు కాదు. ఉగాది ఉత్సవంలా, గుడిపడవా సంబరంలా, అంగరంగ బైశాకీ లా మనదైన భారతీయ పద్ధతిలో మంగళ హారతులతో కాదంటే మహాశివుని అర్చనతో మంగళప్రదంగా జరుపుకుందాం. భిన్న సంస్క తులతో కళకళ లాడే భారతీయ సమాజంలో మరో తారక చేరుతుంది అంతేకదా.

సెల్ : 9440449392

మనువాదుల మతోన్మాద పోకడలు హద్దు మీరిన వేళ

జి.మధుకర్

స్వాతంత్ర్య ఉద్యమం నుంచి మొదలుకొని ఇప్పటి వరకు మనువాద శక్తులు బూటకపు ప్రచారాలు, ఆరాచకాలు, హత్యలు చేస్తున్నాయి. స్వాతంత్ర్య అనంతరం దేశం మనువాద రాజ్యంగా ఏర్పడాలని చేయని ప్రయత్నం లేదనే చెప్పాలి. గాంధీజీ హత్య మొదలుకొని మొన్న జరిగిన గౌరీలంకేశ్ హత్య వరకు ఎన్నో దురాగతాలు ఉన్నాయి. ఉదాహరణకు 1992 డిసెంబర్ 6న బాబ్రీ మసీదును కూల్చారు. అనంతర పరిణామాల్లో రెండువేల మందికి పైగా ముస్లింలు చనిపోయారు. వర్తమాన భారతదేశ చరిత్రలో అత్యంత పెద్ద మోసానికి పాల్పడిన సంఘ్‌పరివార్ శక్తులు బాబ్రీ మసీదు గురించి పెద్ద అవాస్తవాలన్నీ ప్రచారం చేసి యావత్తు దేశాన్ని విద్వేషానికి ఆహుతి చేయాలనుకుంటున్నారు.

గోసంరక్షణ పేరుతో ఎంతోమంది అభాగ్యులను పొట్టనపెట్టుకున్నారు. హత్య చేసిన వారికి శిక్ష పడ్డట్టుగా ఇప్పటి వరకు లేదు. నిజానికి మతోన్మాదులు ఆరాధించే మనుస్మృతిలోని (3-119) ఒక శ్లోకాన్ని మేథాతిథి వ్యాఖ్యానిస్తూ ఐతరేయ బ్రాహ్మణం నుంచి కొన్ని భాగాలను ఉదాహరిస్తాడు. మనుస్మృతి శ్లోకాలను (526-27) అయన సవివరంగా కర్మకాండల సమయంలో పశు మాంసాన్ని తినేందుకు అంగీకరించే వరకు వెళ్లాడు.

(డిఎన్ ఝా రచించిన గోవు పవిత్రత ఓ కట్టుకథ ప్రచురణ నుంచి) ఋగ్వేదంలో ఆహారం కోసం ఆవులను వధించేవారని, పశుమాంసాన్ని తినేవారని స్వయంగా ప్రకటిస్తున్నది. ఋగ్వేదంలో (10-86-14) ఇంద్రుడు ఇలా చెప్తున్నాడు. "వారు 15-20 ఆంబోతులను వండినారు" ఇంకా ఇలా చెప్తున్నది (10-91-14) అగ్నికి గుర్రాలను, ఎద్దులను, ఆంభోతులను, గొడ్డుటావులను, పొటేళ్లను బలి ఇచ్చారు. ఋగ్వేదం (10-72-6) ప్రకారం ఆవును కత్తి లేదా గొడ్డలితో వధించే వారని తెలియజేస్తున్నది.

ఒకప్పుడు బ్రాహ్మణులు ఆవులను చంపి వాటి మాంసాన్ని తిన్నారని చెప్పడానికి అవసరమైన సాక్ష్యాలు వేదాల్లో ఉన్నాయి. నేడు గోసంరక్షణ పేరుతో మతోన్మాదులు చేస్తున్న అరాచకాలు అంతా ఇంతా కాదు. ఎంతో మంది పేద ముస్లింలను, దళితులను హత్య చేస్తున్నారు. ఉదాహరణకు రాజస్థాన్‌లోని అల్వార్ జిల్లాలో పెహ్లూఖాన్ అనే రైతు ఆవును కొని తరలిస్తుండగా విశ్వహిందూ సంబంధిత మతోన్మాదులు నడిరోడ్డు మీద కొట్టి చంపిన విషయం అందరికీ తెలుసు. మధ్యప్రదేశ్‌లో ఉమాభారతి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు దున్నపోతులు, గేదెలను వధించటం కూడా నేరంగా పేర్కొన్నారు. హర్యానాలోని ఝజ్జర్‌లో అక్టోబర్ 2002లో ఏడుగురు దళితుల్ని హత్య చేశారు. దీంతో సంబంధం ఉన్న వీహెచ్‌పీ నాయకులందరూ బెయిల్ మీద బయట తిరుగుతున్నారు. ప్రభుత్వం ఈ కేసును పూర్తిగా మర్చిపోయింది. దులీనా పోలీస్‌స్టేషన్ నుంచి ఏడుగురు దళితులను బయటకి తీసుకొచ్చి అన్యాయంగా కాల్చి చంపివేశారు. దళితులే ఆవులను చంపడానికి కారణమంటూ వీహెచ్‌పీ చేసిన అబద్దపు ప్రచారమే ఈ హత్యలకు కారణం. దళితులు మనుస్మృతిని అనుసరించకపోతే వారిని కూడా ముస్లింలను శిక్షించినట్టుగానే శిక్షించాలనేది వారి భావన. ఇలాంటి ఇంకో సంఘటన గుజరాత్‌లో చోటుచేసుకుది. చనిపోయిన ఆవు చర్మం వలిచారని బట్టలు తీసి నలుగురు దళిత యువకులను కారుకు కట్టేసి కొట్టారు. దళితులు ఆ చనిపోయిన కళేబారాలను తొలగించకపోతే అంటువ్యాధులు, జబ్బులు ప్రబలుతాయనే కనీస జ్ఞానాన్ని కూడా వీహెచ్‌పీ నాయకులు మరిచిపోయారు. గుజరాత్‌లో మారణహోమం చేసిన గాయాలు చాలా కాలంగా బాధిస్తూనే ఉంటాయి. నేటికీ 59 మంది సజీవ దహనమైన గోద్రా మారణకాండకు సంబంధించిన నిజానిజాలు వెలుగుచూడలేదు. ఎన్‌డీఏ ప్రభుత్వం సాక్ష్యాలు పట్టించుకోకుండా అది అంతర్జాతీయ ఐఎస్ఐ కుట్రగా ప్రచారం చేసింది. ఒరిస్సాలో ఏడుగురు దళిత మహిళలు మతం మారలేదని భజరంగ్‌దళ్ కార్యకర్తలు బలవంతంగా గుండుకొట్టించారు. మరాద్‌లో మరియం బీబీ అనే మహిళ తన పసిపాపతో తన ఇంటికి తిరిగి వచ్చింది. దుర్గావాహినికి చెందిన మహిళలు ఆమెను చుట్టుముట్టి తన ఇంటిలోకి వెళ్లనీయలేదు. పసిపాప వెక్కివెక్కి ఏడుస్తున్నా కనీసం మంచినీరు తెచ్చుకోవడానికి కూడా అనుమతించలేదు.

మనువాదులు ఇప్పుడు సినిమాలు, సినీ నటుల మీద కూడా పేట్రేగుతున్నారు. 2016లో బాలివుడ్ దర్శక నిర్మాత కరణ్‌జొహార్ తీసిన "ఏ దిల్ హై ముస్కిల్" సినిమా విషయంలో బీజేపీ, శివసేన నాయకులు బెదిరించారు. తమిళ నటుడు విజయ్ నటించిన మెర్సిల్ సినిమానూ బీజేపీ నాయకులు అడ్డుకుంటున్నారు. సంజయ్ లీలా భన్సాలీ తెరకెక్కించిన పద్మావతి సినిమానూ వివాదంలోకి తీసుకొచ్చారు. "భన్సాలీ తల నరకండి, దీపికా పదుకొనే ముక్కు కోయండి. వారికి ఐదు కోట్ల బహుమానం" ఇస్తామని ప్రకటించారు. ప్రముఖ నటుడు కమల్‌హాసన్ మీద కూడా సంఘ్ పరివార్ విరుచుకుపడింది. ఇలా కళాకారుల భావ ప్రకటనా స్వేచ్ఛకు భంగం కలిగిస్తున్నారు. ప్రస్తుత రాజ్యాంగాన్ని కాలరాసి, మనుస్మృతిని ప్రవేశపెట్టి దేశాన్ని మనువాద రాజ్యంగా చేయడానికే ఇలాంటి కుట్రలు పన్నుతున్నారు. అంతిమంగా ఈ మనువాద శక్తుల రాజకీయ ఎత్తుగడలకు సామాన్య జనం అసువులు బాస్తున్నారు. నా దేశ ప్రజలారా ఇకనైనా మేల్కొనండి. మనువాదుల మతోన్మాద శక్తులను పారదోలుదాం. ఛాందసభావాలను చంపేద్దాం. మన దేశాన్ని లౌకికదేశంగా కొనసాగిద్దాం.

gaddammadhukar333@gmail.com

కాబోయే ముఖ్య కార్యదర్శి ఎవరు?



శ్రీనివాస్ చిరిపోతుల

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి ముఖ్య కార్యదర్శి ఎవరవుతారనేది చర్చనీయాంశమైంది. ప్రస్తుత ముఖ్య కార్యదర్శి పదవీకాలం జనవరి మాసంతో ముగుస్తున్నది. ఈ నేపథ్యంలో ఎస్‌పి.సింగ్ పదవీకాలాన్ని పొడిగిస్తారనే ప్రచారం కూడా జరుగుతున్నది. అయితే అందుకు తగిన ముందస్తు చర్యలు ప్రారంభమైనట్టు సూచనలేవీ అందలేదు. అర్హులైన ఎనిమిదిమంది ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు తమ అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు. ఈఎనమ డుగురిలో సమర్థురాలైన ముక్కుసూటి అధికారిణి పదవీకాలం ఆర్నెళ్లలోనే ముగియనుంది. మిగతా వారందరికీ రెండు నుంచి మూడు సంవత్సరాల పదవీకాలం మిగిలి ఉంది. ఇక ప్రసార మాధ్యమాలలో జరుగుతున్న ప్రచారాన్ని గమనిస్తే ముగ్గురు అధకారులు మాత్రమే అత్యంత సమర్థులని వారిలోనే ఒకరిని ముఖ్య కార్యదర్శిగా నియమిస్తారనే అభిప్రాయం వ్యక్తమవుతున్నది. ఎస్‌కె.జోషి, బిపి.ఆచార్య, అజయ్ మిశ్రాలు పోటీలో ఉన్నారని ఒక ఆంగ్ల పత్రిక పేర్కొంది. రాష్ట్ర ముఖ్యమంత్రి చెబుతున్న బంగారు తెలంగాణ దిశగా వడివడిగా అడుగులు వేయాల్సిన ప్రభుత్వానికి చురుకైన అధికారినే ముఖ్య కార్యదర్శిగా నియమించవలసిన అవసరమున్నది. జీవోల తయారీలో విస్తృత అనుభవమున్న అధికారిని ఎంపిక చేసుకోవడం వలన పనులు త్వరితంగా జరుగుతాయనేది నిర్వివాదాంశం. ప్రభుత్వాల, ప్రజల ప్రాధామ్యాలకు అనుగుణంగా పనిచేసే అధికారులనే ప్రభుత్వాలు ముఖ్య కార్యదర్శులుగా నియమిస్తాయనేది తెలిసిన విషయమే. రివాజు కూడా. ఇటు ప్రజల ఆకాంక్షలు అటు ప్రభుత్వ ప్రాధాన్యతలు తెలిసిన కలుపుగోలు అధికారి ముఖ్య కార్యదర్శి అయితే ప్రభుత్వ యంత్రాంగం నల్లేరు మీద నడకలా సాగిపోతుంది. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం తర్వాత కొత్తగా ప్రవేశపెట్టిన పరిపాలనా సంస్కరణలు, నూతన పాలనా వ్యవస్థలు అమోఘంగా ఉన్నాయని అధికారపక్షం చెబుతూనే ఉంది. ప్రజల చెంతకు పాలన అందించేలా జిల్లాల పునర్విభజన, భూ రికార్డుల ప్రక్షాళన వంటి సంస్కరణలు బాగున్నాయని సభ్యులు కొనియాడుతున్నారు. వచ్చే ఎన్నికల నాటికి మిషన్ భగీరథ ద్వారా ఇంటింటికీ నీరందించకపోతే ఓట్లడిగేది లేదని ముఖ్యమంత్రి చెప్పడం అసాధారణ విషయమే. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాలకు గురుకుల విద్యాలయాలు ఏర్పాటు చేయడం చరిత్రలో నిలిచిపోయే అంశం. ధూప, దీప నైవేద్యాలకు, అర్చకులకు, మసీదులలో ఇమామ్, మౌజన్‌లకు నిధులు విడుదల చేయడంతో సంబంధిత వర్గాలు సంతోషం వ్యక్తం చేస్తున్నాయి. చిన్న చిన్న సమస్యలున్నప్పటికీ ప్రభుత్వం సాహసోపేత నిర్ణయాలు తీసుకుంటున్నదని ప్రతిపక్ష సభ్యులు కూడా పేర్కొంటున్నారు. మరింత ముందుకెళ్లిన ఎంఐఎం పార్టీ ముఖ్యమంత్రిని ప్రశంసల్లో ముంచెత్తింది. ఉన్నతాధికారులతో కొందరు నిరంతరం శ్రమిస్తూ ప్రజలకు మేలు జరిగే పనులు చేయడానికి సంసిద్ధులుగా ఉంటారు. అవసరమైతే చొరవ తీసుకొని మంత్రులను ఎమ్మెల్యేలను కలిసి వివిధ పథకాల లోటుపాట్లను వివరిస్తారు. ఇంకొకవర్గం తమకు చెప్పలేదనే సాకుతో ఉద్యోగ జీవితాల్ని ఒడిదుడుకులు లేకుండా సాఫీగా గడపాలని చూస్తారు. మరొకవర్గమైతే భయాందోళనల మధ్య ఏ పనికీ పూనుకోకుండా కూర్చోవడం మనం చూస్తూనే ఉన్నాం. తాము రిస్క్ తీసుకొని జవాబుదారీ కావడమెందుకని ఆలోచిస్తే పనులు జరగడం అసంభవం.

సెల్ : 9849110160

వయోవృద్ధుల పట్ల చిన్నచూపు తగదు



శ్రీనివాస్ చిరిపోతుల

ఒకరి కోసం ఒకరు...అనడంలో సహకారం ధ్వనిస్తుంది. అంతకు మించి, మానవత్వం పరిమళిస్తుంది. పిల్లల మేలు కోరి అహర్నిషలు శ్రమిస్తారు పెద్దలు. వారి కోసమే సర్వాన్నీ త్యాగం చేస్తారు. ఆ పెద్దలు వృద్ధులయ్యాక, కుటుంబసభ్యులే మేలు మరచి వ్యవహరిస్తున్న రోజులివి. కతజ్ఞత కనుమరుగైనప్పుడు అసలు ఈ జీవితాలకు అర్థం ఏమిటి, మనమందరం ఎందుకు జీవిస్తున్నట్టు అని 80లలోనే ప్రశ్నించారు ఆంగ్ల రచయిత్రి జార్జి ఇలియట్. ఆనాటి లింగవిచక్షణ, వృద్ధుల పట్ల నిర్లక్ష ధోరణులపై ఆమె అలా కలం పేరుతో తనదైన రీతిలో అక్షర పోరాటం సాగించారు. కాలం గడుస్తున్న కొద్దీ, దేశ విదేశాల్లో పరిస్థితులు దిగజారుతున్నాయే తప్ప మెరుగుపడడం లేదు. ఆమె మాటల్లో చెప్పాలంటే, వృద్ధాప్యం అనేది వారితోపాటు ఇతరులకూ సమస్యగా పరిణమించింది. అలాంటి స్థితికి సాక్షాత్తు కుటుంబసభ్యులే కొంతవరకు కారకులవుతున్నారు. చట్టాలు చేయడమే తప్ప వాటి అమలును పట్టించుకోని వైఖరితో ప్రభుత్వాలు మరికొంత కారణమవుతున్నాయి. వయో వృద్ధుల బాగోగులు చూడాల్సిన చట్టం 17ఏండ్ల నాటిది. దేశవ్యాప్తంగా దాని అమలు తీరు అంతంత మాత్రంగానే ఉన్నది. వృద్ధుల్లో 4వ వంతైనా ఆ చట్టం పరిధిలోకి రావడం లేదు. ఇప్పటికీ అనేకమంది మానసిక, శారీరక వేధింపులతో తల్లడిల్లిపోతున్నారు. అవమానకరమైన పరిస్థితుల్లో అత్యధిక మంది బతుకులు వెళ్లదీస్తున్నారు. వారికి కనీస అవసరాలైనా తీరక మరెందరో అల్లాడుతున్నారు. ఎటువంటి ఆదాయం పొందలేక, దానికితోడు ఇంట్లో వారి చివాట్లకు భరించలేక కుంగిపోతున్నవారు, చాలానే ఉన్నారు. వీటన్నింటి దష్ట్యా, వద్ధజన సంక్షేమ సాధనే లక్ష్యంగా 1999 నాటి జాతీయ విధానాన్ని కేంద్రం సవరించక తప్పదని స్వచ్ఛంద సేవాసంస్థ హెల్పేజ్ ఇండియా అభిప్రాయపడింది. ఆ మేరకు నివేదికను ఓ ప్రజాప్రయోజన వ్యాజ్యం విచారణ సందర్భంగా న్యాయస్థానానికి సమర్పించింది. సమస్య తీవ్రతతో పాటు ప్రభుత్వం, పౌర సమాజం నిర్వర్తించవలసిన గురుతర పాత్రను ఇది తేటతెల్లం చేయడం జరిగింది. జాతీయ నేర గణాంక నమోదు సంస్థ (ఎన్‌సీఆర్‌బీ) 2015లో వెల్లడించిన వివరాల ప్రకారం వృద్ధులపై నేరాలు పెచ్చరిల్లుతున్నాయి. బిడ్డలు విద్య, ఉపాధి, వ్యాపారాల కోసం విదేశాలకు, ఇతరాత్ర రాష్ట్రాలకు తరలివెళ్లడం వలన వయోధికులు ఒంటరిగా మిగిలిపోతున్నారు. ఏ విధమైన ఆధారమూ లేని వారిని నమ్మించి, వంచించి, బెదిరించి చివరకి ప్రాణాలు తీసిన సంఘటనల్లో పొరుగు రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ 3వ స్థానంలో ఉంది. ఒంటరిగా రోజులు వెళ్లదీస్తున్న ముసలి వారిని ప్రభుత్వం గుర్తించి వివరాలు నమోదు చేసుకోవాలని, ప్రత్యేక గుర్తింపు పత్రాలు ఇవ్వడం ద్వారా వారి భద్రతకు భరోసా కల్పించాలని సంబంధిత సంస్థలు, సంఘాలు నివేదించాయి. ఆ సూచనలు అటకెక్కడం, వాటిని వెలికితీసి దుమ్ము దులిపి ఆచరణలో పెట్టాలన్న వినతులూ బుట్టదాఖలు కావడం పరిస్థితుల్ని మరింత దిగజార్చాయి. పిల్లలు పట్టించుకోని తల్లిదండ్రులకు అండగా నిలిచేందుకు, ఉభయ తెలుగు రాష్ట్రాల్లోనూ వయోవృద్ధుల సంఘాలు ఒకే తాటిపైకి రావడం జరిగింది. అవన్నీ సమాఖ్యగా రూపొందించడం హర్షణీయం. వృద్ధుల బాధలను మానసిక, సామాజిక, ఆర్థిక, భావోద్వేగపరంగా విశ్లేషించి పరిష్కార మార్గాలని ప్రభుత్వాలకు సూచించే ప్రక్రియలు ఇప్పటికే ప్రారంభమయ్యాయి. ముదిమి వయసులోని వారి చిరునామా వద్ధాశ్రమం కారాదని, ఒకవేళ అనివార్యమైతే అక్కడ వారికి వైద్యం సహా అన్నిరకాల సదుపాయాలు ఉండాలని న్యాయస్థానాలతోపాటు అధ్యయన సంస్థలూ తేల్చిచెబుతున్నాయి. ఆస్పత్రుల్లో వైద్యపరమైన సౌకర్యాలు కల్పించాల్సింది మాటల్లో కాదు, చేతల్లో. మన కోసం మనం అని వయసు మళ్లిన వారు అనుకోవడంలో సంఘీభావం కనిపిస్తోంది. మీ కోసం మేం ఉన్నాం...అంటూ ప్రభుత్వాలు, పౌరసమాజం వారి కుడి, ఎడమల నిలిస్తే వారికి అది ఓ వరమే అవుతుంది.

సెల్ : 9603471199

ఈ పేజీ మీ అందరిది

ఇక్కడ వ్యక్తమయ్యే అభిప్రాయాలు వ్యాసకర్తల వ్యక్తిగతం. నవతెలంగాణ అభిప్రాయాలు కానవసరం లేదు. 4000 క్యారెక్టర్ల లోపు ఉన్న వ్యాసాలకు ప్రాధాన్యత ఉంటుంది. ఎట్టి పరిస్థితుల్లోను 6000 క్యారెక్టర్లకు మించకుండా పంపించండి. వివిధ ప్రజాసమస్యలపై రాసిన వ్యాసాలకు ప్రాధాన్యత ఉంటుంది. వ్యాస రచయితలు వారి ఫోటో, సెల్‌నెంబర్ ఇవ్వాలి.

- ఎడిటర్

మీ రచనలు పంపవలసిన చిరునామా :

email: vedika@ navatelangana.com Postal Addres: M.H.Bhavan,plot No,21/1, Azamabad, Near RTC Kalayana mandapam,Hyderabad500020. Ph:27665420,27673787,9490099077/78. Fax:040-27652228

ఇలాగైతే 2019లో గెలవటం కష్టం

- మూడున్నరేండ్లకు గుర్తొచ్చామా!
- కొత్తోళ్లని అందలమెక్కిస్తారా? మేం పనికి రామా?
- గజ్వేల్‌లో ఎంపీ, నాయకులను నిలదీసిన టీఆర్ఎస్ కార్యకర్తలు

నవతెలంగాణ-గజ్వేల్

'మూడున్నరేండ్లకు గుర్తొచ్చామా? పాతవాళ్లం పనికిరామా? మమ్ముల్ని కాదని కొత్తవారిని అందలం ఎక్కిస్తారా? ఇదేం న్యాయం. ఇలాగైతే 2019లో గెలవటం కష్టం. ఎన్నికలు దగ్గరవుతున్నప్పుడు మా అవసరం వచ్చిందా? ఇన్ని రోజులు ఎందుకు పట్టించుకోలేదు. ఇప్పుడెందుకు వచ్చారు' అని టీఆర్ఎస్ కార్యకర్తలు మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి, జిల్లా నాయకులు భూపతిరెడ్డిని నిలదీశారు. ఇదెక్కడో కాదు. సీఎం ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గం సిద్దిపేట జిల్లా గజ్వేల్‌లోనే. కొంతమంది కార్యకర్తల వివరాల ప్రకారం...గజ్వేల్ నియోజకవర్గంలో టీఆర్ఎస్ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశాన్ని బుధవారం పీఎన్ఆర్ గార్డెన్స్‌లో ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి, జిల్లా సమన్వయకర్త భూపతిరెడ్డి నేతృత్వంలో బుధవారం నిర్వహించారు. ఆరు మండలాల నుంచి ఎంపీపీలు, జడ్పీటీసీలు, సర్పంచ్‌లు హాజరయ్యారు. మూడున్నరేండ్ల నుంచి తమను ఎవరూ పట్టించుకోవట్లేదని కార్యకర్తలు, నాయకులు, సర్పంచ్‌లు ముఖ్య నాయకులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పాత కార్యకర్తలకు పాతర వేసి, కొత్తవారికే రెడ్ కార్పెట్ వేస్తున్నారంటూ ఆవేదన చెందారు. 2001 నుంచి తెలంగాణ రాష్ట్రం కొట్లాడిన వారిని ప్రభుత్వం, పార్టీ పట్టించుకోవడం లేదని వాపోయారు. కార్యకర్తల బాగోగులను తెలుసు కునేందుకు మూడున్నరేండ్ల తర్వాత సమావేశం పెడ్తారా? అంటూ నిర్వాహకులను నిలదీశారు. గ్రామాల్లో సర్పంచ్‌లు కార్యకర్తలను పట్టించుకోవడం లేదని, వారే పనులు చేసుకుంటున్నారని ఆరోపించారు. దీంతో కార్యకర్తలు, నాయకుల మధ్య వాగ్వాదం జరిగింది. ఇరువురిని సముదాయించేందుకు ఎంపీ కొత్త ప్రభాకర్ రెడ్డి, సమన్వయకర్త భూపతిరెడ్డిలు ప్రయత్నం చేశారు. అయినప్పటికీ కార్యకర్తలు రెండు గ్రూపులుగా విడిపోయి ఒకరిపైకి మరొకరు దూసుకెళ్లారు. దీంతో సమావవేశంలో కొంత సేపు గందరగోళం నెలకొంది. కాంగ్రెస్‌లో ఎమ్మెల్యేగా ఉన్న నర్సారెడ్డి టీఆర్ఎస్ కార్యకర్తలను పోలీసులతో కొట్టించాడని, ఇప్పటికీ దెబ్బలున్నాయని కొందరు కార్యకర్తలు సమావేశంలో ఆగ్రహం వ్యక్తం చేశారు. మరికొందరు భూంరెడ్డి టీడీపీ నాయకులను వెంటేసుకుని రైతుల సమన్వయ కమిటీలను ఏర్పాటు చేసుకుంటున్నాడంటూ విమర్శించారు. దీంతో ఇరు గ్రూపులను సముదాయించేందుకు ప్రయత్నించగా, ఉద్రిక్త వాతావరణం ఏర్పడింది. రెండు గ్రూపులను బుజ్జగించేందుకు నిర్వాహకులు ప్రయత్నించారు. నియోజకవర్గానికి ఒక ఇన్‌చార్జిని నియమించాలని కార్యకర్తలు డిమాండ్ చేశారు. 2019లో పార్టీకి కష్టతరంగా ఉందని, సమావేశంలో కార్యకర్తలు, నాయకులు కరాఖండిగా చెప్పారు. ఇదంతా పెద్ద నాయకుల లోపమేనన్నారు. వేదికపై కార్యకర్తలను మాట్లాడనివ్వకుండా ఆపేశారు. ఆ తర్వాత మంత్రి హరీశ్‌రావు రాకతో సభ ప్రశాంతంగా కొనసాగింది. కార్యకర్తలు తమ దృష్టికి తీసుకొచ్చిన వాటిపై త్వరలోనే సరిచేస్తామని మంత్రి హరీశ్‌రావు హామీనిచ్చారు.

కాళేశ్వరం ఒక అద్భుతం

ఈ తరహా ప్రాజెక్టు చూడలేదు

- ఇది సమీకృత, బహుళార్ధసాధక ప్రాజెక్టు
- మేము బాగా ఆకర్షితులమయ్యాం: కేంద్ర జలసంఘం ప్రతినిధులు

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి

కాళేశ్వరం పనులపై కేంద్ర జలసంఘం ప్రతినిధి బృందం సంతప్తిని వ్యక్తం చేసింది. కాళేశ్వరం ప్రాజెక్టు దేశ చరిత్రలోనే విభిన్నమైనదని ప్రతినిధుల బందం వ్యాఖ్యానించింది. రెండు రోజులపాటు కాళేశ్వరం పనులు పరిశీలించిన ఈ బందం సభ్యులు బుధవారం నాడు జలసౌధలో మీడియాతో మాట్లాడారు. ఇరిగేషన్ ప్రాజెక్టుల నిర్మాణ రంగంలో జాతీయ, అంతర్జాతీయ ప్రమాణాల రీత్యా కూడా కాళేశ్వరం ప్రాజెక్టు అన్నీ విధాలా ప్రత్యేకమైనదిగా వారు వ్యాఖ్యానించారు. ఇది సమీకత బహుళార్ధసాధక ప్రాజెక్టు అని కేంద్ర జల సంఘం ప్రాజెక్టుల అప్రైజల్ విభాగం చీఫ్ ఇంజనీర్ సీకేఎల్ దాస్ అన్నారు. మిడ్‌మానేరు, ఎస్సారెస్పీ సహా పలు ప్రాజెక్టులకు కాళేశ్వరం ఆధారం కాబోతున్నదని చెప్పారు. ఇలా ఒక భారీ ప్రాజెక్టు మరికొన్ని సాగునీటి ప్రాజెక్టులతోఅనుసంధానం చేస్తున్న ప్రక్రియ తెలంగాణలోనే కనిపిస్తున్నట్టు దాస్ అభిప్రాయ పడ్డారు. స్ట్రక్చర్ల నిర్మాణాలు, ప్రణాళిక, పనులవేగం, పనులు జరుగుతున్నతీరు తమను ఆకట్టుకున్నాయని అన్నారు. రేయింబవళ్లు మూడు షిఫ్టులలో భారీగా



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న సీడబ్ల్యూసీ బృందం

జరుగుతున్న పనుల వేగాన్ని బట్టి వచ్చే వానాకాలం నాటిక ల్లా కాళేశ్వరం ప్రాజెక్టు మొదటి మైలు రాయి దాటుతుందని బంద సారధి దాస్ అభిప్రాయ పడ్డారు.. ఈ తరహా వేగవంతమైన పనులు ఎక్కడా చూడలేదని వ్యాఖ్యానించారు. కాళేశ్వరం ప్రాజెక్టువల్ల ఎన్నో ప్రయోజనాలున్నాయని, 18 లక్షల ఎకరాల ఆయకట్టును స్థిరీకరించడం తో పాటు మరో 18 లక్షల ఎకరాలకు కొత్తగా సాగునీటిని అందించే బ హత్తర ప్రాజెక్టు అని ఆయన ప్రశంసించారు. జూన్‌లో ప్రాజెక్టు ద్వారా తొలి ఫలితాన్ని అందించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకున్నదని,టైమ్ ఫ్రేమ్ ప్రకారం పనులు జరిగితే అనుకున్న గడువులోపే ప్రభుత్వ లక్ష్యం నెరవేరుతుందన్నారు. ప్రాజెక్ట్ వ్యయం పెరగకుండా పనులు పూర్తి కావాలన్నారు .అందుకు అన్నీ శాఖలూ కలిసి కట్టుగా పనిచేయాలని దాస్ సూచించారు. . కాళేశ్వరం ప్రాజెక్టును నిర్ణీత గడువు లోగా పూర్తయ్యేలా ప్రణాళికా బద్ధంగా పని చేస్తున్నట్టు ప్రభుత్వ స్పెషల్ చీఫ్ సెక్రెటరీ ఎస్కే జోషి అన్నారు.ముఖ్యమంత్రి కెసిఆర్, ఇరిగేషన్ మంత్రి హరీష్ రావు ఈ ప్రాజెక్టు పనులను నిరంతరం సమీక్షిస్తున్నట్టు ఆయన తెలిపారు. నిర్ణీత గడువు లోపే ప్రాజెక్టును పూర్తి చేసి రికార్డును నెలకొల్పనున్నట్టు ఆయన చెప్పారు. కేంద్ర జలసంఘం డైరెక్టర్లు ముఖర్జీ, రాజీవ్ కుమార్, కాళేశ్వరం సీఈలు ఎన్.వెకటేశ్వర్లు, హరిరామ్ తదితరులు విలేకరుల సమావేశంలో పాల్గొన్నారు.

ఆదర్శ కమ్యూనిస్టు సత్తెనపల్లి వెంకటయ్య

సంస్మరణ సభలో సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని



నవతెలంగాణ-ఖమ్మం ప్రతినిధి

ప్రజల కోసం సత్తెనపల్లి వెంకటయ్య కుటుంబం చేసిన ఉద్యమాలు, త్యాగాలు ఎన్నటికీ మరువ లేనివని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం కొనియాడారు. ఖమ్మంలోని సహకార నగర్‌లో సీపీఐ(ఎం) ఖానాపురం హవేలి కార్యదర్శి దొంగల తిరుపతిరావు అధ్యక్షతన వెంకటయ్య సంస్మరణ సభను బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా తమ్మినేని మాట్లాడుతూ...విద్యుత్ పోరాటం సందర్భంగా పోలీసులు జరిపిన కాల్పుల్లో వెంకటయ్య కుమారుడు సత్తెనపల్లి రామకృష్ణ అమరుడయ్యాడని గుర్తు చేశారు. ఒక కొడుకు ప్రజాపోరాటంలో అమరుడయ్యాడనీ, ఇంకో కొడుకూ ప్రజా ఉద్యమాల్లోనే ఉంటాడని సభావేదికగా వెంకటయ్య చెప్పిన మాటలను తమ్మినేని యాదిజేశారు. చొక్కాలు మార్చినట్టు పార్టీలను మారుస్తున్న ఈ రోజుల్లో వెంకటయ్య నిబద్ధతగా పార్టీ కోసం పనిచేశారని అభినందించారు. ఇంతటి త్యాగ గుణం కలిగిన వెంకటయ్య మరణించడం పార్టీకి తీరని లోటని, డబ్బుకోసం, ఆస్తులకోసం పూటకో మాట, పార్టీలు మార్చేవారున్న ఈ రోజుల్లో దివంగత వెంకటయ్య జీవితం ఆదర్శమని తమ్మినేని కొనియాడారు. కార్యక్రమంలో సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పోతినేని సుదర్శన్‌రావు, రాష్ట్ర కమిటీ సభ్యులు బత్తుల హైమావతి, సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పొన్నం వెంకటేశ్వరరావు, బుగ్గవీటి సరళ, బండి రమేష్, యర్రా శ్రీకాంత్, బత్తుల లెనిన్, భూక్యా వీరభద్రం, మాచర్ల భారతి, జిల్లా కమిటీ సభ్యులు బొంతు రాంబాబు, మాదినేని రమేష్, బండి పద్మ, వేదగిరి శ్రీనివాసరావు, యర్రా శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

సురేశ్ ప్రభుతో కేటీఆర్ భేటీ

నవతెలంగాణ-న్యూఢిల్లీబ్యూరో

ఫిబ్రవరి 22,23వ తేదీల్లో హైదరాబాద్‌లో నిర్వహించే బయో ఆసియా సదస్సుకు గౌరవ అతిథిగా హాజరవ్వా లని కేంద్ర వాణిజ్యశాఖ మంత్రి సురేశ్ ప్రభును రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి కేటీఆర్ కోరారు. పీఐఓ(భారత సంతతి వ్యక్తులు) పార్లమెంటేరియన్ సదస్సుకు హాజరయ్యేందుకు బుధవారం ఢిల్లీకి వచ్చిన కేటీఆర్.... అనంతరం కేంద్ర వాణిజ్యశాఖ మంత్రి సురేశ్‌ప్రభును కలిశారు. బయో ఆసియా సదస్సులో పాల్గొంటానని సురేశ్‌ప్రభు హామినిచ్చారని అనంతరం కేటీఆర్ మీడియాకు చెప్పారు. అలాగే హైదరాబాద్ ఫార్మా సిటీ అభివృద్ధికి రూ.1500 కోట్లతో పాటు, నిమ్జ్ హోదా కల్పించాలని విన్నవించారు. హైదరాబాద్- రామగుండం, హైదరాబాద్ -వరంగల్, హైదరాబాద్-బెంగళూరు పారిశ్రామిక కారిడార్లకు కావాల్సిన నిధులు కేటాయించాలని కోరారు. అలాగే నిజామాబాద్ స్పైస్‌పార్క్‌కు ప్రకటించిన రూ.20 కోట్లను వెంటనే విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు. తెలంగాణ రాష్ట్రానికి ఓ లెదర్‌పార్క్ కేటాయించాలని కోరారు. అంతకముందు విదేశాంగమంత్రి సుష్మాస్వరాజ్ ఆధ్వర్యంలో జరిగిన పీఐఓ పార్లమెంటేరియన్ సమావేశంలో కేటీఆర్ పాల్గొన్నారు.

ఒక నెల వేతనం చెల్లించండి

- రేయాన్ పరిశ్రమ యాజమాన్యానికి ప్రభుత్వం ఆదేశం

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ఈ నెల 12 లోపు కార్మికులకు ఒక నెల వేతనం చెల్లించాలని భూపాలపల్లి జిల్లా కమలాపూర్‌లోని రేయాన్ పరిశ్రమ యాజమాన్యాన్ని ప్రభుత్వం ఆదేశించింది. ఫిబ్రవరి 14లోపు బోర్డ్ మీటింగ్ పెట్టి కంపెనీ భవితవ్యంపై నిర్ణయం తీసుకోవాలని ఆదేశించింది. లేని పక్షంలో కంపెనీ వ్యవహారంపై ప్రభుత్వమే నిర్ణయం తీసుకోవలిసి ఉంటుందని హెచ్చరించింది. ఈ మేరకు బుధవారం సచివాలయంలో రేయాన్ కంపెనీ సీఈఓ నిహార్ అగర్వాల్‌తో ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరి, మంత్రులు చందులాల్, నాయిని నర్సింహారెడ్డి, ఎంపీ సీతారాంనాయక్ యూనియన్ ప్రతినిధులు సమావేశమయ్యారు. కంపెనీ యాజమాన్య తీరుపై కడియం శ్రీహరి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. రేయాన్ పరిశ్రమ మూతపడటంతో గత 32 నెలలుగా వేతనాలు లేక కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారని ఆయన యాజమాన్యానికి తెలిపారు. సంక్రాంతి పండుగ ఉండటంతో కార్మికులకు ఈ నెల 12లోపు ఒక నెల వేతనాన్ని చెల్లించాలని ఆదేశించారు. ఈ మధ్య కాలంలో పేపర్ పల్ప్‌కు ధర పెరిగినందున రేయాన్ పరిశ్రమను పేపర్ పల్ప్ పరిశ్రమగా మార్చి పరిశ్రమను పునరుద్ధరించేందుకు ప్రతిపాదనలు రూపొందించాలని మంత్రులు యాజమాన్యానికి సూచించారు.

లేని పక్షంలో పరిశ్రమను మూసివేయాలనుకుంటే కార్మికులకు చెల్లించాల్సిన బకాయిలన్నిటినీ చెల్లించాలని తెలిపారు. దీనికి సంబంధించి వచ్చే నెల 14 లోపు బోర్డులో చర్చించి నిర్ణయం తీసుకుంటామని కంపెనీ ప్రతినిధులు తెలిపారు. ఈ సమావేశంలో కార్మిక శాఖ కమిషనర్ అహ్మద్ నదీమ్, జాయింట్ కమిషనర్ భాగ్యనాయక్, బిల్ట్ డిప్యూటీ జనరల్ మేనేజర్ కేశవరెడ్డి, బిల్ట్ వర్కర్స్ జేఏసీ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఈ నెల లోపే గురుకులాల్లో ఉపాధ్యాయుల నియామకం : కడియం

నవతెలంగాణ బ్యూరో- హైదరాబాద్

గురుకుల పాఠశాలల్లో ఈ నెల లోపే ఎనిమిదివేల ఉపాధ్యాయ పోస్టుల నియామకం చేపడుతామని ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరి వెల్లడించారు. రాష్ట్రంలోని 475 కేజీబీవీలు, 194 మోడల్ స్కూళ్లలో ఎనిమిది లక్షల మంది విద్యార్థులకు మరింత నాణ్యతమైన విద్యను అందిస్తామన్నారు. బుధవారం గచ్చిబౌలీలో గురుకుల ఇంటర్ స్పోర్ట్స్ లీగ్ క్రీడలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా కడియం శ్రీహరి మాట్లాడుతూ పేద, బడుగు, బలహీన వర్గాల పిల్లలకు విద్యలో అవకాశాలు కల్పిస్తే ఎవరికీ తీసిపోరని గురుకుల విద్యార్థులు నిరూపిస్తున్నారని చెప్పారు. పేద, బడుగు, బలహీన వర్గాల విద్యాభివృద్ధి కోసమే రాష్ట్రంలో పెద్ద ఎత్తున గురుకుల పాఠశాలలను ఏర్పాటు చేశామని తెలిపారు. ఒక్కో గురుకుల విద్యార్థి పైన ఏడాదికి రూ.120వేలు ఖర్చు చేస్తున్నట్టు వెల్లడించారు. అందుకే గురుకుల విద్యార్థులతో కార్పొరేట్, ఇంటర్నేషనల్ స్కూల్స్ పోటీ పడలేకపోతున్నాయని చెప్పారు. ఇంటర్ స్పోర్ట్స్ లీగ్‌లో ఐదు సొసైటీల నుంచి రెండువేల మంది విద్యార్థులు పాల్గొనడం హర్షణీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ గురుకులాల కార్యదర్శి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్, బీసీ గురుకులాల కార్యదర్శి మల్లయ్య భట్టు తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ఇండియా బుల్స్‌ను కాపాడేందుకే

విద్యుత్ కొనుగోళ్లు : రేవంత్‌రెడ్డి

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

ముఖ్యమంత్రి కేసీఆర్‌పై కాంగ్రెస్‌పార్టీ నేత, ఎమ్మెల్యే రేవంత్ రెడ్డి మండిపడ్డారు. తీవ్రస్థాయిలో ఆరోపణలు గుప్పించారు. 24 గంటల విద్యుత్ వెలుగుల వెనుక చీకటి ఒప్పందాలున్నాయని ఆరోపించారు. బుధవారం గాంధీభవన్‌లో యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు అనిల్‌కుమార్‌యాదవ్‌తో కలిసి ఆయనవిలేకరులతో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం తిరస్కరించిన ఔట్ డేటెడ్ టెక్నాలజీ ఇండియా బుల్స్ కంపెనీ కూడా కేసీఆర్‌ను ప్రసన్నం చేసుకుందని, ఇండియా బుల్స్‌కి చెల్లింపులో కేసీఆర్ చీకటి ఒప్పందం ఉందని ఆరోపించారు. సివిల్ కాంట్రాక్టర్‌ని ప్రభుత్వమే దొడ్డిదారిన కేటాయించిందన్నారు. ఇండియా బుల్స్‌ని కాపాడే అవసరం ఈ ప్రభుత్వానికి ఏమొచ్చిందని ప్రశ్నించారు. ఇలాంటి తప్పుడు నిర్ణయాల వల్ల రూ 12వేల కోట్ల భారం ప్రజలపై పడిందని చెప్పారు.

ఒప్పందాలు తప్పని సుబ్బరామిరెడ్డితో చెప్పించండి: బాల్క, పల్లా, భాను

మా సర్కారు చేసుకున్న విద్యుత్ ఒప్పందాలు తప్పని సుబ్బరామిరెడ్డితో చెప్పించాలని రేవంత్‌రెడ్డికి ఎంపి బాల్క సుమన్ సవాల్ విసిరారు. విద్యుత్ ఒప్పందాలను ఛత్తీస్‌గఢ్ సర్కారుతో పాటు కాంగ్రెస్ నేత సుబ్బరామిరెడ్డి సంస్థతో చేసుకున్నామని ఆయన తెలిపారు.

గుర్తింపు పునరుద్ధరణకు

దరఖాస్తు గడువు పొడిగింపు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలోని జూనియర్ కాలేజీల అనుబంధ గుర్తింపు పునరుద్ధరణ కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసే గడువును తెలంగాణ ప్రభుత్వం పొడిగించింది. షెడ్యూల్ ప్రకారం ఈనెల15వ తేదీతో దరఖాస్తు గడువు ముగియనుంది. ఆన్‌లైన్‌లో దాఖలు గడువును ఈనెల 31వ తేదీ వరకు పొడిగిస్తున్నట్టు ఇంటర్ బోర్డు కార్యదర్శి ఎ.అశోక్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. 2018-19 విద్యా సంవత్సరానికి సంబంధించి రాష్ట్రంలోని జూనియర్ కాలేజీలు అను బంధ గుర్తింపు కోసం ఆన్‌లైన్‌లోదరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు.

జర్నలిస్టుల ఇండ్ల స్థలాల కోసం కో-ఆర్డినేషన్ కమిటి

- రౌండ్‌టేబుల్‌లో నిర్ణయం



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

జర్నలిస్టుల ఇండ్ల స్థలాల సమస్య పరిష్కారానికి రాష్ట్ర స్థాయిలో ఒక కో-ఆర్డినేషన్ కమిటీని ఏర్పాటు చేయాలని వివిధ జర్నలిస్టు సంఘాలు, సొసైటీల నేతలు, సీనియర్ జర్నలిస్టులు నిర్ణయించారు. తద్వారా సమస్య తీవ్రతను ముఖ్యమంత్రి కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లాలని వారు అభిప్రాయపడ్డారు. బుధవారం హైదరాబాద్‌లోని సోమాజీగూడ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన రౌండ్‌టేబుల్ సమావేశంలో వారు ఈ మేరకు తీర్మానించారు. జర్నలిస్ట్స్ కో-ఆపరేటివ్ హౌజింగ్ సొసైటీ అధ్యక్షుడు డి.వెంకటాచారి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సొసైటీ కార్యదర్శి ఎమ్ఎస్‌హెచ్ హాష్మీ, టీయూడబ్ల్యూజే ప్రధాన కార్యదర్శి కె.విరాహత్ అలీ, తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టుల సమాఖ్య (టీడబ్ల్యూజేఎఫ్) అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎమ్.సోమయ్య, బి.బసవపున్నయ్య, హైదరాబాద్ ప్రెస్‌క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు రాజమౌళిచారి, విజయకుమార్‌రెడ్డి, హైదరాబాద్ యూనియన్ ఆఫ్ జర్నలిస్ట్స్ (హెచ్‌యుజే) అధ్యక్ష, కార్యదర్శులు ఇ.చంద్రశేఖర్, బి.వి.యన్.పద్మరాజుతోపాటు సీనియర్ జర్నలిస్టులు శైలేశ్‌రెడ్డి, దిలీప్‌రెడ్డి, సత్యమూర్తి, విజేఎమ్ దివాకర్, ఎమ్.కోటేశ్వరరావు, మంజరి, రెహానా, అజిత, నవతెలంగాణ బ్యూరో చీఫ్ వేణుమాధవరావు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా దివాకర్ మాట్లాడుతూ.. ఇండ్ల స్థలాల సమస్యపై జర్నలిస్టు సంఘాలన్నీ ఒకే బాటలో పయనించాలని కోరారు. ఐక్యంగా పోరాడాలని సూచించారు. విరాహత్ అలీ మాట్లాడుతూ.. ముఖ్యమంత్రికి, జర్నలిస్టులకు మధ్య వారధిగా పనిచేసే బాధ్యతను ఎత్తుకున్నవారు ఇండ్ల స్థలాల సమస్యపై సీఎంకు సరైన సమాచారాన్ని చేరవేయాలని కోరారు. వాస్తవాలను ప్రతిబింబించే విధంగా సూచనలివ్వాలని విజ్ఞప్తి చేశారు. బసవపున్నయ్య మాట్లాడుతూ.. ఇండ్ల స్థలాల విషయంలో సంఘాలు, సొసైటీలన్నీ ఒకే మాట మీద నిలబడాలని కోరారు. అందరూ కలిసి సమావేశం నిర్వహించటం హర్షణీయమని అన్నారు. ఈశ్వరరెడ్డి మాట్లాతుడూ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను నివేదిస్తూ ముఖ్యమంత్రికి వినతిపత్రం సమర్పించాలని సూచించారు. చంద్రశేఖర్ మాట్లాడుతూ.. అన్ని సమస్యల మాదిరిగానే ఇండ్ల స్థలాల విషయంలోనూ యూనియన్లు, సొసైటీల మధ్య భిన్నాభిప్రాయాలున్నాయని తెలిపారు. ఇదే సమయంలో అవి బేధాభిప్రాయాలు కావని స్పష్టం చేశారు. ఇండ్ల స్థలాలను సాధించుకోవాలన్న ఆశతోపాటు అందుకవసరమైన కార్యాచరణను రూపొందించి ఆచరణలో పెట్టాలని కోరారు. రౌండ్‌టేబుల్‌లో పాల్గొన్న సంఘాలన్నింటి తరపున ఒక ప్రతినిధి బృందం ముఖ్యమంత్రి కేసీఆర్‌ను కలిసి సమస్యపై చర్చించాలని కోటేశ్వరరావు సూచించారు. త్వరలోనే మరోసారి సమావేశమై కో-ఆర్డినేషన్ కమిటీ, దాని కార్యాచరణకు సంబంధించిన పూర్తి వివరాలను వెల్లడించాలని సమావేశం ఈ సందర్భంగా తీర్మానించింది.

నవచిత్రం

నమ్మితే..అద్భుతాలు సృష్టిస్తారు


బి.జయ

'ప్రస్తుతం పరిశ్రమలో మహిళా దర్శకుల సంఖ్య మరింత పెరగాల్సిన అవసరం ఉంది. మమ్మల్ని నమ్మితే అద్భుతాలు సృష్టిస్తాం' అని అంటున్నారు దర్శకురాలు బి.జయ 'ప్రేమలో పావని కళ్యాణ్', 'చంటిగాడు', 'గుండమ్మగారి మనవడు', 'ప్రేమికులు', 'లవ్‌లీ', 'వైశాఖం' వంటి తదితర ప్రేక్షకాదరణ పొందిన చిత్రాలతో తనకంటూ ఓ ప్రత్యేక గుర్తింపు పొందారు. అతి త్వరలో 'లక్కీఫెలో' చిత్రంతో మరోమారు ప్రేక్షకుల ముందుకు రాబోతున్న బి.జయ బర్త్‌డే నేడు (గురువారం). ఈ సందర్భంగా బుధవారం మీడియాతో ముచ్చటించారు. ఆ విశేషాల సమాహారం ఆమె మాటల్లోనే..

'వైశాఖం' సంతృప్తినిచ్చింది..

నా గత చిత్రం 'వైశాఖం' దర్శకురాలిగా మంచి సంతృప్తినిచ్చింది. మంచి సినిమా తీశారంటూ చాలా మంది ప్రశంసించారు. మహిళలు ఈ చిత్రాన్ని బాగా ఆదరించారు. అపార్ట్‌మెంట్ కల్చర్ ఆడియెన్స్‌కు బాగా కనెక్ట్ అయ్యింది. మేం ఏదైతే ఊహించామో కమర్షియల్‌గా దాన్ని రీచ్ అయ్యింది. ఆ ఉత్సాహంతోనే ఓ కొత్త రకమైన కథతో మళ్ళీ ప్రేక్షకుల ముందుకు వచ్చేందుకు ప్లాన్ చేస్తున్నాం.

లక్కీ ఫెలోగా..

త్వరలోనే 'లక్కీఫెలో' చిత్రాన్ని సెట్స్‌పైకి తీసుకెళ్ళబోతున్నాం. ఒక్కోసారి ఎటువంటి ప్రయత్నం చేయకుండానే మనలో కొంత మందికి చాలా అరుదుగా ఊహించని రీతిలో లక్కీ ఛాన్స్ వస్తుంటుంది. అలాంటి వ్యక్తిని మనం 'లక్కీ ఫెలో' అంటాం. మా చిత్ర కథానాయకుడికి కూడా ఇలాంటి లక్కీ ఛాన్స్ వస్తుంది. ఆ ఛాన్స్‌ను ఉపయోగించుకున్నాడా లేదా?, లేక ఆ ఛాన్స్‌ను ఉపయోగించుకుని మరో లెవల్‌కి ఎలా వెళ్లాడనేది హీరో క్యారెక్టరైజేషన్. హీరోయిన్ పాత్ర కూడా చాలా స్ట్రాంగ్‌గా ఉంటుంది. వైజాగ్‌లో ఫుట్‌పాత్‌పై ఓ మహిళను అందరూ చూస్తుండగా రేప్ చేశారు. అలాంటి సంఘటనలను సైతం మా చిత్రంలో ఉంటాయి. టీనేజ్ అమ్మాయిల అనుభవాలు, వారికెదురయ్యే సంఘటనలు ఇందులో చూపించబోతున్నాం. నేను బేసిక్‌గా వినోదానికి ప్రాధాన్యతనిస్తాను. వినోదం, మానవ సంబంధాలతోపాటు అండర్ కరెంట్‌గా మంచి సందేశం కూడా నా చిత్రాల్లో ఉంటుంది. పేరున్న ఓ యువ నాయకానాయికలను తీసుకోవాలని భావిస్తున్నాం. స్క్రిప్ట్ ఫైనల్ దశలో ఉంది. ఇప్పటి వరకు ఎవరూ టచ్ చేయని సబ్జెక్ట్ ఇది. జూన్ నుంచి రెగ్యులర్ షూటింగ్ స్టార్ట్ చేస్తాం. అన్ని అంశాల సమాహారంగా కమర్షియల్ ఎంటర్‌టైనర్‌గా రూపొందబోతున్న ఈ చిత్రం 'లవ్‌లీ' కంటే పెద్ద హిట్ అవ్వడం ఖాయం.

అలాంటి సినిమా వస్తే చేస్తా..


మహిళా సమస్యలపై, సమాజంలో వారికి జరుగుతున్న అన్యాయాలపై సినిమా చేయమని చాలా మంది అడుగుతుంటారు. నిజం చెప్పాలంటే నాకు మొదట్నుంచి అలాంటి సినిమాలే తీయాలనుంది. అదే సమయంలో కమర్షియల్‌గానూ పెట్టిన పెట్టుబడిని కవర్ చేసే నోటెడ్ కాస్టింగ్ దొరకాలి. అన్ని కుదిరినప్పుడు కచ్చితంగా అలాంటి సినిమా చేస్తాను.

ఇంకా వంటింటికే పరిమితం చేస్తున్నారు..

ఇండస్ట్రీలో మహిళా దర్శకులు చాలా తక్కువ. అంతేకాదు నేను జర్నలిస్ట్‌గా ఉన్నప్పుడు కూడా మహిళా జర్నలిస్ట్‌లు తక్కువగా ఉండేవారు. ఈనాడులో పనిచేసేటప్పుడు నేను ఒక్కదాన్నే మహిళా జర్నలిస్ట్‌గా ఉన్నా. ఆ టైమ్‌లో చాలా మంది నన్ను చూసి పత్రికా జర్నలిస్టులుగా వచ్చారు. ఇదే విషయాన్ని రామోజీరావుగారు కూడా ఓ వేదికలో చెప్పారు. దర్శకురాలిగా మారిన తర్వాత పరిశ్రమలోనూ చాలా మంది ఔత్సాహికులు నన్ను స్ఫూర్తిగా తీసుకుని దర్శకులుగా మారుతున్నాయి. కానీ మన మేకర్స్‌కి మహిళలపై నమ్మకం రావడం లేదు. ఇంకా వంటింటికే పరిమితం చేసి చూస్తున్నారు. ఒక్క ఛాన్స్ ఇస్తే నిరూపించుకోవడానికి చాలా మంది మహిళా దర్శకులున్నారు. అవకాశమే ఇవ్వడం లేదు. నమ్మి అవకాశాలిస్తే అద్భుతాలు సృష్టిస్తారు. ప్రస్తుతం ఒకళ్ళిద్దరు రాణిస్తున్నారు. కొంతమంది పలు వెబ్ సిరీస్‌లు కూడా చేస్తున్నారు. ఇదొక మంచి పరిమాణం కూడా.

సేవ చేయాలనే ఆకాంక్షతో..

నాకు వెబ్ సిరీస్ చేయాలని లేదు. ఎందుకంటే దర్శకురాలిగా సినిమా చేయడం వల్ల వచ్చే ఫోకస్, ఇమేజ్, నేమ్ వెబ్ సిరీస్‌లో రావు. దర్శకత్వం వహించాక, మళ్ళీ అవి చేస్తే ఆ నేమ్ పడిపోతుంది. కానీ ఓ డైరెక్టర్‌గా విభిన్న కథా చిత్రాలు చేయాలనుంది. ఏది చేసినా వినోదానికే పెద్ద పీట వేస్తాను. కొన్ని సినిమాలు చేసిన తర్వాత జనంలోకి వెళ్ళాలనుకుంటున్నా. ప్రజలకు ఏదైన సేవచేయాలనే ఆకాంక్షతో ఓ ప్లాన్ కూడా రెడీ చేశాను. దాన్ని ఇంప్లిమెంట్ చేసేందుకు మరికొంత టైమ్ పడుతుంది.


మోహన్‌బాబు

ఆరుపదుల వయసులోనూ..

మోహన్‌బాబు ద్విపాత్రాభినయం చేస్తున్న చిత్రం 'గాయత్రి'. మదన్ రామిగాని దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమా చిత్రీకరణ చివరి దశలో ఉంది. ఇందులో ఇటీవల కొన్ని యాక్షన్ సన్నివేశాలను తెరకెక్కించారు. యాక్షన్ స్టంట్లను సొంతంగా చేసి మోహన్‌బాబు అందరినీ ఆశ్చర్యపరిచారట. మోహన్‌బాబు చేసిన స్టంట్లకు ఆశ్చర్యపోయిన యాక్షన్ డైరెక్టర్ కనల్ కణ్ణన్ స్పందిస్తూ, 'మోహన్‌బాబు లాంటి పెద్ద ఆర్టిస్ట్‌ను డైరెక్ట్ చేయడం గొప్ప విషయమే. అద్భుతమైన స్టంట్స్‌తో కూడిన యాక్షన్ సన్నివేశాలను 67ఏండ్ల వయసులో కూడా ఆయన చాలా బాగా చేశారు. ఈ సన్నివేశాలు సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలుస్తాయి. బాగా ప్లాన్ చేసి ఎలాంటి రిస్క్‌లు లేకుండా వీటిని తెరకెక్కిస్తున్నాం. ఎనిమిది రోజులపాటు ఈ సన్నివేశాల చిత్రీకరణ జరుగుతుంది' అని తెలిపారు. వీటి కోసం ఆస్ట్రేలియా నుంచి స్టంట్‌మెన్‌ను పిలిపించారట. మంచు విష్ణు, శ్రియా, నిఖిలా విమల్, అనసూయ ప్రధాన పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రాన్ని లక్ష్మీ ప్రసన్న పిక్చర్స్ పతాకంపై మోహన్‌బాబు నిర్మిస్తున్నారు. ఫిబ్రవరి 9న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది.

మళ్లీ మ్యాజిక్‌కి రెడీ..


రవితేజ

రవితేజ, శ్రీనువైట్ల కాంబినేషన్‌లో మరో సినిమా రాబోతుందని గత కొద్ది కాలంగా వార్తలు వినిపిస్తున్న విషయం విదితమే. తాజాగా ఈ సినిమా త్వరలోనే పట్టాలెక్కబోతుందట. శ్రీనువైట్ల మార్క్ కామెడీతో ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా ఈ సినిమా ఉండబోతుందని సమాచారం. అమెరికాలో ఎక్కువ శాతం సాగే ఈ చిత్రంలో రవితేజ ఎన్‌ఆర్‌ఐగా కనిపించనున్నారట. ప్రస్తుతం స్క్రిప్ట్ ఫైనల్ దశలో ఉందని, ఫైనలైజ్ అయ్యాక సినిమాను మొదలు పెట్టేందుకు చిత్ర బృందం ముమ్మర సన్నాహాల్లో ఉంది. ఈ చిత్రాన్ని మైత్రీ మూవీ మేకర్స్ సంస్థ నిర్మించనుందట. గతంలో రవితేజ, శ్రీనువైట్ల కాంబినేషన్‌లో వచ్చిన 'నీకోసం', 'దుబాయ్ శ్రీను', 'వెంకీ' చిత్రాలు మంచి విజయం సాధించాయి. ప్రస్తుతం రవితేజ 'టచ్ చేసి చూడు' చిత్రంలో నటిస్తున్నారు. విక్రమ్ సిరికొండ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాలో రాశీఖన్నా, సీరత్ కపూర్ కథానాయికలు. ఈ చిత్రం ఫిబ్రవరిలో విడుదల కానుంది. దీంతోపాటు కళ్యాణ్ కృష్ణ దర్శకత్వంలో తెరకెక్కబోతున్న ఓ సినిమా ఇటీవలే ప్రారంభమైంది. మాళవిక శర్మ కథానాయిక.

అంత సులభం కాదు


శంకర్

'రజనీకాంత్ దగ్గరకు వెళ్ళడం. అంత సులభం కాదు. ఆయనతో సినిమా తీయడానికి నాకు 11ఏండ్లు పట్టింది' అని అంటున్నారు శంకర్. యావత్ భారతదేశం గర్వించదగ్గ ఫిల్మ్ మేకర్స్‌లో శంకర్ ఒకరు. 'జెంటిల్‌మెన్', 'భారతీయుడు', 'ఒకే ఒక్కడు', 'అపరిచితుడు', 'శివాజీ', 'రోబో' వంటి బ్లాక్‌బస్టర్స్ చిత్రాలను ఆయన తెరకెక్కించారు. ప్రస్తుతం రజనీకాంత్‌తో '2.0' సినిమాను రూపొందిస్తున్నారు. ఇది నిర్మాణాంతర పనులు జరుపుకుంటోంది. ఈ సందర్భంగా రజనీకాంత్‌తో వర్క్ చేయడం గురించి శంకర్ చెబుతూ, 'సూపర్ స్టార్ రజనీకాంత్‌తో పనిచేయడం ఓ మ్యాజిక్ లాంటిది. ఆయనతో 'శివాజీ', 'రోబో', '2.0' చిత్రాలను తెరకెక్కించడం ఆనందంగా ఉంది. గతంలో నేను ఎన్నో సినిమాలు చేసినప్పటికీ రజనీకాంత్‌ను కలవడానికి నాకు 11ఏండ్లు పట్టింది. సూపర్‌స్టార్ దగ్గరకు వెళ్ళడం అంత ఈజీ కాదు. ఇంకా పదేండ్ల ముందుగానే కలిసి ఉంటే, మరో మూడు సినిమాలు చేసే అవకాశాన్ని పొందేవాడిని' అని పేర్కొన్నారు. '2.0' చిత్రం ఏప్రిల్ 14న విడుదలవుతోంది.


ప్రియాంక చోప్రా

హ్యాట్రిక్ బ్లాక్‌బస్టర్ కోసం..


విజయ్

తమిళ స్టార్ హీరో విజయ్, స్టార్ డైరెక్టర్ ఏఆర్ మురుగదాస్ కాంబినేషన్‌లో ముచ్చటగా మూడో సినిమా రాబోతోంది. గతంలో వీరిద్దరి కాంబినేషన్‌లో రూపొందిన 'తుపాకి', 'కత్తి' చిత్రాలు సంచలన విజయాలతోపాటు రికార్డు కలెక్షన్లను రాబట్టాయి. తాజాగా ఈ ఇద్దరి కాంబినేషన్‌లో మరో సినిమా తెరకెక్కబోతోంది. ఇటీవల 'మెర్సల్' చిత్రంతో అదిరిపోయే విజయాన్ని సొంతం చేసుకున్న విజయ్ తన 62వ సినిమాను మురుగదాస్‌తో చేయనున్నారట. కమర్షియల్ ఎలిమెంట్స్‌తోపాటు సందేశం నేపథ్యంలో వీరి గత చిత్రాలొచ్చాయి. అదే తరహాలో తాజా సినిమా కూడా ఉండబోతుందట. ఈ సినిమాకు ఏఆర్ రెహ్మాన్ సంగీతం సమకూర్చనుండటం విశేషం. క్రిష్ గంగాధరన్ సినిమాటోగ్రాఫర్‌గా, శ్రీకర్ ప్రసాద్ ఎడిటర్‌గా పని చేయనున్నారు. హాస్యనటుడిగా యోగిబాబును ఎంపిక చేశారు. ఇందులో విజయ్ సరసన సాయి పల్లవిని తీసుకునే ఆలోచనలో చిత్ర బృందం ఉందట. విజయ్, మురుగదాస్, రెహ్మాన్ కాంబినేషన్‌లో సినిమా అనే టాక్ ఇప్పుడు కోలీవుడ్‌లో క్రేజియెస్ట్‌గా మారింది. మహేష్ హీరోగా మురుగదాస్ రూపొందించిన 'స్పైడర్' గతేడాది విడుదలై నిరాశ పర్చిన విషయం విదితమే.

ఫైర్‌బ్రాండ్ షూటింగ్ షురూ..

ప్రియాంక చోప్రా నటిగా హాలీవుడ్‌లో తానేమిటో నిరూపించుకునే ప్రయత్నం చేస్తూనే, నిర్మాతగా ప్రాంతీయ భాషల్లో సినిమాలను నిర్మిస్తూ నూతన ప్రతిభను ప్రోత్సహిస్తోంది. 2016లో నిర్మించిన 'వెంటిలేటర్' మరాఠి చిత్రానికి మూడు జాతీయ అవార్డులు లభించాయి. అలాగే పలు అంతర్జాతీయ చలన చిత్రోత్సవాల్లోనూ ప్రదర్శితమై పురస్కారాలను దక్కించుకుంది. తాజాగా మరో మరాఠి చిత్రాన్ని సొంత సంస్థ పర్పుల్ పెబ్బుల్ పిక్చర్స్‌పై ప్రియాంక నిర్మిస్తోంది. 'ఫైర్‌బ్రాండ్' టైటిల్‌తో తెరకెక్కించబోతున్న ఈ సినిమా మంగళవారం నుంచి షూటింగ్ ప్రారంభించుకుంది. ఈ చిత్రానికి అరుణ్‌రాజె దర్శకత్వం వహిస్తున్నారు. 'మరాఠిలో ఈ ఏడాది మరో సినిమాతో విజయ పరంపరను కొనసాగించబోతున్నాం. 'ఫైర్‌బ్రాండ్' పేరుతో నూతన సినిమాను నిర్మిస్తున్నాం. అమేజింగ్ స్టోరీతో దర్శకుడు అరుణ్‌రాజె ఈ చిత్రాన్ని రూపొందించనున్నారు. టీమ్ అందరికీ ఆల్ ది బెస్ట్' అంటూ ప్రియాంక ట్వీట్ చేసింది. ప్రస్తుతం ప్రియాంక 'ఏ కిడ్ లైక్ జేక్', 'ఈజ్‌నాట్ ఇట్ రొమాంటిక్?' హాలీవుడ్ చిత్రాల్లో నటిస్తోంది. అలాగే 'పహునా' అనే సిక్కిం చిత్రాన్ని కూడా నిర్మిస్తోంది.

సరికొత్త రొమాంటిక్ డ్రామా..

సందీప్ కిషన్, అమైరా దస్తూర్ జంటగా కృష్ణ తనయ ఘట్టమనేని మంజుల దర్శకురాలిగా మారి రూపొందిస్తున్న చిత్రం 'మనసుకు నచ్చింది'. ఆనంది ఆర్ట్స్ క్రియేషన్స్, ఇందిరా ప్రొడక్షన్స్ పతాకాలపై సంజయ్ స్వరూప్, పి.కిరణ్ సంయుక్తంగా నిర్మిస్తున్నారు. ఈ చిత్ర ట్రైలర్‌ను హీరో మహేష్ మంగళవారం ట్విట్టర్, ఫేస్‌బుక్ ద్వారా విడుదల చేశారు.

ఈ సందర్భంగా నిర్మాతలు మాట్లాడుతూ, 'నటిగా, నిర్మాతగా తనకంటూ ప్రత్యేకమైన పంథాను ఏర్పర్చుకుని మంజుల మల్టీ టాలెంటెడ్ పర్సన్ అనిపించుకున్నారు. నటిగా 'షో' సినిమాతో ఆకట్టుకున్నారు. అలాగే నిర్మాతగా 'పోకిరి' సినిమాతో రికార్డులు క్రియేట్ చేశారు. ఇప్పుడామె 'మనసుకు నిచ్చింది' చిత్రంతో దర్శకురాలిగా మారడం ఆనందంగా ఉంది. రాధన్ సంగీత సారథ్యంలో కంపోజ్ అయిన పాటలు ఇప్పటికే విడుదలై శ్రోతలను అలరిస్తున్నాయి. వాటికి మంచి రెస్పాన్స్ వస్తోంది. త్వరలోనే ప్రీ రిలీజ్ ఈవెంట్ నిర్వహించి, గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఈ నెల 26న సినిమాను విడుదల చేయబోతున్నాం' అని అన్నారు. 'రొమాంటిక్ డ్రామాగా రూపొందిస్తున్న చిత్రమిది. ఇటీవల విడుదలైన టీజర్‌కు మంచి స్పందన లభించింది. తాజాగా మహేష్ రిలీజ్ చేసిన ట్రైలర్ సైతం మంచి ఆదరణ పొందుతుందని ఆశిస్తున్నాను. ఓ కొత్తరకమైన ప్రేమ కథతో తెరకెక్కించిన ఈ చిత్రాన్ని ఆదరించాలని కోరుకుంటున్నా' అని మంజుల తెలిపారు. త్రిధా చౌదరి, ప్రియదర్శి, పునర్నవి, భూపాలం, నాజర్, అరుణ్ ఆదిత్ తదితరులు ఇతర ముఖ్య పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి ఎడిటర్: సతీష్ సూర్య, ఆర్ట్: హరివర్మ, సినిమాటోగ్రఫీ: రవి యాదవ్.


అమైరా దస్తూర్, సందీప్ కిషన్

డబుల్ ధమాకా..!


రకుల్ ప్రీత్ సింగ్

'స్పైడర్' సినిమా తర్వాత రకుల్ ప్రీత్‌సింగ్‌కు తెలుగులో కంటే హిందీ, తమిళ చిత్రాల్లోనే నటించే మంచి మంచి ఆఫర్లు వచ్చాయి. ప్రస్తుతం పలు ఇతర భాషా చిత్రాలు చేస్తూ బిజీగా ఉన్న రకుల్ తాజాగా తెలుగులోనూ ఓ రెండు ప్రాజెక్టుల్లో నటించేందుకు పచ్చజెండా ఊపిందని సమాచారం. అయితే ఈ రెండు ప్రాజెక్టులు కూడా మల్టీస్టారర్ చిత్రాలు కావడం విశేషం. వీటిలో మొదటగా నాగార్జున, నాని కలిసి నటిస్తున్న మల్టీస్టారర్ ఉంది. శ్రీరామ్ ఆదిత్య దర్శకత్వం వహించబోతున్న ఈ సినిమాలో నాని సరసన కథానాయిక పాత్ర కోసం రకుల్‌ని చిత్రబృందం అప్రోచ్ అయ్యిందట. అందుకు ఆమె కూడా ఆసక్తిగా ఉన్నట్టు తెలుస్తోంది. ఇదిలా ఉంటే యువ కథానాయకులు నితిన్, శర్వానంద్ హీరోలుగా హరీష్ శంకర్ దర్శకత్వంలో దిల్‌రాజు 'దాగుడుమూతలు' పేరుతో ఓ మల్టీస్టారర్ చిత్రాన్ని తెరకెక్కిస్తున్న విషయం తెలిసిందే. ఇందులో హీరోయిన్లుగా రకుల్ ప్రీత్ సింగ్, సాయిపల్లవిని ఎంపిక చేశారట. ఇటీవల ప్రారంభమైన సూర్య సినిమాలోనూ రకుల్, సాయిపల్లవి హీరోయిన్లుగా నటిస్తున్న విషయం విదితమే. ఈ చిత్రానికి సెల్వ రాఘవన్ దర్శకత్వం వహిస్తున్నారు. దీంతోపాటు రకుల్ ప్రస్తుతం హిందీలో అక్షయ్ కుమార్, తమిళంలో కార్తీ సరసన నటిస్తోంది.


కంగనా రనౌత్

వెండితెర అరుణిమ సిన్హా..

వైవిధ్యమైన చిత్రాలకు, ప్రయోగాత్మక పాత్రలకు, మహిళా ప్రధాన చిత్రాలకు కేరాఫ్‌గా కంగనా రనౌత్ నిలుస్తుందని చెప్పడంలో ఏమాత్రం అతిశయోక్తి లేదు. ప్రస్తుతం ఆమె 'మణికర్ణిక: ది క్వీన్ ఆఫ్ ఝాన్సీ' చిత్రంలో నటిస్తోంది. తాజాగా ఆర్.బాల్కీ దర్శకత్వంలో ఓ సినిమా చేసేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఎవరెస్ట్‌ను అధిరోహించిన తొలి భారతీయ వికలాంగ మహిళా అరుణిమ సిన్హా జీవితం ఆధారంగా ఆర్.బాల్కీ ఓ చిత్రాన్ని రూపొందించబోతున్నారు. ఇందులో అరుణిమ సిన్హా పాత్రకు కంగనాను ఎంపిక చేశారట. బిగ్‌బీ అమితాబ్ బచ్చన్ మెంటర్ పాత్రను పోషించనున్నట్టు తెలుస్తోంది. ఈ పాత్ర కోసం కంగనా ప్రత్యేక శిక్షణ కూడా తీసుకోనుందట. 'ఈ పాత్రకు కంగనా నూటికి నూరుశాతం న్యాయం చేయగలదనే నమ్మకంతో ఉన్నాం. అలాగే ఆమె మెంటర్‌గా బిగ్ బి అమితాబ్ నటించడం ఆనందంగా ఉంది. అత్యద్భుత ప్రతిభగల ఇద్దరు ఆర్టిస్టులు ఈ చిత్రంలో నటించడం విశేషంగా భావిస్తున్నాను' అని దర్శక, నిర్మాత ఆర్.బాల్కీ తెలిపారు.

ఇదిలా ఉంటే ఝాన్సీ రాణి లక్ష్మిభాయి జీవిత కథను ఆధారంగా చేసుకుని హిస్టారికల్ నేపథ్యంలో దర్శకుడు క్రిష్ 'మణికర్ణిక: ది క్వీన్ ఆఫ్ ఝాన్సీ' చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. ఈ సినిమాను మొదట మార్చిలో లేదా ఏప్రిల్‌లో విడుదల చేయాలనుకున్నారు. సినిమాలో విజువల్ ఎఫెక్స్‌కి సంబంధించిన వర్క్ ఆలస్యమయ్యే అవకాశం ఉండటంతో ఈ చిత్ర విడుదల మరోసారి వాయిదా పడనుందట. క్వాలిటీ కోసం టైమ్ పడుతుందని విఎఫ్‌ఎక్స్ టీమ్ తెలపడంతో సినిమాను జూన్‌లో లేదా జులైలో ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చేందుకు చిత్ర బృందం సన్నాహాలు చేస్తుందట. ఈ సినిమా వాయిదా పడే ఛాన్స్ ఉన్న నేపథ్యంలో ఇండో-బ్రిటీష్ చిత్రం 'స్వార్డ్స్ అండ్ స్కెప్టెస్' చిత్రం బృందం రిలాక్స్ అయ్యింది. దీనికి కారణం ఈ చిత్రాన్ని కూడా లక్ష్మిభాయి జీవితాన్ని బేస్ చేసుకునే రూపొందించారు. ఈ చిత్రాన్ని ప్రపంచ వ్యాప్తంగా మార్చిలో విడుదల చేయనున్నారు.

ఇండ్లు లేనివారికి 'ఆధార్' ఎలా?

- కేంద్రాన్ని ప్రశ్నించిన సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ: నిత్యజీవితంలో అవసరమైన మొబైల్ కనెక్షన్, బ్యాంకింగ్‌తో పాటు సంక్షేమపథకాలకూ ఆధార్‌ను తప్పనిసరిగా అనుసంధానించుకోవాలని కేంద్రం తరుముతున్న సంగతి తెలిసిందే. గూడు లేనివారికి(నైట్ షెల్టర్) సంబంధించి దాఖలైన ఓ ప్రజాప్రయోజన వ్యాజ్యంపై విచారిస్తూ జస్టిస్ ఎం బి లోకూర్ నేతృత్వంలోని ధర్మాసనం కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించింది. ఇప్పటి వరకు 90కోట్లమంది ఆధార్ కార్డును పొందారని ధర్మా సనం తెలుసుకున్న అనంతరం ఆధార్‌కార్డును పొందాలంటే నివాసం గుర్తింపు అడుగుతారు, మరి గూడులేని వాళ్లు ఎలా ఆధార్‌ను పొందుతారని సుప్రీంకోర్టు ప్రశ్నించింది. కేంద్ర ప్రభుత్వం దేశంలో ఇండ్లులేని వాళ్లు లేరనుకుం టున్నదేమో అని వ్యాఖ్యానించింది. ప్రభుత్వం తరపు న్యాయవాది తుషార్ మెహతా వాదిస్తూ నైట్‌షెల్టర్ గురించి విచారిస్తూ ఆధార్ ఎన్‌రోల్‌మెంట్ ప్రస్థావన అనవసరమని అన్నారు. నివాస గుర్తింపు లేనిది ఓటర్ కార్డు లాంటి గుర్తింపు కార్డులేవీ ప్రభుత్వం ఇవ్వలేదని ధర్మాసనం అన్నది. ఇండ్లులేని వారికోసం నిర్మిస్తున్న నైట్ షెల్టర్ల నిర్మాణం లో జరుగుతున్న ఆలస్యంపైనా అసంతృప్తి వ్యక్తం చేసింది. పట్టణాభివృద్ధి విభాగం ప్రిన్సిపాల్ సెక్రెటరీ నేతృత్వంలో ముగ్గురు సభ్యులతో కూడిన కోఆర్డినేట్ కమిటీని ఏర్పాటు చేసి నైట్‌షెల్టర్ నిర్మాణాలను పర్యవేక్షించాలని కేంద్రపా లిత ప్రాంతాలు, అన్ని రాష్ట్రాల ప్రభుత్వాలకు ధర్మాసనం సూచించింది.

ఆధార్‌కు 'వర్చువల్ ఐడి'

ఆధార్ కార్డులు జారీచేయటానికి ప్రభుత్వం సేకరించిన పౌరుల సమాచారానికి ఏ మాత్రం భద్రత లేదని రుజువు చేసిన ట్రిబ్యూన్ పత్రిక విలేకరిపై కేసు నమోదు చేసిన ప్రభుత్వం నలుమూలల నుండి వెల్లువెత్తుతున్న నిరసనలతో నష్టనివారణ చర్యలకు దిగింది. పౌరుల సమాచారానికి భద్రతలేదని స్పష్టం కావటంతో పలు చర్యలకు పూనుకున్నది. ఆధార్ డేటా గోప్యతపై ఆందోళనలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో ఆధార్ గుర్తింపుసంస్థ (యుఐడిఎఐ) బుధవారం 'వర్చువల్ ఐడి'పేరిట ఆధార్ కార్డ్ హోల్డర్లకు ప్రత్యేక సదుపాయాన్ని ప్రకటించింది.

వైరల్ వణుకు

మొదటిపేజీ తరువాయి

మంది చికిత్స కోసం వస్తుండటం ఆందోళన కలిగించే అంశం. జలుబు, న్యూమోనియా, సైనస్, ఊపిరితిత్తులకు సంబంధించిన వ్యాధులు తీవ్రమై ప్రమాదకరంగా మారుతున్నాయి. జ్వరం, జలుబు, దగ్గు సమస్యలతోనే ఎక్కువ మంది ఆస్పత్రులకు వస్తున్నారని వైద్యులు తెలిపారు. వాతావరణంలో విపరీత మార్పులు రావడం, గతంలో కంటే చలి పెరగడం వల్ల వైరల్ ఇన్‌ఫెక్షన్లు వ్యాప్తి చెందుతున్నాయి. వాటితో శ్వాసకోశ వ్యాధులు రెట్టింపు అవుతున్నాయి. ముఖ్యంగా గర్భిణులు, చిన్న పిల్లలు, వృద్ధులపై ఈ ప్రభావం ఎక్కువగా ఉంటోంది. 2 నుంచి 7 రోజులు జ్వరంతోపాటు తీవ్రమైన జలుబు, దగ్గు, నీరసం వంటి లక్షణాలు కన్పిస్తున్నాయి. పిల్లల్లో సైతం శ్వాసకోశ సమస్యలు ఎక్కువవుతున్నాయి. సాధారణ రోజుల్లో నిలోఫర్ ఆస్పత్రికి 300-400 మంది చికిత్స కోసం వస్తుంటారు. ప్రస్తుతం ఈ సంఖ్య అమాంతం పెరిగింది. నిత్యం ఆరేడు వందల మంది వరకు వస్తున్నారు. ఈ ఆస్పత్రిలో 500 మించి పడకలు అందుబాటులో లేవు. దీంతో సేవల్లో ఇబ్బందులు తప్పడం లేదు. కాగా, ప్రతి ఏడాది ఈ సీజన్‌లో వైరల్, శ్వాసకోశ ఇన్‌ఫెక్షన్లు సాధారణమే ఐనప్పటికీ ఈ ఏడాది కనిష్ట ఉష్ణోగ్రతల తాకిడితో భారీగా పెరిగాయని వైద్యులు పేర్కొంటున్నారు. శ్వాసకోశ ఇన్‌ఫెక్షన్లతో న్యూమోనియా కేసులూ నమోదవుతున్నాయి. ప్రస్తుతం ఎక్కువ మంది చిన్నారులు ఈ లక్షణాలతో బాధ పడుతూ చికిత్స కోసం ప్రభుత్వాస్పత్రులను ఆశ్రయిస్తున్నారు. పిల్లలు చాలా తీవ్రమైన జ్వరంతో ఉన్నా.. నలతగా, జబ్బు పడినట్టు కన్పించకపోవడం, ముక్కు కారటం, జలుబు, గొంతునొప్పి, టాన్సిల్స్ వాపు, దగ్గు, ఆయాసం, విరేచనాలు... ఇలా రకరకాల లక్షణాలను బట్టి వైరల్ ఇన్‌ఫెక్షన్లను గుర్తించవచ్చని వైద్యులు చెబుతున్నారు. జ్వరం కొద్దిగా మొదలై క్రమేపీ పెరుగుతూ 3, 4 రోజులకు తీవ్రమైతే బ్యాక్టీరియల్ ఇన్‌ఫెక్షన్‌గా భావించవచ్చు. ఇది ఒకరి నుంచి మరొకరికి వేగంగా వ్యాపించదు. వాతావరణ మార్పుల కారణంగా ఉష్ణోగ్రతలు హెచ్చుతగ్గుదల కావడంతో రెస్పిరేటివీ వైరల్ ఇన్‌ఫెక్షన్లకు గురై శ్వాసకోశ సమస్యలు పెరుగుతున్నాయి. ఇలాంటి వారికి నెబ్యులైజర్ ద్వారా ఆవిరి పట్టాల్సి ఉంటుంది. అయితే ప్రభుత్వాస్పత్రుల్లో ఇవిసరిపోను లేకపోవడం, ఉన్నవి పనిచేయకపోవడంతో రోగులు ప్రయివేటు ఆస్పత్రులను ఆశ్రయిస్తున్నారు. కాగా, ఏజెన్సీ ప్రాంతాల్లో చలి తీవ్రతతో పాటు దోమల బెడద, పారిశుధ్యం వంటి ముందస్తు నివారణ చర్యలు లేకపోవడంతో ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. ఆస్పత్రుల్లో పరిమిత వనరులు, వైద్యులు, సిబ్బంది మందుల కొరత, రోగ నిర్ధారణ సౌకర్యాలు లేకపోవడం కూడా రోగుల పాలిట శాపంగా మారిందని విమర్శలు వస్తున్నాయి. చెత్తచెదారం, రోడ్లపైనే మురికినీరు పొంగి పొర్లడం, కాలువల్లో మురుగునీరు పేరుకు పోవడం వల్ల దోమలు విపరీతంగా పెరిగిపోతున్నాయి. ఇదిలా ఉండగా చలి ప్రభావంతో పెరుగుతున్న వ్యాధుల నేపథ్యంలో ప్రజలను అప్రమత్తం చేసేందుకు కరపత్రాలు, గోడ పత్రికలు, అవగాహన ర్యాలీలు వంటి కార్యక్రమాలు అధికారులు చేపట్టాల్సిన ఉన్నా అవేవి కానరావడంలేదు. పరిశుభ్రత కార్యక్రమాలు, మురుగు కాల్వలను శుభ్రం చేయడం, తాగునీటిలో క్లోరినేషన్ జరగడంలేదు. ఇంటింటికి రక్తపరీక్షల ద్వారా వ్యాధులను నిర్ధారించడంలేదనే విమర్శలు ఉన్నాయి. కాగా, ఉత్తర భారతదేశం నుంచి వీస్తున్న చలిగాలుల ప్రభావంతో రాష్ట్రంలో రానున్న రెండు మూడు రోజుల్లో చలి తీవ్రత మరింత పెరిగే ప్రమాదం. చాలా ప్రాంతాల్లో ఇప్పటికే కనిష్ట ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 3 నుంచి 4 డిగ్రీల మేర పడిపోయే ప్రమాదం ఉందని తెలంగాణ స్టేట్ డెవలప్‌మెంట్ ప్లానింగ్ సొసైటీ (టీఎస్‌డీపీఎస్) వెల్లడించింది. అందువల్ల దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు, గర్భిణులు, చిన్నారులు, వృద్ధులు జాగ్రత్తగా ఉండాలని వైద్యఆరోగ్యశాఖ అధికారులు హెచ్చరిస్తున్నారు.

పలు జిల్లాల్లో గతేడాది కేసుల తీవ్రత ఇలా..

జిల్లా	అక్టోబర్	నవంబర్	డిసెంబర్	మొత్తం
ఆదిలాబాద్	4,003	3,992	2,501	10,496
మహబూబ్‌నగర్	3,954	4,184	3,880	12,018
హైదరాబాద్	3,319	4,314	4,500	12,133
నిజామాబాద్	2,853	3,139	4,064	10,056
సంగారెడ్డి	3,719	4,208	3,098	11,025
ఆసిఫాబాద్	3,045	3,549	2,222	8,816

ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డు పర్సన్స్ అసోసియేషన్ డైరీ ఆవిష్కరణ



నవతెలంగాణబ్యూరో- హైదరాబాద్

తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డు పర్సన్స్ అసోసియేషన్-2018 డైరీ ఆవిష్కరణ బుధవారం హైదరాబాద్‌లో జరిగింది. నవతెలంగాణ దినపత్రిక ప్రధాన సంపాదకులు ఎస్.వీరయ్య ముఖ్యఅతిథిగా హాజరై డైరీని ఆవిష్కరించారు. అసోసియేషన్ అధ్యక్షులు పి.కృష్ణమూర్తి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి ఎంఎన్‌రెడ్డి, గవర్నమెంట్ పెన్షనర్స్ జాయింట్ యాక్షన్ కమిటీ చైర్మెన్ కె.లక్ష్మయ్య, ఆలిండియా ఇన్సూరెన్స్ ఎంప్లాయీస్ ఉపాధ్యక్షులు కెవిఎస్ఎన్ రాజు, యుటిఎఫ్ తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చావ రవి, కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల మరియు సమాఖ్య నుండి అజీజ్ తదిత రులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పెన్షన్స్ స్కీమ్ సంబంధించి ఫిబ్రవరి లో రాష్ట్రస్థాయి, మార్చిలో జాతీయ సదస్సు జరపాలని తీర్మానించారు.

రబీ సీజన్‌లోనే 4వేల పెట్టుబడి అమలు : సీఎల్పీ ఉపనేత జీవన్‌రెడ్డి

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

ఖరీఫ్ సీజన్‌లో పంట నష్టపోతే రాష్ట్ర ప్రభుత్వం రైతులను అదుకోలేదని, రబీ నుంచి రూ 4వేలు ఇచ్చి రైతులను ఆదుకోవాలని సీఎల్పీ ఉపనేత జీవన్‌రెడ్డి డిమాండ్ చేశారు. కౌలు రైతులు, పట్టేదారులు అనే వ్యత్యాసం లేకుండా ప్రతి రైతుకు పెట్టుబడి ఇవ్వాలన్నారు. బుధవారం సీఎల్పీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. కౌలు రైతులకు రూ 4 వేల పెట్టుబడి ఇవ్వాలన్నారు. కేసీఆర్ స్క్రిప్ట్ పంపిస్తే పోచారం శ్రీనివాసరెడ్డి అదే చదువుతున్నారని చెప్పారు.

స్కాలర్‌షిప్ దరఖాస్తుల గడువు పొడిగింపు

- ఫిబ్రవరి 10 వరకు దరఖాస్తుల స్వీకరణ, ఎస్సీ సంక్షేమ శాఖ

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

విద్యార్థుల స్కాలర్‌షిప్ దరఖాస్తుల గడువును ప్రభుత్వం పొడిగించింది. ఈ మేరకు ఎస్సీ సంక్షేమ శాఖ కార్యదర్శి బుద్ధ ప్రకాశ్ జ్యోతి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. 2017-18 విద్యా సంవత్సరానికి సంబంధించి ఫ్రెష్, రెన్యూవల్ విద్యార్థులు ఈ నెల 11 నుంచి ఫిబ్రవరి 10 వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. గత ఏడాది నవంబర్‌లోనే గడువు ముగిసినా కొంతమంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోనందున గడువును పెంచామన్నారు.

13 నుంచి జూనియర్ కాలేజీలకు సంక్రాంతి సెలవు

మొదటిపేజీ తరువాయి

జూనియర్ కాలేజీలకు సంక్రాంతి సెలవులు ప్రకటిస్తున్నట్టు ఇంటర్ బోర్డు కార్యదర్శి ఎ అశోక్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈనెల 14న ఆదివారం, ఈనెల 15న సంక్రాంతి పండుగ సందర్భంగా రెండు రోజులూ ప్రభుత్వ సెలవులే కావడం గమనార్హం. ఇక మిగిలిన 13వ తేదీ ఒక్కరోజే ఇంటర్ బోర్డు అదనంగా సెలవు ప్రకటించింది. రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలలకు ఈనెల 12 నుంచి 16వ తేదీ వరకు పాఠశాల విద్యాశాఖ సంక్రాంతి సెలవులు ప్రకటించింది. ఈనెల 16న సంక్రాంతి పండుగలో భాగంగా ప్రజలంతా కనుమ జరుపుకుంటారు. ఈనెల 16న కనుమ ఉన్నా సెలవు ప్రకటించకపోవడం పట్ల ఇంటర్ బోర్డు తీరుపై విద్యార్థులు, అధ్యాపకులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఈనెల 16న జూనియర్ కాలేజీల్లో తరగతులు ప్రారంభమవుతాయని అశోక్ తెలిపారు. నిబంధనలు ఉల్లంఘించి తరగతులు నిర్వహిస్తే ఆయా కాలేజీ యాజమాన్యాలపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

మరీ ఇంతలా ప్రజల హక్కుల్ని హరిస్తే ఎలా సారూ...

- సీఎంకు మానవ హక్కుల వేదిక బహిరంగ లేఖ

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

ముఖ్యమంత్రి కె చంద్రశేఖరరావు మీ వైఖరి చూస్తుంటే మీరూ, మీ ప్రభుత్వమూ, మీ పోలీసులూ ఏమీ చేసినా ప్రజలకు ఎస్ తప్ప నో చెప్పే హక్కు లేదనుకుంటున్నట్టు కనిపిస్తోందని, ఇది సరైంది కాదని తెలంగాణ మానవహక్కుల వేదిక సూచించింది. మరీ ఇంతలా ప్రజల హక్కుల్ని హరిస్తే ఎలా సారూ అని ప్రశ్నించింది. ఈమేరకు బుధవారం వేదిక రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గొర్రెపాటి మాధవరావు, జి మోహన్, ఉభయ రాష్ట్రాల సమన్వయ కమిటీ సభ్యుడు జీవన్‌కుమార్ ముఖ్యమంత్రికి బహిరంగ లేఖ రాశారు. తెలంగాణ రాష్ట్రంలో ధర్నాలకు, ఊరేగింపులు, సభలు, సమావేశాలకు, తుదకు సంస్మరణ సభలు సైతం ఎందుకు జరుపుకోనివ్వరని ప్రశ్నించారు. ప్రజాస్వామ్యాన్ని గౌరవించడమంటే అన్నిటి కంటే ముఖ్యంగా ప్రజల అభిప్రాయ స్వేచ్ఛను గౌరవించడం, ఆ అభిప్రాయాల వ్యక్తీకరణకు అవకాశం కల్పించే పద్ధతులను గౌరవించడమని వారు పేర్కొన్నారు. అణచివేత వల్ల సమస్యలు పరిష్కారం కావని మీకు తెలియదని కాదని తెలిపారు. ఇకనైనా మీరు దిద్దుబాటు చర్యలు చేపట్టి పోలీసుమయమైన నేటి తెలంగాణ ప్రభుత్వ పాలనా సంస్కృతిలో మార్పులు తీసుకురావాలని కోరారు. నూతన సంవత్సరం సందర్భంగా మీ పోలీసు శాఖ విడుదల చేసిన తెలంగాణ కాప్ యాప్‌లో ప్రజలకు అవసరమైన 350 సేవలున్నాయని చెప్పారు. ప్రజల అభిప్రాయ స్వేచ్ఛను గౌరవించడం కూడా వాటిల్లో ఒకటిగా ఉండేలా చూడాలని వారు విజ్ఞప్తి చేశారు.

ప్రేమించట్లేదని..

మొదటిపేజీ తరువాయి

ప్రకారం...శ్రీకాకుళం జిల్లా రాజాం మండలం గుయ్యానవలస గ్రామానికి చెందిన బోను జయమ్మ, నారాయణ దంపతులకు ఏడుగురు అమ్మాయిలు. వారిలో చిన్నమ్మాయి జానకి (24) డిగ్రీ పూర్తిచేసింది. తల్లిదండ్రులకు ఆసరాగా ఉండాలని నాలుగేండ్ల కింద హైదరాబాద్‌కు వచ్చింది. మూసాపేట హబీబ్‌నగర్‌లో ఓ అద్దె ఇంట్లో రూప అనే మరో యువతితో కలసి ఉంటూ కేపీహెచ్‌బీలోని డీమార్ట్ సూపర్ మార్కెట్‌లో పనిచేస్తోంది. అయితే జానకి పనిచేస్తున్న సూపర్ మార్కెట్‌లోనే రంగారెడ్డి జిల్లా, పెద్దేముల్ సమీపంలోని మారెపల్లికి చెందిన అనంతప్ప అలియాస్ ఆనంద్ అనే యువకుడు పనిచేస్తున్నాడు. కొంతకాలంగా తనను ప్రేమించా లంటూ జానకి వెంటపడుతు న్నాడు. జానకి అతడి ప్రేమను తిరస్కరించింది. దీంతో 10 రోజుల కింద జానకి గదికెళ్లి ప్రేమించకపోతే చంపేస్తానని బెదిరించి వెళ్లాడు. జానకి దానిని పెద్దగా పట్టించుకోలేదు. ఎప్పటిలాగే మంగళవారం సాయంత్రం విధులు ముగించుకుని తన రూంకు వచ్చింది. కొద్దిసేపటికి అక్కడకు వచ్చిన ఆనంద్ జానకితో వాగ్వాదానికి దిగాడు. అనంతరం తనతో తీసుకొచ్చిన కత్తితో జానకి కడుపులో అతిదారుణంగా పొడిచి పారిపోయాడు. రూప ఇంటికొచ్చేసరికి గదిలో జానకి అపస్మారకస్థితిలో రక్తపు మడుగులో కొట్టుమిట్టాడుతోంది. వెంటనే ఇంటి యజమానికి, స్థానికులకు రూప సమాచారమిచ్చింది. వెంటనే జానకిని ప్రయివేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం తెల్లవారుజామున పరిస్థితి విషమించి జానకి మృతిచెందింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. తన ప్రేమను అంగీకరించకపోవడంతోనే కత్తితో పొడిచి హత్య చేసినట్టు పోలీసుల విచారణలో నిందితుడు ఒప్పుకున్నాడు. విషయం తెలుసుకున్న మృతురాలి తల్లిదండ్రులు, బంధువులు, స్నేహితులు హైదరాబాద్‌కు చేరుకున్నారు. రెండురోజుల్లో సంక్రాంతి పండుగకు వస్తుందకున్నామని, ఇలా అవుతుందని ఊహించలేదని కన్నీరు మున్నీరయ్యారు. ప్రేమ పేరుతో వేధిస్తున్నాడన్న విషయం ఎప్పుడూ జానకి తమకు చెప్పలేదన్నారు. దారుణానికి పాల్పడిన నిందితుడిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

ప్రత్యక్ష ఎన్నికలే మేలు


- బడ్జెట్‌లో 40 శాతం నిధులివ్వాలి
- మహారాష్ట్ర పరోక్ష ఎన్నికలు మానేసింది
- పంచాయతీరాజ్ చాంబర్ అధ్యక్షులు సత్యనారాయణరెడ్డి

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాష్ట్రంలోని స్థానిక సంస్థలకు ప్రస్తుతమున్న ప్రత్యక్ష పద్ధతిలోనే ఎన్నికలు నిర్వహించాలని తెలంగాణ పంచాయతీరాజ్ చాంబర్ రాష్ట్ర అధ్యక్షులు చింపుల సత్యనారాయణరెడ్డి అన్నారు. పరోక్ష ఎన్నికల మూలంగా గ్రామాలు కలుషితమవుతాయని చెప్పారు. రాజకీయ కక్షలు ఏర్పడి శాంతిభద్రతల సమస్యలు ఉత్పన్నమవుతాయని వివరించారు. బుధవారం హైదరాబాద్‌లోని సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో పంచాయతీరాజ్ చాంబర్ రాష్ట్ర నాయకులు బి. సిద్దార్థ, ఆర్.పురుషోత్తమరెడ్డి, అశోక్‌రావు, మధుసూదన్ గుప్త, బి. శ్రీనివాసరావు, ఎం.వెంకట్‌తో కలిసి మీడియాతో మాట్లాడారు. 73 శాతం జనాభా గ్రామీణ ప్రాంతాల్లో నివసిస్తున్నదని, రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్లో 40 శాతం నిధులు కేటాయించాలని కోరారు. ఈమేరకు పంచాయతీరాజ్ కొత్త చట్టంలో చేర్చాలని వివరించారు. 8666 పంచాయతీలకుగాను 25 శాతం గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు లేరన్నారు. ఇప్పుడు 500 జనాభా ఉన్న ప్రాంతాలను పంచాయతీలు చేస్తే, పంచాయతీ కార్యదర్శులు ఇతర ఉద్యోగులు, సిబ్బందిని ఎలా సమకూరుస్తారని ప్రశ్నించారు. కొత్తగా వచ్చే 4000 పంచాయతీల్లో అనేక సమస్యలు తలెత్తుతాయని వివరించారు. బంగారు తెలంగాణ రావాలంటే పంచాయతీరాజ్ వ్యవస్థను బలోపేతం చేయాలని డిమాండ్ చేశారు. కేరళ, పశ్చిమబెంగాల్ తరహాలో కొత్త పంచాయతీరాజ్ చట్టం రూపొందించాలని సూచించారు.

రైల్వే పనితీరుపై ఎంపీల అసంతృప్తి

- విభజన చట్టం షెడ్యూల్-9 ప్రకారం అభివృద్ధి చేయాలి: ఎంపీలు



నవతెలంగాణ-సిటీబ్యూరో

దక్షిణ మధ్య రైల్వే పనితీరుపై ఎంపీలు అసంతృప్తి వ్యక్తం చేశారు. తమ నియోజక వర్గాల పరిధిల్లో కొత్త రైల్వే లైన్లు, కొత్త రైళ్లు, ఆర్‌యూబీ, ఆర్‌ఓబీ, వ్యాగన్ ఫ్యాక్టరీ, కోచ్ ఫ్యాక్టరీ, డబ్లింగ్, ట్రిబులింగ్ లైన్లు, ఎలక్ట్రిఫికేషన్ గురించి మూడేండ్ల నుంచి రైల్వే బోర్డుకు ప్రతిపాదనలు పంపినా, కేటాయింపులపై లేఖలు అందజేస్తున్నా పరిగణలోకి తీసుకోకపోవడంపై సభ్యులందరూ అసహనం వ్యక్తం చేశారు. ప్రతి ఏటా రైల్వే బడ్జెట్ రూపకల్పనలో సికింద్రాబాద్‌లోని రైల్ నిలయంలో తెలంగాణ, కర్ణాటక, మహారాష్ట్రలకు చెందిన లోక్‌సభ, రాజ్యసభ సభ్యులతో దక్షిణ మధ్యరైల్వే జీఎం వినోద్‌కుమార్ యాదవ్ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. అందులో సికింద్రాబాద్ ఎంపీ బండారు దత్తాత్రేయ, ఆదిలాబాద్ ఎంపీ గోదం నగేష్, భువనగిరి ఎంపీ బూర నర్సయ్యగౌడ్, బీదర్ ఎంపీ భగవంత్ ఖుబా, చేవేళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, కరీంనగర్ ఎంపీ బి.వినోద్ కుమార్, మహబూబాబాద్ ఎంపీ ఏ.సీతారాంనాయక్, మహబూబ్‌నగర్ ఎంపీ ఏపీ.జితేందర్‌రెడ్డి, మల్కాజ్‌గిరి ఎంపీ మల్లారెడ్డి, నాగర్‌కర్నూల్ ఎంపీ నంది ఎల్లయ్య, నల్లగొండ ఎంపీ గుత్తా సుఖేందర్‌రెడ్డి, మెదక్ ఎంపీ కొత్త ప్రభాకరరెడ్డి, పెద్దపల్లి ఎంపీ బాల్క సుమన్, వరంగల్ ఎంపీ పసునూరి దయాకర్, జహీరాబాద్ ఎంపీ బీబీ.పాటిల్, రాయచూర్ ఎంపీ బివి.నాయక్, లాతూర్ ఎంపీ బలీరాం గైక్వాడ్, రాజ్యసభ సభ్యులు కేకే, రాపోలు ఆనంద భాస్కర్, గరికపాటి మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు. సమావేశం అనంతరం పలువురు సభ్యులు మీడియాతో మాట్లాడారు.

కొత్త లైన్లు వేయాలి: నంది ఎల్లయ్య

అత్యంత వెనుకబడ్డ పాత పాలమూరు జిల్లాలో కొత్త రైల్వేలైన్లు వేస్తే అక్కడి యువతకు ఉపాధి అవకాశాలు పెరగడమే కాకుండా కూలీల వలసలు తగ్గుతాయని నాగర్‌కర్నూల్ ఎంపీ నంది ఎల్లయ్య అభిప్రాయపడ్డారు.

ఈఏడాది చివరికల్లా ఎంఎంటీఎస్ ఫేజ్-2 పూర్తి చేస్తాం: జీఎం

జంటనగరాలు, నగర శివార్లకు రవాణా సౌకర్యం కల్పిస్తున్న ఎంఎంటీఎస్ ఫేజ్-2 ప్రాజెక్టు ఈ ఏడాది చివరికల్లా పూర్తిచేస్తామని దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ వినోద్ కుమార్ యాదవ్ ప్రకటించారు.

దళిత సర్పంచ్ బహిష్కరణపై ఎస్సీ కమిషన్ ఫైర్


- ఫిర్యాదుపై ఎందుకు స్పందించలేదని సీపీకి సూటీ ప్రశ్న
- నేటి సాయంత్రంలోపు నివేదిక ఇవ్వాలని ఆదేశాలు
- లేకపోతే తామే రంగంలోకి దిగుతామని స్పష్టం

నవతెలంగాణ-నిజామాబాద్ ప్రతినిధి

దళిత సర్పంచ్‌ను బహిష్కరించడంపై ఎస్సీ కమిషన్ ఆగ్రహం వ్యక్తం చేసింది. సర్పంచ్ ఫిర్యాదు చేసినంక కూడా ఎందుకు విచారణ చేపట్టలేదని ప్రశ్నించింది. దీనిపై ఎస్సీ కమిషన్ కార్యాలయ అధికారులు నేరుగా నిజామాబాద్ పోలీసు కమిషనర్ కార్తికేయతో మాట్లాడినట్టు విశ్వసనీయ సమాచారం. గురువారం సాయంత్రంలోపు ఘటనపై విచారణ జరిపి నివేదిక ఇవ్వాల్సిందిగా ఆదేశించింది. లేకపోతే తామే నేరుగా రంగంలోకి దిగాల్సి వస్తున్నదని హెచ్చరించినట్టు తెలుస్తోంది. నిజామాబాద్ జిల్లా మెండోరా మండలంలోని బుస్సాపూర్ గ్రామ సర్పంచ్ బహిష్కరణపై ఎస్సీ కమిషన్ ఆరా తీసింది. బుస్సాపూర్‌లో దళిత సర్పంచ్ బహిష్కరణపై 'నవతెలంగాణ'లో రెండు రోజులుగా కథనాలు ప్రచురిస్తున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఎస్సీ కమిషన్ కార్యాలయానికి చెందిన నర్సింహ నేరుగా 'నవతెలంగాణ'తో మాట్లాడి ఘటన తాలుకా వివరాలు తెలుసుకున్నారు. అనంతరం బుస్సాపూర్ సర్పంచ్ మమతతో ఎస్సీ కమిషన్ అధికారులు ఫోన్‌లో మాట్లాడారు.

వచ్చే బడ్జెట్‌లో బీసీలకు అధిక నిధులు: జోగు

- బీసీ సంక్షేమ శాఖ క్యాలెండర్ ఆవిష్కరణ



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

వచ్చే బడ్జెట్‌లో బీసీ సంక్షేమానికి అధిక నిధులు కేటాయిం చబోతున్నట్టు బీసీ సంక్షేమ శాఖ మంత్రి జోగు రామన్న తెలిపారు. ఇదివరకే బీసీల సమగ్రాభివృద్ధి కోసం పక్కా ప్రణాళిక రూపొందిం చామన్నా రు. బుధవారం సచివాలయంలో బీసీ సంక్షేమ శాఖ క్యాలెండర్ ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భగా మంత్రి మాట్లాడుతూ బీసీ వర్గాలను అన్ని రంగాల్లో ముందుకు తీసుకువెళ్లేందుకు సీఎం కేసీఆర్ దిశా, నిర్దేశం చేశారన్నారు. అందుకు అనుగుణంగానే బీసీ ప్రజా ప్రతినిధులంతా కలిసి ప్రణాళి కను రూపొందించినట్టు తెలిపారు. బీసీ సంక్షేమ సహకార సమాఖ్యకు సంబం ధించిన వెబ్‌సైట్‌ను కూడా ప్రారంభించామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంబీసీ కార్పొ రేషన్ తాడూరి శ్రీనివాస్, బీసీ కమిషన్ సభ్యులు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

మంత్రితో బుర్రా వెంకటేశం భేటీ

బీసీ సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం, కమిషనర్ అనితా రాజేంద్ర మంత్రి జోగు రామన్నను సచివాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా బీసీ వర్గాల అభివృద్ధి కోసం చేపట్టాలిసిన కార్యక్రమాలపై చర్చించారు.

వేరుశనగ.. రైతు గోస

నవతెలంగాణ-మహబూబ్‌నగర్ ప్రతినిధి

మహబూబ్‌నగర్ ఉమ్మడి జిల్లాలో గద్వాల, వనపర్తి, నారాయణపేట, నాగర్‌కర్నూల్ పరిధిలో వేరుశనగను అధికంగా సాగు చేస్తారు. ఈ ఏడాది ఖరీఫ్ చివరలో కురిసిన వర్షాలతో రైతులు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా లక్షా 25వేల ఎకరాల్లో వేరుశనగ సాగు చేశారు. బాగా దిగుబడి వస్తే.. ఎకరాకు 15 క్వింటాళ్ల వేరుశనగ పంట చేతికి వస్తుంది. మొత్తం జిల్లాలో 18,75,000 క్వింటాళ్ల దిగుబడి రావాల్సి ఉంది. కానీ ఈసారి ఎకరాకు 5, 6 క్వింటాళ్ల దిగుబడి మాత్రమే వచ్చిందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దిగుబడి తగ్గడంతో ఉమ్మడి జిల్లాలో మొత్తం 6,25,000 క్వింటాళ్లు మాత్రమే చేతికి వస్తున్నది. అయితే ఎకరాకు సుమారు రూ. 25వేల నుంచి రూ.30వేల వరకు పెట్టుబడి పెట్టారు. ఇక దిగుబడి పరిస్థితి ఇలా ఉంటే మార్కెట్ మాయాజాలం మరోలా ఉంది. వేరుశనగ పంటను మార్కెట్‌లోకి తీసుకెళ్తే.. రైతులకు చేదు అనుభవం ఎదురవుతోంది. మార్కెట్‌లో పాలక వర్గాలున్నా.. రైతులకు ఏ మాత్రం సహాయపడటం లేదు. వేరుశనగను రూ.4550 క్వింటా చొప్పున కొనుగోలు చేయాల్సి ఉంది. తాలు, తేమ, మట్టి, చెత్త పేరుతో ధర తగ్గించొద్దని నిబంధనలు ఉన్నా యి. కానీ క్వింటాకు రూ.3000 మించి కొనుగోలు చేయడం లేదు. దీంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు.

మార్కెట్‌లో ఏం జరుగుతోంది ?

ఉమ్మడి జిల్లాలో 18 వ్యవసాయ మార్కెట్‌లు న్నాయి. వీటి పరిధిలో ప్రభుత్వంచే నియమిం చబడిన పాలకవర్గాలు ఉన్నాయి. వీరంతా సరుకు చూసి ధర నిర్ణయించే విధంగా రైతులకు సహకరిం చాలి. ఏజెన్సీలు ఎవరైనా ధర తక్కువగా నిర్ణయి స్తే.. వెంటనే పాలకవర్గాలు, అధికారులు కలిసి చర్చించి చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది. కానీ పాలకవర్గాలు వ్యాపారులకే వత్తాసు పలుకుతు న్నారు. వారు ఏదంటే అదే అన్నట్టు నిమ్మకుంటు న్నారు. తేమ లేకున్నా ఉందని చెప్పి రైతులను నిలువునా ముంచుతున్నారు. ధరల విషయంలోనూ వ్యాపారులు చెప్పిందే వేదంగా మారింది. దీంతోపా టు మార్కెట్‌లో మరో రూపంలో దోపిడీ కొనసాగు తోంది. సంచి తూకం అంటూ కేజీ అధికంగా తూకం చేస్తున్నారు. ఇక దడువాయి, కమీషన్ పేరుతోనూ దోపిడీ చేస్తున్నా పట్టించుకునేవారు లేక అన్నదాతలు అల్లాడుతున్నారు.

రైతుల ఆగ్రహం..

వేరుశనగకు మద్దతు ధర చెల్లించాలని డిమాండ్ చేస్తూ రైతులు మూడు రోజుల కిందట రాస్తారోకో నిర్వహించారు. ప్రతి రోజూ ఏదో ఒక చోట రైతులు రోడ్డు మీదిగి వచ్చి ఆందోళనలు చేస్తున్న పరిస్థితి. అయినా అధికారులు స్పందించడం లేదు.

రెండెకరాలకు10 క్వింటాళ్ల దిగుబడి
లక్ష్మయ్య- తెలకపల్లి

నేను రెండెకరాల్లో వేరుశనగ పంట సాగు చేశా. ఆలస్యంగా కురిసిన వర్షాల వల్ల ఎకరాకు 5 క్వింటాళ్లు కూడా రాలేదు. పెట్టుబడి ఎకరాకు రూ.30 వేలు దాటింది.

వేరుశనగ రైతులను ఆదుకోవాలి
కోడేరు శ్రీనివాసులు- రైతు సంఘం
నాగర్‌కర్నూల్ జిల్లా కార్యదర్శి

ఖరీఫ్‌లో బాగా పంటలు నష్టపోయిన రైతులు రబీలో వేరుశనగ వేసుకున్నారు. కానీ, వర్షాలు ఆలస్యంగా కురవడం వల్ల ఈ పంట దిగుబడీ తగ్గింది. దీనికి తోడుగా మార్కెట్‌లో దోపిడీ సాగుతో ంది. ధరలు లేక రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. గిట్టుబాటు ధర రూ.4550 ఇవ్వాలి.

సివిల్స్ ఇంటర్వ్యూలకు 1099 మంది ఎంపిక

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

సివిల్ సర్వీసెస్-2017 మెయిన్స్ ఫలితాలను యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యూపీఎస్సీ) బుధవారం విడుదల చేసింది. సివిల్ సర్వీసెస్ ఇంటర్వ్యూలకు దేశవ్యాప్తంగా 1,099 మంది అభ్యర్థులు ఎంపికయ్యారు. ఇందులో జనరల్ కేటగిరీ నుంచి 500 మంది, ఓబీసీ నుంచి 347 మంది, ఎస్సీల నుంచి 163 మంది, ఎస్టీల నుంచి 89 మంది చొప్పున మొత్తం 1,099 మంది అభ్యర్థులున్నారు. ఎంపికైన వారి అభ్యర్థుల జాబితాను యూపీఎస్సీ వెబ్‌సైట్‌లో పొందుపరిచింది. ఇండియన్ అడ్మినిస్ట్రేటివ్ సర్వీస్ (ఐఏఎస్), ఇండియన్ ఫారిన్ సర్వీస్ (ఐఎఫ్ఎస్), ఇండియన్ పోలీసు సర్వీస్ (ఐపీఎస్), కేంద్ర ప్రభుత్వ సర్వీసులు (గ్రూప్-ఏ, గ్రూప్-బీ) పోస్టులకు ఉద్యోగుల ఎంపిక కోసం 2017, అక్టోబర్ 28 నుంచి నవంబర్ 3వ తేదీ వరకు సివిల్స్ మెయిన్స్ రాతపరీక్షలను యూపీఎస్సీ నిర్వహించింది. ఫిబ్రవరి 19 నుంచి సివిల్ సర్వీసెస్ ఇంటర్వ్యూలు ప్రారంభమవుతాయని యూపీఎస్సీ ప్రకటించింది. ఇంటర్వ్యూలకు ఎంపికైన అభ్యర్థులు సంబంధిత పత్రాలతో హాజరుకావాలని కోరింది. ఈనెల 18వ తేదీ నుంచి ఇంటర్వ్యూలకు ఎంపికైన అభ్యర్థులకు ఈ సమ్మాన్ లెటర్లు వెబ్‌సైట్‌లో డౌన్‌లోడ్ చేసుకునేందుకు అందుబాటులో ప్రకటించింది. ఏమైనా సందేహాలుంటే 011-23385271, 23381125, 23098543 లేదా ఫ్యాక్స్ ద్వారా 011-23387310, 23384472 నెంబర్లకు పంపాలని కోరింది. ఇంటర్వ్యూలకు ఎంపికైన అభ్యర్థులకు యూపీఎస్సీ నుంచి నేరుగా ఎలాంటి సమాచారం పంపబోమని స్పష్టం చేసింది. అభ్యర్థుల డిటెయిల్డ్ అప్లికేషన్ ఫార్మ్ (డీఏఎఫ్) ఈనెల 16 నుంచి 29వ తేదీ వరకు ఇంటర్వ్యూలకు ఎంపికైన వారి కోసం యూపీఎస్సీ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంటుందని తెలిపింది. జోన్లు, క్యాడర్ ప్రాధాన్యతలు సరిచూసుకోవాలని సూచించింది. ఇంటర్వ్యూలకు ఎంపికైన అభ్యర్థులు అటెస్టేషన్ ఫార్మ్‌ను ఆన్‌లైన్‌లో పూర్తి చేసి పంపాలని కోరింది. ఫిబ్రవరి 19 నుంచి ఇంటర్వ్యూల నిర్వహణ ప్రక్రియ పూర్తయ్యే వరకు అభ్యర్థులకు అందుబాటులో ఉంటుందని పేర్కొంది. ఇంటర్వ్యూలకు ఎంపిక కాని అభ్యర్థుల మార్కుల వివరాలను తుది ఫలితాలు విడుదలైన 15 రోజుల తర్వాత ప్రకటిస్తామని తెలిపింది. ఆ వివరాలు ప్రకటించిన నాటి నుంచి 60 రోజుల వరకు అభ్యర్థులకు అందుబాటులో ఉంటాయని పేర్కొంది. ఇంటర్వ్యూలకు ఎంపికైన అభ్యర్థుల వివరాల కోసం యూపీఎస్సీ వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించింది.

100 శాతం ఎఫ్‌డీఐ

మొదటిపేజీ తరువాయి

సుగమం చేశారు. నిబంధనల్ని మరింత సరళతరం చేయటం ద్వారా ఇకపై భారత ప్రభుత్వ అనుమతి లేకుండానే నేరుగా విదేశీ సంస్థాగత కంపెనీలు, వ్యక్తులు పెట్టుబడులు పెట్టుకొనేందుకు మార్గం ఏర్పడింది. తద్వారా భారత ఆర్థిక వ్యవస్థ మల్టీ నేషనల్ కంపెనీల చేతుల్లోకి పోయిందని ఆర్థిక రంగ నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. 'ఎయిర్ ఇండియా'లో వాటాలు అమ్మొద్దని పార్లమెంట్ స్టాండింగ్ కమిటీ ఎంత మొత్తుకున్నా ఫలితం లేకుండా పోయింది. 49 శాతం వాటా విదేశీ విమానయాన సంస్థలకు అమ్ముతామని కేంద్రం ప్రకటించింది. ఎఫ్‌డీఐ ప్రస్తుత విధానం ప్రకారం, సింగిల్ బ్రాండ్ రిటైల్ వ్యాపారంలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులకు 49 శాతం మాత్రమే అనుమతి ఉంది. అంతకుమించి పెట్టుబడులు వస్తే, ప్రభుత్వ అనుమతి తప్పనిసరి. ఇప్పుడు దీనిని మరింత సరళీకృతం చేస్తూ, 'ఎస్‌బీఆర్‌టీ' (ఆటోమెటిక్ రూట్) పథకంలో...నేరుగా 100 శాతం వరకూ పెట్టుబడులకు అవకాశం కల్పించింది. ఆటోమెటిక్ రూట్‌లో పెట్టుబడులకు ఇకపై ప్రభుత్వ అనుమతి అవసరం లేదు. ఎఫ్‌డీఐలను ఇంకా ఎక్కువగా ఆకర్షించాలన్న లక్ష్యంతో పరిమితిని 100 శాతానికి పెంచినట్టు కేంద్రం తెలియజేసింది.

విదేశీ విమానయాన సంస్థల చేతుల్లోకి...'ఎయిర్ ఇండియా'

నష్టాల్లో ఉన్న సంస్థను బయటపడేయటం కోసమే...ఎయిర్ ఇండియాలో విదేశీ పెట్టుబడులకు ఆహ్వానం పలుకుతున్నామని కేంద్ర ప్రభుత్వం సమర్థించుకుంది. ప్రత్యక్షంగా, పరోక్షంగా...విదేశీ ఎయిర్‌లైన్స్ పెట్టుబడులు 49 శాతం దాటి ఉండకూడదన్న నిబంధన విధించారు. ప్రధాన యాజమాన్య హక్కులు, సమగ్ర నియంత్రణ ఎయిర్ ఇండియాకే ఉంటాయని కేంద్రం తెలిపింది. కాగా, ఎయిర్‌లైన్స్‌ను ప్రైవేటుపరం చేయడం లేదా పెట్టుబడులు ఉపసం హరించడంపై ప్రభుత్వం సమీక్ష జరపాలని, దేశానికి గర్వకారణమైన ఎయిర్ ఇండియా నుంచి పెట్టుబడులను ఉపసంహరించడానికి బదులు ప్రత్యామ్నా య మార్గాలు అన్వేషించాలని పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ మంగళవా రంనాడు నిశ్చితాభిప్రాయం వ్యక్తం చేసినా ఫలితం లేకుండా పోయింది.

ఇతర రంగాలు

'పవర్ ఎక్స్ఛేంజెస్'కు సంబంధించి సెకండరీ మార్కెట్లో మాత్రమే పెట్టుబడులకు విదేశీ సంస్థలు, వ్యక్తులకు ఇప్పటివరకూ అనుమతి ఉండేది. ఇప్పుడు ఈ నిబంధనను మార్చి ప్రైమరీ మార్కెట్లో కూడా పెట్టుబడులకు అనుమతి కల్పించారు. ఆడిట్ సంస్థలకు సంబంధించి, విదేశీ సంస్థలు లేదా వ్యక్తులు సూచించిన ఆడిటింగ్ నిపుణులు లేదా సంస్థలు రంగ ప్రవేశం చేయనున్నాయి. ఔషధరంగంలో ఎఫ్‌డీఐ పెట్టుబడుల కోసం, 'డ్రగ్స్, కాస్మెటిక్స్' చట్టాన్ని సైతం మార్చడానికి మోడీ సర్కార్ సిద్ధమైంది. ఎఫ్‌డీఐ పాలసీలో 'మెడికల్ డివైజెస్' (వైద్య పరికరాలు) అన్నపదానికి తగ్గట్టుగా చట్టంలో మార్పులు తీసుకురాబోతున్నామని కేంద్రం తెలిపింది.

మల్టీ నేషనల్ కంపెనీలకు రెడ్ కార్పెట్ పరవటమే...

ఎఫ్‌డీఐ పరమితి 100 శాతానికి పెంచటమేగాక, ఎస్‌బీఆర్‌టీ పథకం (దీనికి ప్రభుత్వ అనుమతి అవసరం లేదు) కింద పెట్టుబడులకు అవకాశం కల్పించటాన్ని 'కాన్ఫడరేషన్ ఆఫ్ ఆల్ ఇండియా ట్రేడర్స్' (సీఏఐటీ) తీవ్రంగా ఖండించింది. కేంద్ర మంత్రివర్గం తీసుకున్న ఈ నిర్ణయం మల్టీ నేషనల్ కంపెనీలకు రెడ్ కార్పెట్ పరవటమేనని విమర్శించింది. ఎన్నికల వాగ్దానాన్ని సైతం మరిచిపోయి బీజేపీ ప్రభుత్వం ఈ తీరుగా వ్యవహరించటాన్ని సీఏఐటీ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. భారత రిటైల్ రంగాన్ని విదేశీ కంపెనీలు నియంత్రించే అవకాశం ఏర్పడిందని, మల్టీనేషనల్ కంపెనీలు ఇకపై ఆధిపత్యం చలాయిస్తాయని సీఏఐటీ ఆందోళన వ్యక్తం చేసింది.

కేంద్ర నిర్ణయం తప్పు: సీపీఐ(ఎం)

న్యూఢిల్లీ : సింగిల్ బ్రాండ్ రిటైల్ ట్రేడింగ్, నిర్మాణ అభివృద్ధిల్లో 49శాతంగా ఉన్న విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను 100 శాతానికి కేంద్ర క్యాబినెట్ అనుమతిస్తూ తీసుకున్న నిర్ణయాన్ని సీపీఐ(ఎం) తీవ్రంగా తప్పుపట్టింది. చిల్లర వర్తకంలో ఎఫ్‌డీఐని సరళీకరించే ఈ చర్య దేశీయ రిటైల్ వర్తకులు, దుకాణదారులకు హానికరమని పేర్కొంది. మల్టీ బ్రాండ్ రిటైల్ వర్తకంలోనూ పూర్తి స్థాయిలో ఎఫ్‌డీఐలను అనుమతించే దిశగా మోడీ ప్రభుత్వం అడుగులు వేస్తున్నట్టు ఈ చర్య సూచిస్తున్నదని ఆరోపించింది. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు రిటైల్ రంగంలో ఎఫ్‌డీఐలను వ్యతిరేకించిన బీజేపీ ఇప్పుడు వాటిని అనుమతించడం దాని కపటత్వానికి నిదర్శనమని సీపీఐ(ఎం) పేర్కొంది. ఎయిర్ ఇండియాలో విదేశీ ఎయిర్‌లైన్స్ 49 శాతం వరకు పెట్టుబడి పెట్టడానికి అనుమతించాలన్న నిర్ణయాన్ని కూడా వ్యతిరేకించింది. రవాణా, పర్యాటక రంగం, సంస్కృతిపై పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ సిఫార్సులను ప్రభుత్వం పరిశీలించాలనీ, ఎయిర్ ఇండియా ప్రయివేటీకరణపై తన నిర్ణయాన్ని సమీక్షించాలని ప్రభుత్వం కోరింది.

సెన్సెక్స్ ▼10	నిఫ్టీ ▼05	డాలరుకు రూపాయి విలువ	బంగారం(10.గ్రా)	వెండి (కేజీ)
34,433	10,632	63.59	రూ. 30,171	రూ. 41,900





కోడిగుడ్లు


హైదరాబాద్	368	విజయవాడ	374
ఒక్కగుడ్డుకు	4.30	చెన్నై	397
వరంగల్	370	ముంబయి	410



సంస్కరణల వేగం పెరగాలి..

సులభ వ్యాపారాన్ని పెంచాలి

- విద్య, వైద్య రంగాల్లో మార్పులు అవసరం
- భారత్‌కు ప్రపంచ బ్యాంకు ఆదేశాలు
- 2018లో 7శాతం వృద్ధి
- జీడీపీ పెరుగుదలకు విస్తృతావకాశాలు : గ్లోబల్ ఎకనామిక్స్‌ప్రాస్పెక్ట్స్-2018లో వెల్లడి



వాషింగ్టన్: భారతదేశం సంస్కరణలను మరింత వేగవంతం చేయాలని ప్రపంచ బ్యాంకు మరోమారు పరోక్షంగా ఆదేశించింది. ఇప్పటికే తాహతుకు మించి విశాలమైన సంస్కరణలు చేపడుతుందని మరోవైపు ప్రశంసించింది. సులభ వ్యాపారానికి ఉన్న అడ్డంకులను తొలగించాలని, ప్రయివేటు పెట్టుబడులను ప్రోత్సహించాలని సూచించింది. విద్యా, వైద్య రంగాలను మరింత ప్రయివేటీకరించాలని పరోక్షంగా ఆ రంగ సంస్కరణలపై వ్యాఖ్యానించింది. దీంతో దేశ వృద్ధి రేటు పెరుగుదలకు విస్తృతావకాశాలు ఉన్నాయని పేర్కొంది. 2018లో భారత్ 7.3 శాతం వృద్ధిని నమోదు చేసే అవకాశాలున్నాయని అంచనా వేసింది. కాగా వచ్చే రెండేండ్లలో ఈ వృద్ధి రేటు 7.5 శాతానికి పెరుగొచ్చని బుధవారం ప్రపంచ బ్యాంకు విడుదల చేసిన '2018 గ్లోబల్ ఎకనామిక్స్ ప్రాస్పెక్ట్'లో వెల్లడించింది.

భారత్ ఇది వరకు చేపట్టిన నోట్ల రద్దు, వస్తు సేవల పన్ను (జీఎస్టీ) ప్రతికూల ప్రభావాల నుంచి బయటపడుతుందని తెలిపింది. దీంతో 2017లో 6.7 శాతం వృద్ధి నమోదవచ్చని అంచనా వేసింది. ఇతర వర్ధమాన దేశాలతో పోల్చితే వచ్చే దశాబ్ద కాలంలో భారత్ మెరుగైన వృద్ధి వైపు పయనిస్తుందని ప్రపంచ బ్యాంకు డెవలప్‌మెంట్ ప్రాస్పెక్ట్స్ గ్రూపు డైరెక్టర్ అయ్హన్ కోస్ అన్నారు. ఈ క్రమంలో తాను స్వల్పకాల అంకెలపై దృష్టి పెట్టడం లేదన్నారు. భారత్‌లో భారీ అవకాశాలు ఉన్నాయని పునరుద్ఘాటించారు. గత మూడేండ్ల నుంచి వృద్ధి రేటు ఆరోగ్యవంతంగా ఉందన్నారు. వృద్ధి రేటును సమ్మిళితం చేయడంలో ఒకే దేశం, ఒకే పన్ను లాంటి జీఎస్టీ కీలక సంస్కరణ మద్దతునియ్యనుందన్నారు. 2016 నవంబర్‌లో చేపట్టిన నోట్ల రద్దు తాత్కాలిక సంస్కరణలపై ప్రభుత్వం చాలా అవగాహన కలిగి ఉందని భావిస్తున్నానని అన్నారు.

ఆర్థిక పాలసీలు కొనసాగాలి..

ఇకపై కూడా వృద్ధి రేటును పెంపొందించడానికి, వ్యాపారంలో స్నేహపూర్వక వాతావరణాన్ని పెంపొందించడానికి ఆర్థిక పాలసీలను కొనసాగించాలని కోస్ పేర్కొన్నారు. అయితే కొన్ని తాత్కాలిక భంగపాట్లు ఉన్నాయని అన్నారు. స్థూలంగా అన్నిటిలో అన్నీ కూడా బాగా పని చేస్తున్నాయన్నారు. భారత్ ఆరోగ్యవంతమైన 7శాతం వృద్ధి రేటు సాధించడానికి విస్తృతావకాశాలు ఉన్నాయన్నారు. ఇంతకంటే మెరుగైన వృద్ధి సాధించడానికి వీలుందన్నారు.

మరో రిపోర్టులో 6.7శాతం వృద్ధి

2017-18లో భారత్ 6.7శాతం వృద్ధితో సరిపెట్టుకోవచ్చని ప్రపంచ బ్యాంకు దక్షిణ ఆసియా రీజినల్ ఒక పత్రికా ప్రకటనలో పేర్కొంది. ఇంతక్రితం ఆర్థిక సంవత్సరంలో ఈ వృద్ధి రేటు 7.1శాతంగా ఉన్న విషయం తెలిసిందే. ప్రయివేటు పెట్టుబడులు పడిపోవడంతో పాటు బ్యాంకింగ్ రంగంలో నెలకొన్న మొండి బాకీల బెడద, కార్పొరేట్ రుణాల భారం లాంటివి ప్రస్తుత ఆర్థిక సంవత్సర వృద్ధి రేటుపై ఒత్తిడి పెంచాయి. ఈ పరిణామాలకు తోడు వస్తు సేవల పన్ను అమలు వల్ల కంపెనీల బ్యాలెన్స్ షీట్లపై ప్రభావం పడింది.

అడ్డంకులను తొలగించాలి..

పెట్టుబడులకు మద్దతునిచ్చేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోస్ తెలిపారు. మొండి బాకీల నియంత్రణ, ఉత్పత్తిపై దృష్టి కేంద్రీకరించాలని సూచించారు. దేశంలో సెకండరీ విద్యా పూర్తి చేసిన వారి శాతం ఎక్కువగా ఉందని, వీరిని ఆర్థిక వ్యవస్థ పెరుగుదలకు ఉపయోగించుకోవాలన్నారు. కార్మిక మార్కెట్‌లో సంస్కరణలను మరింత పెంచాలన్నారు. అదే విధంగా విద్యా, వైద్య రంగంలో సంస్కరణలు చేపట్టాలని పేర్కొన్నారు. కాగా పెట్టుబడులకు ఉన్న అడ్డంకులు తొలగించాలని వివరించారు. భౌగోలికంగా ఇతర దేశాల కంటే భారత్‌కు ఎక్కువ అవకాశాలు ఉన్నాయన్నారు.

అదే విధంగా మహిళ కార్మికుల భాగస్వామ్యం పెంచాల్సిన అవసరం ఉందన్నారు. ఇతర వర్ధమాన దేశాలతో పోల్చితే భారత కార్మిక రంగంలో ఇప్పటికీ మహిళల పాత్ర తక్కువగా ఉందన్నారు. నిరుద్యోగ యువతను తగ్గించడం చాలా కష్టమన్నారు. అదే విధంగా ప్రయివేటు పెట్టుబడులను పెంచాలన్నారు. బ్యాంకుల ఆస్తుల నాణ్యత లాంటి సమస్యలు తెలిసినవేనన్నారు.

సర్కారు కోత...ప్రయివేటు మోత

టీఎస్‌జెన్‌కో విద్యుత్కేంద్రాల్లో ఉత్పత్తి నిలిపివేత

- బలవంతంగా బ్యాకింగ్‌డౌన్
- ప్రయివేటు కొనుగోళ్లకే తొలి ప్రాధాన్యత
- 24గంటల విద్యుత్ సరఫరా ఎఫెక్ట్



నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

ఇంటి అవసరాలు పెరిగితే సాధారణంగా ఏంచేస్తాం? మన దగ్గర ఉన్న ఆర్థికవనరులన్నింటినీ లెక్కించి, అవసరమనుకుంటే బయటినుంచి అప్పు చేస్తాం. అంతేకాని మన సొమ్మును లాకర్లో భద్రంగా ఉంచుకొని...వడ్డీవ్యాపారిని బతికించడం కోసం అప్పులు చేయం కదా! కానీ రాష్ట్రప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలు వడ్డీవ్యాపారుల్ని బతికించేందు కోసమే చేస్తున్నట్టు ఉంటున్నాయి. ప్రభుత్వరంగంలోని జెన్‌కో విద్యుత్ కేంద్రాల్లో ఉత్పత్తిని నిలిపేసి (బ్యాకింగ్‌డౌన్), అత్యవసరం...ముందస్తు ఒప్పందాల పేరుతో ప్రయివేటు విద్యుత్ కొనుగోళ్లను ప్రోత్సహిస్తున్నారు. ఫలితంగా అధికధరకు విద్యుత్‌ను కొనుగోలు చేయాల్సి వస్తోంది. ఈ భారం తిరిగి విద్యుత్ వినియోగదారులపైనే పడుతుంది. 24గంటల విద్యుత్ సరఫరా నిర్వహణ కోసం విద్యుత్ సంస్థలు ఈ తరహా నిర్ణయాల్ని తీసుకోవడం విమర్శలకు దారితీస్తోంది. ప్రయివేటు సంస్థలతో పోల్చితే జెన్‌కో విద్యుత్కేంద్రాల స్థిర ఛార్జీలు తక్కువగా ఉండటం వల్లే ఉత్పత్తిని తాత్కాలికంగా నిలిపివేసి, గ్రిడ్ నిర్వహణకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నామని జెన్‌కో యాజమాన్యం చెప్తోంది. అదే సందర్భంలో ప్రయివేటు విద్యుత్ కొనుగోళ్లు తప్పవనీ చెప్తోంది. దీర్ఘ, మధ్యకాలిక విద్యుత్ కొనుగోలు ఒప్పందాల వల్ల తప్పనిసరిగా ప్రయివేటు కొనుగోళ్లు చేయాల్సి వస్తోన్నదనీ చెప్తున్నారు. దానికి అదనంగా అత్యవసరం పేరుతో అప్పటికప్పుడు ప్రయివేటు సంస్థల నుంచి అధికధరకు కొనుగోళ్లు చేస్తున్నారు.

కొత్తగూడెం(ఏ)లోని యూనిట్ 2 వ్యవస్థాపక సామర్థ్యం 60 మెగావాట్లు కాగా ఈ ఏడాది డిసెంబర్ వరకు ప్లాంట్‌లోడ్ ఫ్యాక్టర్ (పీఎల్‌ఎఫ్) 71.1 శాతంగా ఉంది. గత ఏడాది ఇదే ప్లాంట్ పీఎల్‌ఎఫ్ 73.6శాతంగా ఉంది. అలాగే ఇక్కడి యూనిట్-4 (60 మెగావాట్లు) పిఎల్‌ఎఫ్ 2016-17లో 75.5 శాతం కాగా, ఈ ఏడాది 71.6 శాతంగా నమోదైంది. ఇక్కడి యూనిట్-3 (60 మెగావాట్లు) ని వార్షిక నిర్వహణ పేరుతో 2017 జూన్ నుంచి ఉత్పత్తి పూర్తిగా నిలిపివేశారు. కొత్తగూడెం(ఏ)లోని నాలుగుయూనిట్ల విద్యుదుత్పత్తి వ్యవస్థాపక సామర్థ్యం 240 మెగావాట్లు కాగా, ఈ ఏడాది డిసెంబర్ నాటికి ఈ ప్లాంట్ల పీఎల్‌ఎఫ్ కేవలం 57.3 శాతంగా నమోదైంది. 2016-17లో ఇదే కాలానికి పీఎల్‌ఎఫ్ 69.9 శాతంగా ఉంది.

ఇక కొత్తగూడెం (బీ)లోని యూనిట్-6 (120 మెగావాట్లు) పీఎల్‌ఎఫ్ 58.8 శాతంగా ఉంది. 2017 ఏప్రిల్ నుంచి డిసెంబర్ వరకు (9 నెలల కాలంలో) ఈ యూనిట్ నుంచి ఉత్పత్తి అయిన మొత్తం విద్యుత్ కేవలం 465.9 మిలియన్ యూనిట్లు మాత్రమే.

కొత్తగూడెం-5 థర్మల్ విద్యుత్కేంద్రంలోని యూనిట్-9 (250 మెగావాట్లు) పిఎల్‌ఎఫ్ 2017 ఏప్రిల్ నుంచి డిసెంబర్ వరకు (9నెలలు) 70.7శాతం మాత్రమే. 2016-17లో పై కాలానికి ఇదే యూనిట్ పీఎల్‌ఎఫ్ 81.7 శాతంగా ఉంది. 2015-16లోనూ ఇదే తరహాలో జెన్‌కో యూనిట్లను బ్యాకింగ్‌డౌన్ చేశారు. అప్పట్లోనూ ప్రయివేటు విద్యుత్ కొనుగోళ్ల కోసం ఆయా యూనిట్లలో తాత్కాలికంగా విద్యుదుత్పత్తిని నిలిపివేశారు. తాజాగా 24 గంటల విద్యుత్ సరఫరా కోసం మళ్లీ జెన్‌కో యూనిట్లను బ్యాకింగ్‌డౌన్ చేస్తున్నారు. ప్రజలకు కరెంటు ఇస్తున్నామా...లేదా...ఎలా ఇస్తే ఏంటి? అనే ధోరణిలో ప్రయివేటు విద్యుత్ కొనుగోళ్లు జరుగుతున్నాయని విద్యుత్‌రంగ నిపుణులు ఆక్షేపిస్తున్నారు.


ఈనెల 9వ తేదీ టీఎస్‌జెన్‌కో విద్యుత్ కేంద్రాల నుంచి కేవలం 81.93 మిలియన్ యూనిట్లు మాత్రమే ఉత్పత్తి అయ్యింది. సోలార్ ద్వారా 12.11 మి.యూ., వచ్చింది. అదే రోజు రాష్ట్రంలో విద్యుత్ డిమాండ్ 181.59 మి.యూ.,గా ఉంది. మొత్తంగా రాష్ట్రం నుంచి ఉత్పత్తి అయిన విద్యుత్ 94.04 మి.యూ., మాత్రమే. డిమాండ్‌ను చేరడం కోసం షార్ట్‌టర్మ్ ఓపెన్‌యాక్సెస్ ద్వారా 80.29 మి.యూ., కొనుగోలు చేశారు. మిగిలిన విద్యుత్ కేంద్ర సంస్థల వాటాగా వచ్చింది.


చిన్నచిన్న కారణాలకే

జీవితాన్ని ముగించుకుంటున్న భావితరం

- దేశంలో ప్రతీ గంటకు బలవన్మరణం పాలవుతున్న ఒక విద్యార్థి
- యూత్ సూసైడ్‌లలో ఇండియానే టాప్!
- దేశంలో మానసికనిపుణుల కొరత 87 శాతం పైనే!
- మారుతున్న విద్యావిధానం, జీవనశైలి, పిల్లల ఆలోచనాధోరణి..
- కుటుంబసభ్యులతో సాంగత్యం లేకపోవడం కూడా కారణమే! : ఇండియా స్పెండ్

లవ్ ఫెయిల్యూర్, నిరుద్యోగం, ఆర్థిక సమస్యలు, అనారోగ్యం. ఇప్పటివరకు ఇవే ఆత్మహత్యలకు ప్రధాన కారణాలుగా ఉండేవి. కానీ, మారుతున్న జీవనశైలి, సమాజ పోకడల మూలంగా.. జీవితమంటే ఏంటో కూడా తెలియని లేలేత వయస్సులోనే ఆత్మహత్య అనే పెద్ద నిర్ణయానికి వచ్చి నిండు జీవితాన్ని బలిచేసుకుంటున్న విద్యార్థుల ఆత్మహత్యలు రోజురోజుకూ పెరుగుతూ.. కన్నవారికి తీరని శోకాన్ని మిగిలిస్తున్నాయి.



కడవేర్గు

గంటకు ఒక విద్యార్థి ప్రాణత్యాగం

ఒత్తిడి పేరుతో ఒకరు, తోటి విద్యార్థుల చేష్టలతో తల్లడిల్లి మరొకరు, టీచర్ల వేధింపులను భరించక ఇంకొకరు, కన్నవాళ్ళు కసిరారని మరొకరు.. ఇలా సోమవారం ఒక్కరోజునే 'ఆత్మహత్యే అంతిమ మార్గమ'ని భావించి తనువు చాలించిన ముగ్గురు విద్యార్థుల మరణాలు, ఒకరి ఆత్మహత్యా యత్నం యావత్ తెలంగాణ ప్రజానీకాన్ని నిశ్చేష్టులను చేసింది. ఈ సమస్య ఒక్క తెలంగాణ రాష్ట్రంలోనే కాకుండా సమస్త విద్యార్థి భారతాన్ని కుంగదీస్తున్నది. 2016 కేంద్ర హోంశాఖ గణాంకాల ప్రకారం.. వివిధ కారణాలతో దేశవ్యాప్తంగా 9,474 మంది విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడగా.. అత్యధిక మరణాలతో మహారాష్ట్ర, పశ్చిమబెంగాల్ రాష్ట్రాలు అగ్రస్థానంలో ఉన్నట్టు వెల్లడైంది. ఇక, విద్యార్థుల మరణాల నిష్పత్తిని చూసినట్లైతే.. ప్రతీ గంటకు ఒక విద్యార్థి (24 గంటలకు 26 మంది చొప్పున) సదరు ఏడాది ఆత్మహత్యకు పాల్పడ్డారన్న కఠోరవాస్తవాలు గణాంకాల్లో వెలుగు చూడటంతో నేటి విద్యార్థి మానసిక సంఘర్షణ ఏ స్థాయిలో ఉన్నదో అర్థం చేసుకోవచ్చు.

దేశంలో 87 శాతం మంది సైకాలజిస్టుల కొరత

ప్రస్తుతం దేశంలో జరుగుతున్న విద్యార్థుల ఆత్మహత్యలకు చదువుల ఒత్తిడి ఒక కారణం కాగా, మిగతా వారితో పోలిస్తే ఓడిపోతున్నామనే ఆత్మన్యూనతా భావం చిన్నారుల్లో క్రమంగా పెరుగుతోంది. ఉరుకులూ పరుగుల జీవితంలో పిల్లలతో కుటుంబసభ్యులు గడిపే సమయం క్రమంగా తగ్గిపోతుండటం.. తత్ఫలితంగా, తల్లిదండ్రులకు పిల్లల మానసిక పరిస్థితి, అలవాట్ల పట్ల అవగాహన కొరవడటం, మారుతున్న జీవనశైలి మూలంగా పిల్లలు కష్టమన్నది తెలియకుండా చాలా సున్నిత మనుస్కులుగా మారి చిన్నపాటి ఒత్తిడిని సైతం తట్టుకోలేక తల్లడిల్లే పరిస్థితికి చేరుకోవడం వంటి పరిస్థితుల వల్ల.. పరిష్కరించగలిగిన చిన్నపాటి కారణాలకే విద్యార్థులు మరణాన్నే శరణ్యంగా భావిస్తున్నారని మానసిక నిపుణులు చెబుతున్నారు. 15 - 29 వయస్సు గల యవ్వన వయస్కుల ఆత్మహత్యల్లో అగ్ర స్థానంలో ఉన్న మన దేశంలో మానసిక వైద్యుల కొరత తీవ్రంగా వేధిస్తోంది. ప్రస్తుతం భారతదేశంలో విద్యార్థుల మానసిక రుగ్మతల నివారణకు 87 శాతం మంది సైకాలజిస్టుల కొరత తీవ్ర సమస్యగా మారిందిన ఇండియా స్పెండ్ ప్రతినిధి సల్దానా ఇదివరకే హెచ్చరించిన విషయం తెలిసిందే! ఐనప్పటికీ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పరిష్కార మార్గాలను అన్వేషించడం లేదు.ఇప్పటికైనా, ప్రభుత్వాలు, తల్లిదండ్రులు, స్కూల్, కాలేజీ యాజమాన్యాలు తమ వైఖరిని మార్చుకొని జీవిత పరమార్థాన్ని భావిభారత పౌరులైన విద్యార్థులకు తెలియజేస్తూ.. వారి దుందుడుకు నిర్ణయాల్లో మార్పు తీసుకురావడం ఇప్పుడు ఎంతైనా అవసరం.

సంవత్సరం	ఆత్మహత్య చేసుకున్న విద్యార్థులు
2016	9,474
2015	8,943
2014	8,068
2013	8,423
2012	6,654
2011	7,696

ఆధారం: జాతీయ నేర గణాంకాల విభాగం

బజాజ్ నుంచి రెండు కొత్త బైక్‌లు..



న్యూఢిల్లీ: ప్రముఖ ద్విచక్ర వాహన తయారీ కంపెనీ బజాజ్ ఆటో తాజాగా డిస్కవర్ వెర్షన్‌లో రెండు కొత్త మోడళ్లను బుధవారం ఆవిష్కరించింది. వీటిని డిస్కవరి 110, డిస్కవర్ 125 పేరిట మార్కెట్లోకి విడుదల చేసింది. ఎక్స్ షోరూం మహారాష్ట్ర వద్ద వీటి ధరలను రూ.50,496 నుంచి రూ.56,314గా నిర్ణయించింది. డిస్కవర్ 110 వేరియంట్‌లో 115.5 సీసీ, డిస్కవర్ 125లో రెండు వేరియంట్స్‌ను 124.5 సీసీ ఇంజిన్‌తో అందుబాటులోకి తెచ్చినట్టు కంపెనీ ఒక ప్రకటనలో పేర్కొంది. ఈ మోడల్స్‌లో కొత్తగా ఎల్‌ఈడీ డే ట్రైమ్ రన్నింగ్ హెడ్‌ల్యాంప్స్‌తో పాటు డిజిటల్ ఇన్‌స్ట్రుమెంట్ డిస్‌ప్లే ప్యానెల్‌ను అమర్చినట్టు వెల్లడించింది.

మార్కెట్లోకి హ్యుందాయ్ 'నెక్స్ జెన్ వెర్నా'

న్యూఢిల్లీ: హ్యుందాయ్ మోటార్ ఇండియా లిమిటెడ్ (హెచ్‌ఎంఐఎల్) మిడ్‌సైజు ప్రీమియమ్ సెడాన్ వెర్నాలో రెండు కొత్త వేరియంట్స్‌ను బుధవారం మార్కెట్లోకి ఆవిష్కరించింది. 1.4 లీటర్ పెట్రోల్ ఇంజిన్‌తో వీటిని తీసుకొచ్చింది. వీటి ధరలు రూ.7,79,000 నుంచి రూ.9,09,000 లక్షలు (ఎక్స్ షోరూం ఢిల్లీ)గా కంపెనీ నిర్ణయించింది. వెర్నా నెక్స్ జెన్‌లో 1.4 లీటరు కప్పా డ్యూయల్ వీటీవీటీ పెట్రోల్ ఇంజిన్ ఉంది. ఈ కొత్త వేరియంట్లు 100పీఎస్ పవర్ అవుట్‌పుట్, 19.1 కేఎంపీఎల్ ఇంధన సామర్థ్యంతో లభిస్తుందని కంపెనీ తెలిపింది. అలాగే సిక్స్ స్పీడ్ మాన్యువల్ ట్రాన్స్‌మిషన్‌ను ఈ మోడల్స్‌లో ఆఫర్ చేయనున్నాయి.

జెబ్రోనిక్స్ నుంచి మల్టీ ఫంక్షనల్ ప్రొడక్ట్ 'ఎస్టీమ్'

నవతెలంగాణ, బిజినెస్ డెస్క్: ప్రముఖ ఐటీ పెరిఫరల్స్ వినియోగదారుల ఎలక్ట్రానిక్స్, సర్వైవలెన్స్ ప్రొడక్టుల సరఫరాదారుడు జెబ్రోనిక్స్ మల్టీ-ఫంక్షన్ ఆల్ ఇన్ వన్ ప్రొడక్ట్ 'ఎస్టీమ్'ను మార్కెట్లోకి విడుదల చేసింది. టార్చ్ లైటులా డిజైన్ చేయబడిన ఈ పరికరంలో వైర్‌లెస్ ఆడియో, స్పీకర్, ఎల్‌ఈడీ టార్చ్, ఎఫ్‌ఎం రెడియో, మైక్రో ఎస్‌డీ కార్డు, పవర్ బ్యాంకు కలిగిన ఈ మల్టీ ఫంక్షనల్ ప్రొడక్ట్‌ను జెబ్రోనిక్స్ అందుబాటులోకి తీసుకొచ్చింది. అదేవిధంగా దీనిలో ఉండే 2000 ఎంఏహెచ్ సామర్థ్యం కలిగిన పవర్ బ్యాంక్‌తో తమ స్మార్ట్‌ఫోన్‌ను ఛార్జింగ్ చేసుకునే వీలు కల్పించింది. మరోవైపు మ్యూజిక్, కాల్స్ రిసీవ్ చేసుకో వడంతో పాటు వాల్యూమ్ కంట్రోల్‌ను ఆపరేట్ చేయవచ్చునని పేర్కొంది.

చమురుకు 'నోట్ల' మంట

న్యూఢిల్లీ: దేశంలో చమురు వినియోగం పడిపోయిందని ఒక నివేదికలో వెల్లడయ్యింది. నోట్ల రద్దుకు తోడు జీఎస్టీ అమలు నేపథ్యంలో దేశ ఆర్థిక వ్యవస్థ బలహీనపడటంతో చమురు వినియోగంలో స్తబ్ధతత చోటు చేసుకుందని చమురు మంత్రిత్వశాఖకు చెందిన పెట్రోలియం ప్లానింగ్ అండ్ అనలిస్టు సెల్ ఒక నివేదికలో వెల్లడించింది. 2017లో చమురు ఉత్పత్తుల వినియోగం కేవలం 2 శాతం పెరిగి 200 మిలియన్ టన్నులకు పరిమితమయ్యింది. 2013 తర్వాత ఇంత తక్కువగా పడిపోవడం ఇదే తొలిసారి. ఆ ఏడాది చమరు డిమాండ్ 1.7 శాతానికి క్షీణించింది. 2016 నవంబర్‌లో కేంద్రం చేపట్టిన నోట్ల రద్దు ప్రక్రియ గతేడాది ప్రథమార్థంలో చమురు డిమాండ్‌ను భారీగా దెబ్బతీసిందని ఆయిల్ ప్రొడక్ట్ అనలిస్టు నెవిన్ నాహ్ పేర్కొన్నారు. ద్వితీయార్థంలో జీఎస్టీ తీవ్ర ప్రభావం చూపిందన్నారు.

ఐటీ రంగంలో తెలంగాణ స్టేట్ టెక్నాలజీ సర్వీసెస్ కీలక పాత్ర

- క్యాలెండర్ ఆవిష్కరణలో మంత్రి కేటీఆర్

హైదరాబాద్ : ఐటీ రంగంలో తెలంగాణ స్టేట్ టెక్నాలజీ సర్వీసెస్ (టీఎస్‌టీఎస్‌ఎల్) కీలక పాత్ర పోషిస్తోందని తెలంగాణ ఐటీ శాఖ మంత్రి కె.తారకరామారావు అన్నారు. టీఎస్‌టీఎస్‌ఎల్ క్యాలెండర్ ఆవిష్కరించిన అనంతరం ఆయన మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రాభివృద్ధికి సంబంధించి ఐటీ రంగంలో టీఎస్‌టీఎస్‌ఎల్ కీలక పాత్ర పోషిస్తోందని, భవిష్యత్‌లోనూ నాణ్యమైన సేవలందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీఎస్‌టీఎస్‌ఎల్ చైర్మెన్ డాక్టర్ రాకేష్‌కుమార్, ఎండీ జీటీ వెంకటేశ్వరరావు, జనరల్ మేనేజర్లు, అధికారులు, ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్టు లెక్చరర్ల జీతాల బడ్జెట్ విడుదల

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో పనిచేస్తున్న 3,687 కాంట్రాక్టు అధ్యాపకులు, పలువురు గెస్ట్ అధ్యాపకుల అక్టోబర్, నవంబర్ జీతాల బడ్జెట్ రూ.34 కోట్లు తెలంగాణ ప్రభుత్వం విడుదల చేసింది. ఇంటర్ విద్యా కమిషనర్ ఎ అశోక్ జీతాల బడ్జెట్‌కు సంబంధించిన ప్రొసీడింగ్స్ బుధవారం విడుదల చేశారు. అక్టోబర్, నవంబర్, డిసెంబర్ మూడు నెలల జీతాలు కాంట్రాక్టు అధ్యాపకులకు అందలేదని తెలంగాణ ప్రభుత్వ కాలేజీ కాంట్రాక్టు అధ్యాపకుల సంఘం విజ్ఞప్తి మేరకు బుధవారం ప్రొసీడింగ్స్ విడుదలయ్యాయి. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు జి రమణారెడ్డి, ప్రధాన కార్యదర్శి కొప్పిశెట్టి సురేష్ ఓ ప్రకటనలో హర్షం ప్రకటించారు. ప్రతినెలా జీతాలిచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరారు. 12 నెలలపాటు కాంట్రాక్టు అధ్యాపకులకు జీతాలివ్వాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. రెండు నెలల జీతాలు విడుదల చేసినందుకు రాష్ట్ర ప్రభుత్వానికి, ఇంటర్ విద్యాకమిషనర్‌కు ఆర్జేడీ కాంట్రాక్టు అధ్యాపకుల సంఘం అధ్యక్షుడు గాదె వెంకన్న, ప్రధాన కార్యదర్శి కుమారస్వామి ఓ ప్రకటనలో కృతజ్ఞతలు తెలిపారు.

చైనాలో మంచు పండుగ

హార్బిన్ : చైనాలో హార్బిన్‌కు మంచు నగరం (ఐస్ సిటీ) అన్న పేరు ఉంది. ఐస్ సిటీలోకి ప్రవేశించగానే పర్యాటకులు ఒక ఊహాజగత్తులోకి ప్రవేశించిన అనుభూతిని పొందుతారు. మంచుతో రూపొందించిన వివిధ రకాల శిల్పాలను, కళాకృతలను, కట్టడాలను చూడటానికి రెండు కండ్లు చాలవంటే అతిశయోక్తి కాదు. మంచుతో రూపొందించిన ఎత్తయిన కట్టడాలు, వాటిపై ఆకృతులు సంభ్రమాశ్చర్యానికి గురిచేస్తాయి. ప్రతీఏటా చలికాలంలో ఇక్కడ 'ఇంటర్నేషనల్ ఐస్ అండ్ స్నో ఫెస్టివల్' నిర్వహిస్తారు. ఈ ఏడాది వేడుక ఫిబ్రవరి 28 వరకూ కొనసాగుతుంది. ఈసారి వేడుకలను ఆస్వాదించడానికి ప్రపంచం నలుమూలల నుండి పెద్ద సంఖ్యలో పర్యాటకలు హార్బిన్‌కు వస్తున్నారు.

'మూఢ నమ్మకాలను విడనాడాలి'

టీఎస్‌ఎఫ్ క్యాలెండర్ ఆవిష్కరణ

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

గిరిజనులు మూఢ నమ్మకాలను విడనాడాలని గిరిజన సంక్షేమ శాఖ కమిషనర్ క్రిస్టీనా తెలిపారు. మారుతున్న కాలనుగుణంగా గిరిజనుల్లో చైతన్యం తీసుకురావల్సిన అవసరం ఉందన్నారు. బుధవారం గిరిజన సంక్షేమ కార్యాలయంలో ట్రైబల్ స్టూడెంట్ ఫెడరేషన్ (టీఎస్‌ఎఫ్) రూపొందించిన గిరిజన సంస్కృతి క్యాలెండర్‌ను ఆమె ఆవిష్కరించారు. అనంతరం క్రిస్టీనా మాట్లాడుతూ గిరిజన భాషా, సంస్కృతిని కాపాడుకోవాలన్నారు. గుడుంబా రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దడం కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను గిరిజనులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. గిరిజన సంస్కృతిపై క్యాలెండర్‌ను రూపొందించడం హర్షణీయమన్నారు. టీఎస్‌ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శోభన్ నాయక్ మాట్లాడుతూ ప్రభుత్వం తీసుకున్న కొన్ని నిర్ణయాల వల్ల గిరిజన తెగల మధ్య అపోహలు, అనర్థాలకు దారి తీశాయని ఆందోళన వ్యక్తం చేశారు. వీటికి టీఆర్‌ఎస్ ప్రజా ప్రజానిధులు మరింత ఆజ్యం పోశారని విమర్శించారు. ఆదివాసీ, గిరిజనుల మధ్య నెలకొన్న సమస్యలను పరిష్కరించడానికి ఆదివాసీ, గిరిజన మేధావులతో ప్రభుత్వం ప్రత్యక్షంగా చర్చలు నిర్వహించాలని డిమాండ్ చేశారు.



ఖర్చు తక్కువ.. ఆదాయం ఎక్కువ

యాపిల్ బేర్.. థాయ్‌లాండ్‌లో పుట్టింది. అక్కడి నుంచి మహారాష్ట్రకు చేరుకుని మన రాష్ట్రంలో ప్రవేశించింది. తక్కువ నీటి వనరులతో ఎక్కువ దిగుబడినిచ్చే పంట ఇది. వర్షాభావ పరిస్థితులను తట్టుకుంటుంది. భూగర్భ జలాలు అడుగంటిపోయినా పంటకు ఢోకా ఉండదు. ఇందులో పోషకాలు పుష్కలం. యాపిల్ కన్నా ఎక్కువ. దీన్ని 'తెలంగాణ యాపిల్' అని కూడా అంటారు. దీనికి మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉంది. మన రాష్ట్రంలోని అన్ని జిల్లాలకు అనువైన పంట ఇది. ఒక్కసారి పంట వేస్తే వందేండ్ల వరకు ఉంటుంది. కొమ్మలు కత్తిరించే కొద్దీ ఈ చెట్టు ఎదుగుతుంది.

యాపిల్ బేర్ పంటకు ఎక్కువ పెట్టుబడి అవసరం లేదు. స్వల్ప ఖర్చుతో అధిక దిగుబడినిచ్చే పంట ఇది. అంతే కాదు.. దీనికి ఎక్కువ శ్రమ కూడా అక్కర్లేదు. ఈ పంటకు రోగని రోధక శక్తి ఎక్కువ. పంట కాలం తక్కువే. అంటు నాటిన ఆరు నెలల్లో కాయ కోతకొస్తుంది. సంవత్సరంలో రెండుసార్లు కాస్తుంది. మొదటి సంవత్సరంలో ప్రతి చెట్టుకు 25 నుంచి 30 కిలోల దిగుబడి వస్తుంది. రెండో సంవత్సరం 40 నుండి 45 కిలోలు కాస్తుంది. రేగు చెట్టుకు న్నట్టు ముండ్లు కూడా ఉండవు. పంట యాజమాన్యం చాలా సుల భం. కాయల పరిమాణం పెద్దదిగా ఉంటుంది. ఈ పంటను మెట్ట ప్రాంతంలోనూ సాగు చేయొచ్చు. సహజంగానే పరాగ సంపర్కం చెందుతుంది. ప్రత్యేకంగా ఆడ మొక్కలు, మగ మొక్కలను తోటలో సాగు చేయాల్సిన పని లేదు. స్వతహాగానే రేగు నీటి ఎద్దడిని తట్టుకుంటుంది. చీడపీడల సమస్య ఉండదు. తోటలో తెంపిన కాయలను కూడా ఎక్కువ రోజులు నిల్వ చేయొచ్చు. ఎకరానికి 200 చెట్లు సాగు చేయొచ్చు. మేలైన యాజమాన్య పద్ధతులు పాటిస్తే వందేండ్ల వరకు మంచి దిగుబడులు వస్తాయి. ఎరువులు, ఇతర సాగు విషయాలు రేగు తోటల మాదిరిగానే పాటించొచ్చు.



మొక్కల లభ్యత

ప్రస్తుతం యాపిల్‌బేర్ మొక్కలను ప్రైవేటు నర్సరీల నుంచే కొనుగోలు చేయాల్సి వస్తోంది. ప్రభుత్వ సంస్థలు, విశ్వవిద్యాల యాల నుంచి లభ్యత లేదు. రోగాలు లేని మంచి వృద్ధి, పెరుగుదల ఉన్న మొక్కలను ఎంపిక చేసుకోవాలి. అంటు మొత్తం భూమిలో ఉండేలా నాటుకోవాలి.

సాగు ఖర్చులు : ఒక్క మొక్క ఖరీదు రూ. 60. ఎకరానికి 200 మొక్కలు అవసరం. మొత్తం రూ.12వేలు మొక్కలకు ఖర్చు అవుతాయి. ఎరువులు, కలుపు నివా రణ మందులు తదితర ఖర్చులకు సుమారు రూ.25వేలు అవుతాయి. ఎకరానికి నాలుగు టన్నుల దిగుబడి వస్తుంది. ప్రసుతం యాపిల్‌బేర్ మార్కెట్ ధర కిలో రూ.40. రాబడి రూ. లక్షా 60వేలు. పెట్టుబడి ఖర్చులు పోనూ ఎకరానికి రూ. లక్ష ఆదాయం వస్తుంది.

సాగు ఇలా...

మొక్కల మధ్య 15x15 అడుగుల దూరం ఉండేట్టు నాటుకోవాలి. వేసవిలో గుంతలు తయారు చేసుకోవాలి. వీటి పరిమాణం 1x1 అడుగులు ఉండేట్టు చూడాలి. రసాయన, సేంద్రియ ఎరువులతో ఈ మొక్కల గుంతలు నింపాలి. మొక్కలు నాటిన మొదటి మూడు నెలల తర్వాత 50గ్రాముల ఫాస్పేట్, 50 గ్రాముల పొటాష్, 150గ్రాముల నత్రజని అందించాలి. మూడు నెలల తర్వాత అదే మోతాదు ఎరువులో మరో దఫా అందించాలి. మరో మూడు నెలల తర్వాత ఎకరానికి రెండు కిలోల సూక్ష్మధాతు పోషకాలు, అందిస్తే కాయల రంగు, నాణ్యత మెరుగుపడుతుంది. డ్రిప్ సౌకర్యం కల్పిస్తే దిగుబడులు ఇంకా బాగా పెరుగుతాయి. 15 రోజులకోసారి కలుపు నివారణ చర్యలు చేపట్టాలి.

చీడపీడలు

ఈ పంటను ప్రధానంగా పండుఈగ, దాసరి పురుగులు ఆశిస్తాయి. వీటి నివారణకు ముందుగా తోటలను పరిశుభ్రంగా ఉంచాలి. ఈగ ఆశిస్తే లీటరు నీటికి ఒక మి.లీటరు మలాథియాన్ లేదా 3 గ్రాముల కార్బరిల్ లేదా 5 శాతం వేప గింజల కషాయాన్ని మొదటి దశగా పిచికారీ చేయాలి. గోలికాయ దశలో రెండో విడత 15 రోజుల తర్వాత కాయ పక్వానికి వచ్చాక మూడో దఫా పిచికారీ చేయాలి. గొంగళిపురుగులు పత్రహరితాన్ని గోకి తింటాయి. వీటి నివారణకు లీటరు నీటిలో 2 మి.లీటర్ల క్వినాల్‌ఫాస్ కలిపి పిచికారీ చేయాలి. సాగులో ప్రధానమైంది కొమ్మల కత్తిరింపు. వేరు మూలంపై వచ్చే బిగుళ్లను ఎప్పటికప్పుడు కత్తిరించాలి. ఒక మీటరు పెరిగిన తర్వాత నాలుగైదు కొమ్మలు నాలుగు వైపులా పెరిగేటట్లు చూడాలి. మార్చి, ఏప్రిల్ నెలల్లో కత్తిరించాలి. దీనికి ముందు లీటరు నీటిలో 10గ్రాముల పొటాషియం నైట్రేట్ కలిపి పిచికారీ చేస్తే అంట్లు త్వరగా చిగురిస్తాయి. రెండో సంవత్సరం నుంచి రెట్టింపు ఎరువులు వాడాలి. దోర రంగులో ఉన్నప్పుడే కాయలు కోయాలి. 8 నుంచి 10 రోజుల్లో పూర్తిగా పండు రంగులో వస్తాయి. రవాణాకు అనుకూలంగా ఉంటాయి. పూత తర్వాత రెండు నెలల్లో మళ్లీ కాపుకొస్తుంది.

రాయితీ

యాపిల్‌బేర్ పంట సాగు చేసే రైతులను రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్స హిస్తోంది. ప్రస్తుతం 50 ఎకరాల్లో ఉన్న ఈ సాగు విస్తీర్ణాన్ని వెయ్యి ఎకరాలకు పెంచాలని నిర్ణయించింది. కలత్తా నుంచి 3వేల యాపిల్ బేర్ అంట్లను ఉద్యాన శాఖ అధికారులు తెప్పిస్తున్నారు. ఎకరానికి రూ.20వేల పెట్టుబడి అవుతుందని అంచనా. దీనికి రాష్ట్ర ప్రభుత్వం తొలుత 35శాతం (రూ.7వేలు) సబ్సిడీ ఇస్తుంది. రెండు, మూడో సంవత్సరం 20 శాతం సబ్సిడీ ఇవ్వాలని సూత్రప్రాయంగా నిర్ణయించారు. మహబూబ్‌నగర్, నల్లగొండ, మెదక్, ఆదిలాబాద్ జిల్లాలో అపారంగా ఉన్న మెట్ట, వర్షాధార ప్రాంతాల్లో యాపిల్ బేర్ సాగు చేసుకోవచ్చు. బిందు, తుంపర సేద్య పద్ధతులు పాటిస్తే దిగుబడులు ఇంకా పెరిగే అవకాశం ఉంది.



- ఎల్. వెంకట్రామ్‌రెడ్డి,
ఉద్యాన శాఖ కమిషనర్

రైతుల అమాయకత్వాన్ని ఆసరా చేసుకుని డీలర్లు కొందరు నాసిరకం విత్తనాలు అంటగడుతుంటారు. రైతులను నట్టేట్ట ముంచేందుకు అడ్డదారులు తొక్కుతుంటారు. లైసెన్సు లేకున్నా అక్రమ వ్యాపారం చేస్తుంటారు. ఇలాంటి వారి ఆగడాలకు కళ్లెం చేసేందుకు చట్టాలున్నాయి. లైసెన్సు లేకుండా విత్తన వ్యాపారం నిర్వహించడం నేరం. ఇలాంటి విక్రయదారులెవరైనా ఉంటే రైతులు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయొచ్చు. తద్వారా అలాంటి డీలరుపై చట్టపరమైన చర్యలు తీసుకుంటారు. విత్తన నియంత్రణ ఉత్తర్వులు -1983 క్లాజు 3, పత్తి విత్తన చట్టం 5(1)(ఏ), పత్తి విత్తన నిబంధనలు-2007 క్లాజు 7ను అతిక్రమిస్తే ఆ విత్తనాలను జప్తు చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటారు. విత్తన నియంత్రణ ఉత్తర్వులు ప్రకారం అత్యవసర సరుకుల చట్టం-1955 సెక్షన్ 7, విత్తన చట్టం-2007 సెక్షన్ 12 ప్రకారం జరిమానా విధిస్తారు.

లైసెన్సు ప్రదర్శన తప్పనిసరి : విత్తన లైసెన్సును డీలరు తన షాపులో ప్రదర్శించడం తప్పనిసరి. ఈ

చట్టం ఏం చెబుతోంది..?

నిబంధనలను ఉల్లంఘించిన డీలరుపై ఫిర్యాదు చేస్తే తొలుత నోటీసులు జారీ అవుతాయి. తన పొరబాటును డీలరు సరిదిద్దుకోకపోతే విత్తన నియంత్రణ ఉత్తర్వులు-1993 క్లాజు 15 ప్రకారం అతడి లైసెన్సును రద్దు లేదా సస్పెండ్ చేస్తారు.

ధరల పట్టిక ఏర్పాటు చేయాలి : విత్తన డీలరు స్టాకుబోర్డు లేదా ధరల సూచిక బోర్డును విధిగా ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. ఈ నిబంధనలను ఉల్లంఘిస్తే విత్తన అమ్మకాన్ని నిలుపుదల చేసి నోటీసులు జారీ చేస్తారు. తన పొరబాటును సరిదిద్దుకోకపోతే విత్తన నియంత్రణ ఉత్తర్వులు-1983 క్లాజు 15 ప్రకారం ఆ డీలరు లైసెన్సును రద్దు, లేదా సస్పెండ్ చేస్తారు.



రశీదు : విత్తన డీలరు కొనుగోలుదారుకు అమ్మకపు రశీదును విధిగా ఇవ్వాల్సి ఉంటుంది. రైతులు కూడా తప్పనిసరిగా అడిగి తీసుకోవాలి. దీన్ని పాటించని డీలరుకు విత్తన నియంత్రణ ఉత్తర్వులు-1993 క్లాజు 9, విత్తన నిబంధనలు-2007 క్లాజు 21 ప్రకారం నోటీసులు జారీ చేస్తారు. తన లోటును సవరించుకోకపోతే అతడి లైసెన్సు రద్దు లేదా సస్పెండ్ చేస్తారు.

లేబుల్ లేని ప్యాకెట్లు విక్రయిస్తే.. : విత్తన ప్యాకెట్‌పై కంపెనీ లేబుల్ ఉందా లేదా అనేది రైతులు చూసుకోవాలి. ఒకవేళ లేబుల్ పూర్తిగా లేకపోయినా సక్రమంగా లేకుండా విత్తనాలు అమ్మినా డీలరు శిక్షార్హుడు. విత్తన చట్టం 1966 సెక్షన్ 7, విత్తన నియంత్రణ ఉత్తర్వులు-1983 క్లాజు 8 (అ), నిబంధనలు-2007 సెక్షన్ 3, 4, 5, 6 ప్రకారం ఆ విత్తనాలను జప్తు చేస్తారు. డీలరు లైసెన్సును రద్దు లేదా సస్పెండ్ చేస్తారు. అత్యవసర సరుకుల చట్టం-1955 సెక్షన్ -7, విత్తన చట్టం -2007 సెక్షన్ 12 ప్రకారం జరిమానా విధిస్తారు.

కాలం చెల్లిన విత్తనాలు అంటగడితే... : కాలం చెల్లిన విత్తనాలు అమ్మే డీలరు శిక్షార్హుడు. విత్తన చట్టం 1966 సెక్షన్ 7, విత్తన నియంత్రణ ఉత్తర్వులు-1983 క్లాజు 8(అ), పత్తి విత్తన నిబంధనలు-2007 సెక్షన్ 4, 5 ప్రకారం విత్తనాలు జప్తు చేస్తారు. డీలరు లైసెన్సును రద్దు లేదా సస్పెండ్ చేస్తారు. అత్యావసర సరుకుల చట్టం-1955 సెక్షన్ 7, పత్తి విత్తన చట్టం 2007 సెక్షన్ 12 ప్రకారం జరిమానా విధిస్తారు.

నిర్ణీత ధరకే అమ్మాలి : ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే పత్తి విత్తనాలు అమ్మాల్సి ఉంటుంది. దీన్ని ఉల్లంఘిస్తే పత్తి విత్తన చట్టం-2007 సెక్షన్ 11, నిబంధనలు 22 ప్రకారం ఆ విత్తనాలు జప్తు చేసి విత్తన చట్టం -2007 సెక్షన్ 12 ప్రకారం జరిమానా విధిస్తారు.

రైతు నష్టపోతే..

పత్తి పంట వేసే నిర్ణీత కారణాల వల్ల పంట నష్టపోయిన రైతులకు జిల్లా స్థాయి కమిటీ లేదా రాష్ట్రస్థాయి కమిటీ నిర్ణయించిన నష్టపరిహారం విత్తన కంపెనీ చెల్లించాల్సి ఉంటుంది. విత్తన చట్టం -2007 సెక్షన్ 7, నిబంధనలు 28 ప్రకారం విత్తన లైసెన్సు రద్దు లేదా సస్పెండ్ చేస్తారు. విత్తన చట్టం -2007 సెక్షన్ 12 ప్రకారం జరిమానా విధిస్తారు.

ఎరువుల విక్రయ నిబంధనలు

- ఎరువుల డీలరు కొనుగోలుదారుకు డీలరు అమ్మకపు రశీదు ఇవ్వాల్సి ఉంటుంది.

తన ఎరువుల లైసెన్సును షాపులో తప్పనిసరిగా ప్రదర్శించాల్సి ఉంటుంది. స్టాక్‌బోర్డు లేదా ధరల పట్టిక బోర్డు ఏర్పాటు చేయాలి. ఈ నిబంధనలు పాటించకుంటే అత్యవసర సరుకుల చట్టం-1955 సెక్షన్ 7 ప్రకారం ఏడేళ్ల జైలు, జరిమానా విధిస్తారు.

- లైసెన్సు లేకుండా ఎరువుల వ్యాపారం నిర్వహించినా, కాలం చెల్లిన ఎరువులు అమ్మినా, ప్రభుత్వం నిర్ణయించిన గరిష్ట ధరకంటే ఎక్కువకు అమ్మినా, '0' ఫారం లేకుండా ఎరువులు విక్రయించినా అత్యవసర వస్తువుల చట్టం -1955 సెక్షన్ 7 ప్రకారం మూడు నెలల జైలు, జరిమానా విధిస్తారు.

లైసెన్సు లేకుండా పురుగు మందులు అమ్మినా, నిల్వ చేసినా, లైసెన్సు లేకుండా పురుగు మందులు తయారు చేసినా శిక్షార్హులు. మొదటిసారి తప్పు చేస్తే రెండేండ్ల కారాగార శిక్షతోపాటు 50 వేల రూపాయల జరిమానా, రెండోసారి తప్పు చేస్తే మూడేళ్ల కారాగార శిక్షతోపాటు 75 వేల రూపాయల జరిమానా విధిస్తారు.

పురుగు మందు డీలరు ఇవి పాటించాల్సిందే..

తన దుకాణంలో డీలరు స్టాక్ బోర్డు పెట్టకపోయినా లేక తన దుకాణం పేరు గల బోర్డు పెట్టకపోయినా మొదటిసారి తప్పుకు ఏడాది జైలు, 25 వేల రూపాయల జరిమానా విధిస్తారు. రెండోసారి అదే తప్పు చేస్తే రెండేండ్ల జైలుతోపాటు 50 వేల రూపాయల జరిమానా విధిస్తారు.

వ్యవసాయం-వాతావరణం
తెగుళ్ల బెడద

గడిచిన మూడురోజుల్లో రాష్ట్రంలో వాతావరణం పొడిగా ఉంది. పగటి ఉష్ణోగ్రతలు 27-31 డిగ్రీల సెల్సియస్, రాత్రి ఉష్ణోగ్రతలు 7-16 డిగ్రీల సెల్సియస్ మధ్య నమోదయ్యాయి. హైదరాబాద్ వాతావరణ కేంద్రం అందించిన సమాచారం ప్రకారం రాబోయే ఐదు రోజుల్లో రాష్ట్రంలో వాతావరణం పొడిగా ఉండొచ్చు. పగటి ఉష్ణోగ్రతలు 25 నుంచి 35 డిగ్రీల సెల్సియస్ మధ్య, రాత్రి ఉష్ణోగ్రతలు 7 నుంచి 19 డిగ్రీల సెల్సియస్ మధ్య నమోదయ్యే అవకాశం ఉంది.

రైతులకు సూచనలు

- రాష్ట్రంలో రాత్రి ఉష్ణోగ్రతలు తక్కువగా నమోదవుతున్నాయి. వరి నారుమడిని కాపాడుకోవడానికి పాలిథీన్ షీట్లు ఉపయోగించాలి. రాత్రిళ్లు కప్పి ఉదయం తీసేయాలి. రాత్రివేళలో నారుమడిలో సంమృద్ధిగా నీటిని ఉంచి మరుసటి రోజు ఉదయాన్నే తీసేయాలి. మళ్లీ ఉదయం 10-11 మధ్య నీళ్లు పెట్టాలి. దీంతో నారు ఎదుగుదల బాగా ఉంటుంది.
- నారుమడిలో జింక్ లోపం లక్షణాలు కనిపించిన వెంటనే లీటరు నీటికి 2 గ్రాముల జింక్ సల్ఫేట్ కలిపి అవసరం మేరకు ఐదు రోజుల వ్యవధిలో ఒకట్రెండుసార్లు పిచికారీ చేయాలి. విత్తిన 15 రోజులకు పైపాటుగా వేసే యూరియా (2.5 కిలోలు)తోపాటు కార్బండజిమ్ 25శాతం, మ్యాంకోజెబ్ 50 శాతం కలిగిన 6.25 గ్రాముల మిశ్రమ శిలీంధ్ర నాశకాన్ని పట్టించి నారుమడిలో వేయాలి.



- వరిలో అగ్గితెగులు నివారణకు లీటరు నీటికి 0.6 గ్రాము ట్రైసైక్లోజోల్ కలిపి ఒకసారి పిచికారీ చేయాలి.
- వరిని కాండం తొలిచే పురుగు ఆశించకుండా 200 చ.మీటర్ల నారుమడికి 800 గ్రాముల కార్బోఫ్యూరాన్ 3జీ గుళికలను 5-7 రోజుల ముందు నారుమడిలో వేయాలి. ఈ పురుగు ఆశించకుండా ముందు జాగ్రత్తగా నాటిన 15 నుంచి 20 రోజుల లోగా ఎకరానికి 10 కిలోల చొప్పున కార్బోఫ్యూరాన్ 3జీ వేయాలి. వరిలో జింకు ధాతు లోపం గమనిస్తే లీటరు నీటిలో 2 గ్రాముల జింక్ సల్ఫేట్ కలిపి 5 నుంచి 7 రోజుల వ్యవధిలో రెండు మూడుసార్లు పిచికారీ చేయాలి.
- మొక్కజొన్న పంటను మొవ్వు పురుగు ఆశించే అవకాశాలున్నాయి. పైరు మొలిచిన 10 నుంచి 15 రోజుల మధ్య ఇవి దాడి చేయొచ్చు. నివారణకు లీటరు నీటికి 2 మి.లీటర్ల క్లోరోపైరిఫాస్ లేదా 1.5 గ్రాముల ఎసిఫేట్ కలిపి పిచికారీ చేయాలి. పైరు 25 నుండి 30 రోజుల దశలో కార్బోఫ్యూరాన్ 3జీ గుళికలను ఎకరానికి 3నుంచి 4 కిలోల చొప్పున మొవ్వులో వేయాలి. మొక్కజొన్నలో బెట్ట వాతావరణ పరిస్థితుల్లో పేనుబంక ఆశించే సూచనలున్నాయి. నివారణకు లీటరు నీటికి 2 మి.లీటర్ల డైమిథోయేట్ లేదా మిథైల్ డెమటాస్ లేదా 1.5 గ్రాముల ఎసిఫేట్ మందును కలిపి పిచికారీ చేయాలి.
- ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో వేరుశనగ పంటలను ఆకు మచ్చ, కాండం కుళ్లు వైరస్ తెగులు ఆశించేందుకు అనుకూలం. నివారణకు లీటరు నీటికి 2 గ్రాముల మ్యాంకోజెబ్ లేదా ఒక గ్రాము కార్బండజిమ్ లేదా 2 గ్రాముల క్లోరోథాలోనిల్ 2 మి.లీటర్ల హెక్సాకొనజోల్ మందును కలిపి పిచికారీ చేయాలి. తెగుళ్ల నివారణకు ముందు జాగ్రత్తగా పంట పొలం, గట్లపై ఉన్న వయ్యారిభామ కలుపు మొక్కలను నిర్మూలించుకోవాలి. పొలం చుట్టూ 4 నుంచి 5 వరుసల్లో సజ్జ, జొన్న, మొక్కజొన్న పంటలను వేయడం వల్ల తామర పురుగులు పంటను ఆశించకుండా నివారించొచ్చు.
- వేరుశనగ పంటల్లో పొగాకు లద్దె పురుగు గమనించినట్టయితే ఎకరానికి 4 లింగాకర్షక బుట్టలు పెట్టి అడుగు ఉధృతిని గమనించాలి. ఎకరానికి 10 పక్షి స్థావరాలను ఏర్పాటు చేయాలి. పురుగు ఉధృతినిబట్టి లీటరు నీటికి 5 మి.లీటర్ల వేపనూనె లేదా 2.5 మి.లీటర్ల క్లోరిపైరిఫాస్ లేదా 1.5 గ్రాముల థయోడికార్బ్ లేదా 2 మి.లీటర్ల క్లోర్‌పెనపైర్ లేదా 1 మి.లీటర్ల నోవాల్యూరాన్ మందును కలిపి పిచికారీ చేయాలి. బాగా ఎదిగిన లద్దె పురుగుల నివారణకు విషపు ఎరలను 5 కిలోల తవుడు, 500గ్రాముల కార్బరిల్ మందును కలిపి తయారు చేసి సాయంత్రం పూట పొలంలో చల్లాలి.
- ప్రస్తుతం నెలకొన్న వాతావరణ పరిస్థితులు మిరప పంటకు కానోఫోరా కొమ్మ కుళ్లు, బూడిద తెగుళ్లు, తామర పురుగులు సోకేందుకు అనుకూలం. కానోఫోరా కొమ్మకుళ్లు తెగులు నివారణకు పది లీటర్ల నీటిలో 30 గ్రాముల కాపర్ ఆక్సీక్లోరైడ్, ఒక గ్రాము ప్లాంటామైసిన్ మందును కలిపి వారం రోజుల వ్యవధిలో రెండు సార్లు పిచికారీ చేయాలి. బూడిద తెగులు నివారణకు లీటరు నీటికి 3 గ్రాముల నీటిలో కరిగే గంధకం లేదా ఒక మి.గ్రాము కారాథీన్ మందును కలిపి పిచికారీ చేయాలి. తామర పురుగుల నివారణకు లీటరు నీటిలో 1.5 గ్రాముల అసిపేట్ లేదా 2 మి.లీటర్ల ఫిప్రోనిల్ మందును కలిపి పిచికారీ చేయాలి.
- ప్రస్తుత వాతావరణ పరిస్థితులు మామిడిలో తేనె మంచు పురుగులు, పక్షి కన్ను, బూడిద తెగుళ్లు ఆశించేందుకు అనుకూలం. నివారణకు లీటరు నీటిలో 1.6 మి.లీటర్ల మోనోక్రోటోఫాస్ ఒక గ్రాము కార్బండజిమ్ మందును కలిపి పిచికారీ చేయాలి.

పెరటి సాగు ఇలా...



కూరగాయలను వ్యవసాయ భూముల్లోనే కాకుండా ఇంట్లోనూ సాగు చేసుకోవచ్చు. దీనికి వంటగది, స్నానాలగదుల నుంచి వెలువడే వృథా నీటిని వాడు కోవచ్చు. తక్కువ స్థలంలో ఎక్కువ చెట్లు పెంచు కోవచ్చు. ఇలా చేయడం వల్ల చీడపీడల బారి నుంచి చెట్లను కాపాడుకోవచ్చు. రసాయనాలు వినియోగించ కుండా కాలుష్య రహితంగా కూరగాయలు పండించు కోవచ్చు. ఇలా ఉత్పత్తి చేసుకుంటే మన ఆరోగ్యానికి ఎలాంటి హాని ఉండదు.

పెరట్లో కూరగాయలు సాగు చేసుకునేందుకు స్థలం కేటాయింపులో నియమాలేవీ లేవు. ఎంత స్థలాన్నయినా కేటాయించుకోవచ్చు. మనం ఉత్పత్తి చేసుకునే కూరగాయలనుబట్టి స్థలాన్నికేటాయించుకోవాలి. అయితే.. దీర్ఘచతురస్రాకారంగా ఉంటేనే మంచిది. పంట కోతల ఆధారంగా ఐదు సెంట్ల భూమిలో పెరటి మొక్కల పెంపకాన్ని ఆరంభిస్తే, కనీసం నాలుగురు లేదా ఐదుగురు ఉండే కుటుంబానికి సరిపడా కూరలు పండించుకోవచ్చు.

భూమిని సిద్ధం చేయండిలా...

ముందుగా ఒక పార తీసుకుని 30-40 సెం.మీటర్ల లోతుగా భూమిని తవ్వుకోవాలి. రాళ్లు, పొదలు, ముళ్ల వగైరాలు తొలగించాలి. 100 కిలోల మంచి పొలం నుంచి తెచ్చుకున్న సేంద్రియ ఎరువులు లేదా వర్మీకంపోస్ట్ ఎరువును వేసి మట్టిలో కలపాలి. గట్లు కట్టి, అవసరాన్నిబట్టి మధ్యలో 45 నుంచి 60 సెం.మీటర్ల ఎడం ఉండేలా చూడాలి. నేల చదునుగా కూడా ఉండొచ్చు.

నాటుకోవడమెలా..?

నేరుగా విత్తడం వల్ల వచ్చే బెండ, పందిరి చిక్కుడు, అలసందలు వంటి కూరగాయలు గట్లుగా ఏర్పర్చిన స్థలాల్లో ఒకవేపు 30 సెం.మీటర్ల ఎడంతో విత్తవచ్చు. తోటకూరను (పూర్తి చెట్టును పీకేయడానికి, క్లిప్పింగ్‌కు అనువైనవి) కూడా నాటవచ్చు. దీన్ని నాటే ముందు 20 భాగాల మట్టికి ఒక భాగం విత్తనాలను కలిపి మడుల్లో వెదజల్లాల్సి ఉంటుంది. చిన్ని ఉల్లి, పుదినా, కొత్తిమీర వంటి వాటిని మళ్లలో గట్లపై పెంచొచ్చు.

నారుతో పెంచదగ్గ టమాట, వంకాయ, మిరప తదితర కూరగాయల విత్తనాలను నర్సరీలో నెల రోజుల ముందే గీతలు గీసి విత్తుకోవాలి. అలా వేశాక వాటిపై మట్టివేసి, దానిపై 250 గ్రాముల వేప పిండిని కలిపితే చీమలు విత్తనాలను తినకుండా ఉంటాయి. నాటిన 30 రోజుల తర్వాత టమాట, 40 నుంచి 45 రోజులకు వంకాయ, మిరప, పెద్ద ఉల్లి వారును నర్సరీ నుంచి తీసి విడివిడిగా గట్లకు ఒక వైపుగా నాటాలి. టమాట, వంకాయ, మిరప మొక్కలకు 30-45 సెం.మీటర్ల ఎడం ఉండాలి. అదే పెద్ద ఉల్లికైతే గట్లకు రెండు వైపులా 10 సెం.మీటర్ల ఎడం ఉండాలి. మొక్కలను నాటగానే వాటికి నీళ్లు పోయాలి. ఆ తర్వాత మళ్లీ మూడోరోజు నీళ్లు పోయాలి. ఈ మొక్కలకు మొదట రెండు రోజులకోసారి, ఆ తర్వాత నాలుగు రోజులకోసారి మాత్రమే నీళ్లు పోయాలి.

ఏడాది పొడవునా నిరంతరం పెరిగే చెట్లను తోటకు వెనకభాగంలో పెంచాలి. దీనివల్ల వాటి నీడ మిగిలిన మొక్కలపై పడి వాటికి ఎండ తగలకుండాపోయే ప్రమాదాన్ని నివారించొచ్చు. అలాగే మిగిలిన కాయకూర మొక్కలకు కావాల్సిన పోషకాహారాలను ఇవి లాగేసుకోకుండా కూడా ఉంటుంది. తోట మొత్తానికి ఉండే నడకదారి పక్కన, మధ్యదారి ఇరుపక్కలా తక్కువ వ్యవధిలో పెరిగే కొత్తిమీర, పాలకూర, బచ్చలి, పుదీనా వంటి మొక్కలను వేసుకోవచ్చు.

రైతుల సందేహాలు నిపుణుల సమాధానాలు

'మోనోక్రోటోఫాస్'తో పల్లాకు తెగులు నివారణ

జొన్నలో కాండం తొలిచే పురుగు నివారణ ఎలా?

- ఎస్. సదానంద్, నందిపేట్ (నిజామాబాద్ జిల్లా)

ఈ పురగు పైరును 30 రోజుల తర్వాత నుంచి పంట కోసే వరకు ఆశిస్తుంది. గుండ్రని వరుస రంధ్రాలు ఆకులపై ఏర్పడతాయి. మొవ్వ చనిపోయి తెల్ల కంకి ఏర్పడుతుంది. నివార ణకు విత్తిన 35 నుంచి 40 రోజుల లోగా ఎకరానికి 4కిలోల చొప్పున కార్బోఫ్యురాన్ గుళికలను కాండపు సుడుల్లో వేయాలి.

మినుములో పల్లాకు తెగులు ఎలా అరికట్టాలి?

- భాస్కర్, కొల్లాపూర్ (నాగర్‌కర్నూల్ జిల్లా)

వైరస్ సోకిన మొక్కల ఆకులపై పసుపు పచ్చ మచ్చలు ఏర్పడతాయి. పైరు గిడసబారిపోయి పూత పూయకుండానే ఎండిపోతుంది. ఈ వైరస్ తెల్లదోమ వల్ల వ్యాపిస్తుంది. నివారణకు తెగులు సోకిన మొక్కలను పీకి నాశనం చేయాలి. తెల్లదోమ నివారణకు లీటరు నీటిలో 1.6 మి.లీటర్ల మోనోక్రోటోఫాస్ లేదా ఒక గ్రాము ఎసిఫేట్ లేదా 2 మి.లీటర్ల డైమిథోయేట్ కలిపి వారం నుంచి 10 రోజుల లోగా పిచికారీ చేయాలి.

కందిలో స్టెరెలెట్ మోజాయిక్ గురించి తెలపండి

- కమలాకర్, ఆదిలాబాద్

ఈ. తెగులు సోకిన మొక్క లేత ఆకుపచ్చ రంగు గల చిన్న ఆకులను విపరీతంగా తొడుగుతుంది. పూత పూయదు. ఈ తెగులు నల్లి ద్వారా వ్యాపిస్తుంది. నల్లి నివారణకు లీటరు నీటికి 3గ్రాముల నీటిలో కరిగే గంధకపు పొడి లేదా 4 మి.లీ డైకోషాల్ కలిపి వారానికోసారి చొప్పున రెండు దఫాలుగా పిచికారీ చేయాలి.

వరిలో మెడవిరుపుకు నివారణ ఎలా?

- శ్రీనివాస్, శ్రీరాంపూర్ (పెద్దపల్లి జిల్లా)

ఈ తెగులు కంకులను ఆశించినప్పుడు గోధుమ రంగు మచ్చలు ఏర్పడతాయి. మెడభాగం కుళ్లిపోయి వెన్నులు విరుగుతాయి. దీన్నే మెడవిరుపు తెగులు అంటారు. నివారణకు మొక్క మొదళ్లు తడిచే విధంగా లీటరు నీటిలో 10 మి.లీటర్ల ప్రొపికొనజోల్ లేదా 2 మి.లీటర్ల హెక్సాకొనాజోల్ కలిపి పిచికారీ చేయాలి.

వేరుశనగలో మొదలు కుళ్లు తెగులును ఎలా నివారించుకోవాలి?

- వెంకన్న, చిట్యాల (నల్లగొండ జిల్లా)

ఈ తెగులు ఆశించడం వల్ల మొలక రాకుండానే విత్తనం కుళ్లిపోతుంది. రెండో దశ ఎదిగిన మొక్కలను తెగులు సోకినట్లయితే మొక్కలు వడలిపోయి ఎండిపోతాయి. దీని నివారణకు విత్తే ముందు కిలో విత్తనానికి 3 గ్రాముల చొప్పున మాంకోజెట్ కలిపి విత్తన శుద్ధి చేయాలి. తెగులు ఆశించిన వెంటనే ఎకరానికి 400గ్రాముల మాంకోజెట్ మందును 200లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలి.



ఆంచల్ అదరహో

స్కీయింగ్‌లో భారత్‌కు తొలి పతకం

న్యూఢిల్లీ : స్కీయింగ్‌లో భారత్‌కు తొలి అంతర్జాతీయ పతకాన్ని అందించి ఆంచల్ ఠాకూర్ చరిత్ర సృష్టించింది. 21 ఏండ్ల ఆంచల్‌ది హిమాచల్ ప్రదేశ్‌లోని మనాలి. టర్కీలో ఫెడరేషన్ ఇంటర్నేషనల్ డీ స్కీ (ఎఫ్ఐఎస్) ఆధ్వర్యంలో నిర్వహించిన ఆల్ఫైన్ ఎజ్‌డర్ 3200 కప్ టోర్నీలో ఆంచల్ ఈ ఘనత సాధించింది. టోర్నీలో మంగళవారం జరిగిన స్లాలోమ్ రేస్ విభాగంలో పాల్గొన్న ఆంచల్ కాంస్య పతకం నెగ్గింది. స్కీయింగ్‌లో భారత్ పతకం సాధించటం ఇదే తొలిసారి. గెలుపు విశేషాలను ట్వీటర్ వేదికగా ఆంచల్ పంచుకున్నది. 'చివరకు ఊహించనది జరిగింది. ఇది నా తొలి అంతర్జాతీయ పతకం. టర్కీలో అత్యుత్తమ ప్రదర్శన చేశాను.' అని ట్వీట్ చేసింది. వాట్సాప్‌లో తన కూతురు మాట్లాడి పతకం గురించి తెలిపిందని ఆంచల్ తొలి గురువు, తండ్రి రోషన్ ఠాకూర్ తెలిపారు. ప్రధాని నరేంద్ర మోడి, కేంద్ర క్రీడా శాఖ మంత్రి రాజ్యవర్ధన్ సింగ్ రాథోర్ సహా పలువురు ప్రముఖులు ఆంచల్‌ను అభినందించారు. ప్రస్తుతం ఆంచల్ మాజీ ఒలింపియన్ హీరా లాల్ వద్ద శిక్షణ పొందుతోంది.

పెండింగ్‌లోనే ఉన్నది

యూసుఫ్ పఠాన్ డోప్ కేస్‌పై వాడా



న్యూఢిల్లీ: క్రికెటర్ యూసుఫ్ పఠాన్‌పై ఉన్న డోపింగ్ కేసు ఇంకా పెండింగ్ దశలోనే ఉన్నదని వరల్డ్ యాంటీ డోపింగ్ ఏజెన్సీ (వాడా) తెలిపింది. గతేడాది దేశవాళీ టీ20 మ్యాచ్ జరిపిన డోప్ టెస్టులో యూసుఫ్ విఫలమయ్యాడు. నిషేధిత టర్బ్యూటలైన్ పదార్థం తీసుకున్నాడని నిరూపణ అవటంతో యూసుఫ్‌పై ఐదు నెలల వేటు వేస్తున్నట్టు బీసీసీఐ మంగళవారం ప్రకటించింది. అయితే, తాను ఉద్దేశ్యపూర్వకంగా ఆ మందు తీసుకోలేదని, ఇన్‌ఫెక్షన్ తగ్గించుకోవటం కోసం దగ్గు మందు మాత్రమే తీసుకున్నానని, అందులో నిషేధిత ఉత్ప్రేరకాలున్న విషయం తెలియదని.. యూసుఫ్ బీసీసీఐకు వివరించాడు. యూసుఫ్ సమాధానంతో సంతృప్తి చెందిన బీసీసీఐ అధికారులు.. గతేడాది ఆగష్టు 15 తేది నుంచే యుసుఫ్ ఎదుర్కొంటున్న తాత్కాలిక సస్పెన్షన్‌ను పరిగణలోకి తీసుకున్నారు. ఐదు నెలల సస్పెన్షన్‌ను అప్పటినుంచే లెక్కలోకి రావటంతో ఈ నెల 14న యూసుఫ్ సస్పెన్షన్ ముగియనున్నది. అయితే, తాజాగా యూసుఫ్‌పై ఉన్న డోపింగ్ కేసు ఇంకా పెండింగ్ దశలోనే ఉన్నదని వాడా వెల్లడించింది. కేసు ఇంకా పరిష్కారం కానందున ఈ విషయంపై తామేం మాట్లాడబోమని వాడా మేనేజర్ మాగీ దురంద్ తెలిపారు.

సెమీస్‌లో ఢిల్లీ

నార్త్ ఈస్టర్న్ వారియర్స్‌పై అలవోక విజయం



సంగ్ జీ హ్యూన్

- సైనా, సింధు జట్లు ఇంటిముఖం
- ప్రీమియర్ బ్యాడ్మింటన్ లీగ్-3

నవతెలంగాణ క్రీడాప్రతినిధి-గచ్చిబౌలి

సైనా, సింధు జట్లు ఇంటిముఖం పట్టగా.. ఢిల్లీ డాషర్స్ పీబీఎల్ సెమీఫైనల్లోకి దూసుకెళ్లింది. గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో బుధవారం జరిగిన తన ఆఖరి లీగ్ మ్యాచ్‌లో గెలుపొందిన ఢిల్లీ తుది నాల్గు జట్లలో చోటు సాధించింది. నార్త్ ఈస్టర్న్ వారియర్స్‌తో తొలి మ్యాచ్‌లో తలొగ్గినా.. ఢిల్లీ పుంజుకున్నది. నార్త్‌ను చిత్తుగా ఓడించి సెమీఫైనల్స్ బెర్త్ బుక్ చేసుకున్నది. డబుల్స్ మ్యాచ్‌ల్లో ఓడిన ఢిల్లీ సింగిల్స్ మ్యాచుల్లో నెగ్గి గెలుపొందింది. 4-1తో విజయం సాధించిన ఢిల్లీ పాయింట్ల పట్టికలో మూడోస్థానంలో నిలిచింది. నేడు హైదరాబాద్ హంటర్స్, బెంగళూర్ బ్లాస్టర్స్ ఆఖరి లీగ్ మ్యాచ్‌లో తలపడనున్నాయి. సెమీస్‌కు చేరుకున్న ఈ రెండు జట్లు అగ్రస్థానంపై కన్నేసి బరిలోకి దిగనున్నాయి.

సింగిల్స్ మెరుపులు : నార్త్ ఈస్టర్న్ వారియర్స్‌తో తొలి మ్యాచ్‌లో ఢిల్లీ పరాజయం పాలైంది. మిక్స్‌డ్ డబుల్స్‌లో అశ్విని పొన్నప్ప, వ్లాదిమిర్ ఇవనోవ్‌లు 13-15, 11-15తో మిచెలీ లీ, షిన్ బెక్‌ల చేతిలో ఓటమిపాలయ్యారు. కానీ తర్వాతి మూడు మ్యాచుల్లో ఢిల్లీ గెలుపొంది సెమీస్ బెర్త్ ఖాయం చేసుకున్నది. మెన్స్ సింగిల్స్ తొలి మ్యాచ్‌లో అజయ్ జయరాంపై 15-13, 10-15, 15-12తో విన్సెంట్ పైచేయి సాధించాడు. మరో మెన్స్ సింగిల్స్‌లో తియాన్ (నార్త్) పోరును ఆ జట్టు ట్రంప్‌గా ఎంచుకున్నది. కానీ ఈ మ్యాచ్‌లో థాయ్ జు వాంగ్ 15-10, 8-15, 15-11తో విజయం సాధించాడు. ట్రంప్ మ్యాచ్‌లో ఓడిన నార్త్ మిక్స్‌డ్ విజయంతో సాధించిన ఒక్క పాయింట్‌ను సైతం కోల్పోయింది. మహిళల సింగిల్స్‌లో సంగ్ జీ హ్యూన్ 13-15, 15-11, 15-13తో మిచెలీ లీపై నెగ్గింది. ఈ మ్యాచ్ ఢిల్లీ ట్రంప్ గేమ్ కావటంతో ఆ జట్టుకు రెండు పాయింట్లు లభించాయి. నామమాత్రపు మెన్స్ డబుల్స్‌లో 15-9, 10-15, 9-15తో కిమ్ జి జంగ్, షిన్ చోయ్‌లపై ఇవాన్, వ్లాదిమిర్ (నార్త్) గెలుపొంది ఊరటనిచ్చారు.

సైనా, సింధు జట్లు ఔట్ : అగ్రశ్రేణి షట్లర్లు సైనా నెహ్వాల్, పి.వి సింధుల జట్టు పీబీఎల్3 నుంచి నిష్క్రమించాయి. లీగ్ దశలో తమ మ్యాచుల్నీ ఆడేసిన అవాధె వారియర్స్, చెన్నై స్మాషర్స్ చెరోర 12 పాయింట్లు సాధించాయి. ఎనిమిది జట్లు పాల్గొంటున్న పీబీఎల్‌లో పాయింట్ల పట్టికలో తొలి నాల్గు స్థానాల్లోని జట్టు సెమీ ఫైనల్స్‌కు అర్హత సాధిస్తాయి. ఢిల్లీ, నార్త్ ఈస్టర్న్ జట్లు బుధవారం నాటి మ్యాచ్‌కు ముందు చెరో 11 పాయింట్లతో ఉన్నాయి. ఈ మ్యాచ్‌లో విజయంతో ఢిల్లీ నాల్గు పాయింట్లు సాధించింది. దీంతో 16 పాయింట్లతో మూడోస్థానానికి చేరుకున్నది. దీంతో అవాధె వారియర్స్, చెన్నై స్మాషర్స్ దిగువకు వచ్చేశాయి. నిరుడు ఒంటిచేత్తో చెన్నై స్మాషర్స్‌ను విజేతగా నిలిపిన సింధు.. ఈసారి సెమీఫైనల్స్‌కు చేరకుండానే ఇంటిదారి పట్టింది. మరోవైపు కిదాంబి శ్రీకాంత్, సైనా నెహ్వాల్‌తో కూడిన అవాధె వారియర్స్ సైతం నాకౌట్‌కు చేరకపోవటం ఆశ్చర్యం కల్గించినా, ఫిట్‌నెస్ లేమి వారియర్స్ అవకాశాలను దెబ్బకొట్టాయని చెప్పవచ్చు. నేడు హైదరాబాద్ హంటర్స్, బెంగళూర్ బ్లాస్టర్స్ ఆఖరి లీగ్ మ్యాచ్‌లో తలపడనున్నాయి. హైదరాబాద్ 14 పాయింట్లతో నాల్గో స్థానంలో కొనసాగుతుండగా, బెంగళూర్ 15 పాయింట్లతో రెండో స్థానంలో కొనసాగుతోంది. నేటి మ్యాచ్‌లో విజేత అగ్రస్థానం సొంతం చేసుకునే అవకాశం ఉంది. అహ్మదాబాద్ స్మాష్ మాస్టర్స్ 17 పాయింట్లతో ప్రస్తుతం తొలి స్థానంలో కొనసాగుతోంది.

యుకీ, రామ్‌కుమార్ ముందంజ

సుమిత్, ప్రజ్ఞన్ ఔట్ ..ఆస్ట్రేలియా ఓపెన్ అర్హత రౌండ్



యుకీ బాంబ్రీ

మెల్‌బోర్న్ : భారత అగ్ర శ్రేణి టెన్నిస్ ఆటగాళ్లు యుకీ బాంబ్రీ, రామ్‌కుమార్ రామనాథన్‌లు ఆస్ట్రేలియా ఓపెన్‌లో శుభారంభం చేశారు. బుధవారం జరిగిన తొలి అర్హత పోరుల్లో విజయం సాధించారు. అయితే సుమిత్ నాగల్, ప్రజ్ఞన్ గుణేశ్వరన్‌లకు నిరాశే ఎదురైంది. తొలి క్వాలిఫైయింగ్ రౌండ్లలోనే పరాజయం పాలైన వీరిద్దరూ టోర్నీ నుంచి నిష్క్రమించారు. 15వ సీడ్ యుకీ 1-6, 6-3, 6-4తో బ్రేడ్‌లీ షూనర్ (కెనడా)ను మట్టికరిపించాడు. తొలి సెట్‌లో తడబడినా రెండో, తుది సెట్లలో పుంజుకున్న యుకీ.. తదుపరి అర్హత మ్యాచ్‌లో కార్లోస్ టాబెర్నర్ (స్పెయిన్)తో తలపడనున్నాడు. రామ్‌కుమార్ రామనాథన్ 28వ సీడ్‌గా బరిలో దిగినా, అమెరికన్ ప్రత్యర్థితో హోరాహోరీ సమరమే చేశాడు. బ్రేడ్‌లీ క్లాన్‌ను 6(6)-7(8), 7(7)-6(3), 6-2తో ఓడించాడు. రెండో అర్హత పోరులో గ్లెబ్ సకరోవ్ (ఫ్రాన్స్)తో అమీతుమీ తేల్చుకోనున్నాడు. ఇటీవలే తన తొలి ఏటీపీ ఈవెంట్, పుణె ఓపెన్‌లో ఆడిన సుమిత్ నాగల్.. మూడు సెట్ల పోరులో ఓడాడు. 6-7, 6-3, 3-6తో ఇటలీ ఆటగాడు ఆలెసాండ్రో గియానెసీ చేతిలో ఓడి టోర్నీ నుంచి నిష్క్రమించాడు. మరో ఆటగాడు ప్రజ్ఞన్ గుణేశ్వరన్ సైతం టోబియాస్ కామ్‌కే (జర్మనీ) చేతిలో 6-4, 1-6, 2-6తో ఓడి టోర్నీ నుంచి వెనుదిరిగాడు. జనవరి 15 నుంచి ప్రధాన చాంపియన్‌షిప్ మ్యాచులు మొదలవుతాయి.



రామ్‌కుమార్

హర్యానా బోణీ

వీర్ మరాఠాస్‌పై 5-2తో విజయం

పీడబ్ల్యూఎల్, సీజన్-3



మంజు
సరిత

న్యూఢిల్లీ : హర్యానా హామర్స్ ప్రొ రెజ్లింగ్ లీగ్‌లో బోణి చేసింది. వీర్ మరాఠాస్‌తో బుధవారం జరిగిన తొలి పోరులో 5-2తో గెలుపొందింది. 57 కిలోల విభాగపు తొలి బౌట్‌లోనే వ్లాదిమిర్ కించె కించెగశ్‌విలి 7-3తో శ్రవణ్‌పై గెలుపొంది హర్యానా జట్టుకు శుభారంభాన్నిచ్చాడు. 76, 92కిలోల విభాగంలో వీర్ మరాఠాస్ జట్టు రెజ్లర్లు ఒక్క పాయింట్ కూడా కోల్పోకుండా ప్రత్యర్థులను మట్టికరిపించారు. ఓవరాల్ స్కోరులో 2-1తో ఆధిక్యంలోకి దూసుకెళ్లారు. అయితే మహిళల 50 కిలోల విభాగంలో సరిత 4-3తో మంజుపై గెల్చి హర్యానాను పోటీలో నిలపింది. ఆపై మిగిలిన మూడు బౌట్లలోనూ హర్యానా రెజ్లర్లు సత్తా చాటారు. 65 కిలోల విభాగంలో హర్‌ఫూల్ స్వల్ప తేడాతో అమిత్ దంకడ్‌ను ఓడించగా.. హెలెన్ మారూలిస్ 57 కిలోల విభాగంలో 9-1తో ఆమ్రి మార్వ్‌పై గెలుపొందింది. సుశీల్ కుమార్‌పై కేసుతో ఇటీవలి వార్తల్లో నిలిచిన పర్వీన్ రానా (వీర్ మరాఠాస్) 0-10తో ఓటమి పాలయ్యాడు. దీంతో 5-2 విజయం హర్యానా సొంతమైంది. నేడు ఎన్‌సీఆర్ పంజాబ్ రాయల్స్, యుపీ దంగల్ జట్లు తలపడనున్నాయి.

దక్షిణాఫ్రికాకు మహిళల వన్డే జట్టు ఖరారు



న్యూఢిల్లీ: ఫిబ్రవరి 5 నుంచి దక్షిణా ఫ్రికాతో జరుగనున్న మూడు మ్యాచుల వన్డే సిరీస్‌కు.. 16 మందితో కూడిన భారత మహి ళల క్రికెట్ జట్టు ఖరారైంది. ఈ జట్టుకు మిథాలీ రాజ్ నాయకత్వం వహిస్తుండగా, వైస్ కెప్టెన్ బాధ్యతలు హర్మన్‌ప్రీత్ కౌర్ మోయనున్నది. వన్డే సిరీస్ తర్వాత ఐదు మ్యాచుల టీ20 సిరీస్ సైతం జరుగనుండగా.. పొట్టి ఫార్మాట్ జట్టు వివరాలు ఇంకా వెల్లడి కాలేదు. జట్టు వివరాలు : మిథాలీ రాజ్, హర్మన్‌ప్రీత్ కౌర్, సుష్మా వర్మ, ఎక్తా బిస్త్, స్మృతి మంథన, పూనమ్ యాదవ్, పూనమ్ రౌత్, రాజేశ్వరి గైక్వాడ్, జెమీమా రోడ్రిగ్స్, జులన్ గోస్వామి, దీప్తి శర్మ, శిఖా పాండే, మోనా మేషరమ్, పూజ వస్త్రాకర్, వేద క్రిష్ణమూర్తి, తానియా భాటియా.

ఐర్లాండ్‌తో భారత్ టీ20 మ్యాచులు

న్యూఢిల్లీ: ఈ ఏడాది జూన్ నెలాఖరున భారత్.. ఐర్లాండ్‌లో పర్యటించనున్నది. డబ్లిన్‌లో జూన్ 27,29 తేదీలలో రెండు పొట్టి ఫార్మాట్ మ్యాచులు ఐర్లాండ్‌తో ఆడనున్నది. ఈ మేరకు బీసీసీఐ ఓ ప్రకటనలో తెలపింది. 2007 తర్వాత భారత క్రికెట్ జట్టు ఐర్లాండ్‌లో పర్యటించటం ఇది రెండోసారి. కాగా జూలై నుంచి సెప్టెంబర్ దాకా భారత్.. ఇంగ్లాండ్‌లో పర్యటిస్తుంది.

ఎవ్వరికీ పట్టదా?

మంత్రులు అటువైపు తొంగిచూస్తలేరు. అధికారులు సమీక్షలతో సరిపెడుతున్నారు. ఇలా అధికారులు, ప్రజాప్రతినిధులు ఎవ్వరికీ పట్టనట్టు వ్యవహరిస్తున్నారు. దీంతో మేడారం జాతర ఏర్పాట్ల విషయంలో నీలిమేఘాలు కమ్ముకున్నాయి. జాతరకు సమయం 20 రోజులే ఉన్నప్పటికీ పనులు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉన్నాయి. జాతీయ హోదా అనుమానంగానే మారింది. టూరిజం భవన నిర్మాణం జరిగినా చరిత్ర ఆనవాల్లు సేకరించడంలో నిర్లక్ష్యం కొట్టొచ్చినట్టు కనిపిస్తున్నది. దీంతో ఈసారి మేడారం జాతరకొచ్చే సందర్శకులకు ఇక్కట్లు తప్పేటట్టు లేదు.

మేడారం జాతర పనులకు దూరంగా మంత్రులు

- సమీక్షలతో అధికారులు సరి
- జాతీయ హోదా అనుమానమే
- మహాజాతరకు అనేక ఆటంకాలు

(మేడారం నుంచి పి.వెంకటస్వామి)

ఆసియాలోనే అతిపెద్దదైన మేడారం మహాజాతర ఈ నెల 31 నుంచి ఫిబ్రవరి మూడో తేదీ వరకు జరగనుంది. నాలుగు రోజుల పాటు జరిగే జాతర సందర్భంగా కోటీ 20లక్షల మంది హాజరవుతారని అంచనా. ఈసారి జాతరకు నిధుల్లో కోత పెట్టి కేవలం 80.55 కోట్లనే రాష్ట్ర ప్రభుత్వం కేటాయించింది. గతంలో జాతరకు సంబంధించిన అన్ని ఏర్పాట్లను పర్యవేక్షించే మంత్రులు ఈసారి కంటికి కూడా కనిపిస్తలేరు. జూన్ 27న మేడారం జాతరపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, గిరిజన సంక్షేమశాఖ మంత్రి హైదరాబాద్‌లో సమీక్ష నిర్వహించారు. సెప్టెంబర్ 15న ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరి ఏటురునాగారం ఐటీడీఏలో అధికారులతో సమీక్షించారు. డిసెంబర్ 23న హైదరాబాద్‌లోనే మళ్లీ సమీక్ష నిర్వహించారు. మంత్రులు హైదరాబాద్‌లో జరిగే సమీక్షలకు పరిమితం అవుతున్నారే తప్ప మేడారాన్ని సందర్శించి పనుల్ని సమీక్షించట్లేదు.

సమీక్షలతో అధికారుల సరి

మేడారంలో జాతరకు ముందే జనవరి 15 నాటికి పనులు పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. అధికారులు సమీక్షలతోనే సరిపెడుతున్నారు. గడువు పెంచుతున్నారే తప్ప అనుకున్న సమయం మేరకు పనులు పూర్తి చేయట్లేదు. గత కలెక్టర్ మురళి రెండు, మూడు పర్యాయాలు మేడారం సందర్శించి సమీక్షలు నిర్వయించారు. ఈ నెల 2న మేడారంలోనే గత కలెక్టర్ మురళీ సమీక్ష నిర్వహించారు. 8వ తేదీన ప్రస్తుత ఇన్‌చార్జి కలెక్టర్ కర్ణన్ సమీక్ష నిర్వహించారు. పనుల సమీక్ష సందర్భంగా మంత్రులు పాల్గొంటే పనుల్లో కొంత వేగం పెరిగే అవకాశం ఉంది. సందర్శకులకు ఎలాంటి సేవలు అందిస్తున్నామనే దానిపై ఇప్పటికీ ప్రభుత్వం తరుపున ఒక్క మంత్రి కూడా సమాచారం ఇవ్వలేదు. గిరిజన శాఖా మంత్రి చందూలాల్ ఈ జాతరకు దూరంగా ఉన్నట్టు కనిపిస్తున్నది. జిల్లాకు చెందిన ఉప ముఖ్యమంత్రి, దేవాదాయశాఖ మంత్రితో పాటు పలువురు హాజరై సమీక్షలు జరపాల్సి ఉండగా దూరంగా ఉన్నట్టు కనిపిస్తున్నది. సమీక్షలతోనే సరిపెడితే జాతరకు ఆటంకాలు తలెత్తక తప్పవనే చెప్పాలి.

జాతీయ హోదాపై అనుమానం

మేడారం జాతరకు జాతీయ హోదా కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వం కేంద్రాన్ని కోరింది. దేవాదాయ శాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి సారథ్యంలో పలువురు మంత్రులు ఢిల్లీ పెద్దల్ని కలిశారు. జాతీయ హోదాపై కేంద్రం ఎలాంటి వివరణా ఇవ్వలేదు. ఈ జాతర సందర్భంగా జాతీయ హోదా దక్కడం అనుమానే అన్న సంకేతాలు వస్తున్నాయి. జాతీయ హోదా కల్పించడం వల్ల నిధులు పెరగడంతో పాటు సందర్శకులకు సౌకర్యాలు పెరిగే అవకాశం ఉంది. జాతీయ హోదా విషయంలో రాష్ట్ర ప్రభుత్వం తన విజ్ఞప్తిని కేంద్రంపై పడేసి ఏం పట్టనట్టుగా వ్యవహరిస్తుందన్న ఆరోపణలున్నాయి.



గిరిజన మ్యూజియం కోసం ఇప్పుడిప్పుడే వస్తువుల సేకరణ

మేడారంలో కోటి రూపాయలతో గిరిజన మ్యూజియం నిర్మాణం చేశారు. వస్తువుల సేకరణ కోసం కమిటీ వేశారు. గిరిజన సంప్రదాయ పరికరాల్ని ఇప్పుడిప్పడే సేకరిస్తున్నారు. వస్తువుల సేకరణకు 3లక్షలు, కళాకృతుల ఏర్పాటుకు 17.50లక్షలు, దేవతల ప్రతిమల ఏర్పాటుకు 50వేలు, కళారూపాయల చిత్రాలకు 1.25లక్షలు, ఫొటో ఎగ్జిబిషన్‌కు లక్ష రూపాయలు, ఆడియో, వీడియోకు 50వేలు, జాతర ప్రాముఖ్యత పుస్తకానికి 50వేలు, గ్యాలర్స్, షోకేజీ ఏర్పాటుకు రూ.4.75లక్షలు కేటాయించారు. ప్రత్యేక కమిటీ ఆధ్వర్యంలో వస్తువుల సేకరణ మొదలు పెట్టారు. జాతరలోగా పూర్తి చేయడానికి అధికారులు కుస్తీ పడుతున్నారు. ఆరు మాసాల ముందు జూన్‌లో ప్రణాళిక సిద్ధం చేయగా అన్నింటి విషయంలోనూ నిర్లక్ష్యం చేసి జాతర సమీపిస్తున్న తరుణంలో హడావుడి చేస్తున్నారు. ఎవరూ పట్టించుకోకపోవడంతో సందర్శకులు అనేక ఇబ్బందులు పడే అవకాశాలున్నాయి. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి స్పెషల్ అధికారిని నియమించడంతో పాటు మంత్రులు అప్రమత్తమై పనుల్ని త్వరగా పూర్తి చేసే చర్యలు చేపట్టాలని సందర్శకులు, గిరిజన సంఘాలు, రాజకీయ పార్టీల నాయకులు డిమాండ్ చేస్తున్నారు.



చైతన్యసేద్యం డైరీ, క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ఏఐకేఎస్ ఉపాధ్యక్షులు సారంపల్లి మల్లారెడ్డి, రైతుసంఘ రాష్ట్ర నాయకులు టి.సాగర్, జంగారెడ్డి, సంజీవరెడ్డిలు

సమస్యలపై ఐక్య ఉద్యమాలు

చైతన్య సేద్యం డైరీ ఆవిష్కరణలో వక్తలు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రైతు సమస్యల పరిష్కారానికి భవిష్యత్తులో ఐక్య ఉద్యమాలు చేస్తామని పలువురు వక్తలు అన్నారు. చైతన్య సేద్యం, చైతన్య సేద్యం, డైరీ క్యాలెండర్‌ను రైతు సంఘం నేతలు టి. సాగర్, పి.జంగారెడ్డి, సారంపల్లి మల్లారెడ్డి, వి. సంజీవరెడ్డి శ్రీను, టి. రాములు, జె. కాశీం తెలంగాణ రైతు సంఘం కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జనవరి 10వరకు రైతు సమస్యలపై గ్రామాల్లో సర్వేలు నిర్వహించాలని, 11,12 తేదీల్లో అధికారులకు వినతి పత్రాలు ఇవ్వాలని అన్నారు. సంక్రాంతి పండుగ సందర్భంగా గ్రామాల్లో ముగ్గుల పోటీలు, క్రీడలు నిర్వహించాలని, 16 నుంచి 19 వరకు మండల కేంద్రాల్లో నిరాహార దీక్షలు నిర్వహించాలని కోరారు. 22న జిల్లా కలెక్టర్ కార్యాలయాలను ముట్టడించాలని పిలుపునిచ్చారు. జనవరి 19న కార్మిక కర్షక ఐక్యతా దినంగా పాటించాలన్నారు.

ట్రిబ్యూన్ జర్నలిస్టులపై కేసులకు ఖండన

న్యూఢిల్లీ: ఆధార్ సమాచార భద్రత డొల్లతనం గురించి వార్తలు రాసిన ట్రిబ్యూన్ పత్రిక జ ర్నలిస్టులపై నమోదు చేసిన కేసులను వెంటనే వుపసంహరించాలని బుధవారం గాంధీ పీస్ ఫౌండేషన్ హాలులో జరిగిన జర్నలిస్టు సభ డిమాండ్ చేసింది. నేషనల్ అలయన్స్ ఆఫ్ జర్నలిస్ట్స్(ఎన్ఏజె), ఢిల్లీ జర్నలిస్టుల యూనియన్(డియుజె) ఆధ్వర్వాన జరిగిన నిరసన సభలో ప్రముఖ జర్నలిస్టులు సుకుమార్ మురళీధరన్, పరంజయ్ గుహ థాకుర్దా, సీమా ముస్తఫా, ఎన్ఏజె అధ్యక్షుడు ఎస్‌కె పాండే, డియుజె ప్రధాన కార్యదర్శి సుజాత మధోక్ తదితరులు పాల్గొన్నారు. ట్రిబ్యూన్ పత్రిక సంపాదకుడు హరీష్ ఖరే ఈ సభకు పంపిన సందేశంలో దురహంకారులైన పాలకులు ట్రిబ్యూన్ పత్రిక విలేకరి, సంపాదకుడిని అరెస్టు చేయగలమని అనుకోవచ్చు, అదే జరిగితే నిజాయితీతో కూడిన వార్తలను వెలికి తీయాలని ప్రయత్నించే ఏ జర్నలిస్టు అయినా గట్టివిశ్వాసంతో, దేశంలో రక్షణ వుందని భావించగలరా అని ప్రశ్నించారు.

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State, Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State Editor : S.Veeraiah.Tel Tel/2014/59462.